


తెలంగాణ ప్రభుత్వం

మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ - చైల్డ్ లైన్ ఫౌండేషన్

బడిలోగానీ, బడి బయటగానీ వేధింపులకు గురవుతున్నా

ఆపదలో, కష్టాలలో ఉన్న పిల్లలను రక్షించడానికి

CHILD LINE 1098 NIGHT & DAY

24 HOUR NATIONAL HELPLINE

పిల్లలతో పనిచేయిస్తున్నా, వారిని బడికి పంపకుండా వేరే కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నా

కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఇబ్బందికరంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నా

1098 (పది-తొమ్మిది-ఎనిమిది) ఉచిత టెలిఫోన్ సేవా సౌకర్యానికి ఫోన్ చేయండి

IN ANY EMERGENCY

DIAL

100

TELANGANA POLICE

www.tspolice.gov.in

@ Telangana State Police



రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ

తెలంగాణ, హైదరాబాదు.

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ

# జాబిలి - 5

# తెలుగు వాచకం

## ఐదో తరగతి

Free



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ

SCERT TELANGANA

# వట్టికోట ఆళ్వారుస్వామి

వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
పలుకుతోంది పిడికిలెత్తి తెలంగాణ జోహారు!!

కన్నతల్లి కడుపులోన కల ఏదో కన్నావు
ఉద్యమాల ఉగ్గుబువ్వ చిన్ననాడె తిన్నావు
బతుకు పోరులోన జనం వెతలహోరు విన్నావు
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
ఉప్పెనగా ఎగిసిపడిన వెట్టిబతుకు కన్నీరూ!!

ఆదర్శం మూటగట్టి నెత్తికెత్తుకున్నావు
ఆశయాల పుస్తకాలు ఊరూరుకు పంచావు
గ్రంథమాల కట్టి చరిత బంధనాలు విప్పావు
గ్రంథాలయ ఉద్యమమై గడికి ఎదురు నిలిచావు
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
రజాకార్ల నెదురొడ్డిన అక్షరాల కైజారూ!!

జైలులోన జనజీవన విలువలు కనుగొన్నావు
కులమతాల పాదులల్ల కూడు పుట్టదన్నావు
భూస్వామ్యం కూల్చకుండ బువ్వ దొరుకదన్నావు
భూ విముక్తి ఉద్యమంల ముువ్వకట్టి నిలిచావు
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
అగ్నిధార అలుముకున్న త్యాగాల సెలయేరూ!!

కాలాన్నే చీల్చుకొని కలమై తిరిగొస్తావా
కాటగలిసె తెలంగాణ బాటలు నిర్మిస్తావా
వలస తెరలు కమ్మేసిన వెలుగులు వివరిస్తావా
వందనాలు ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారూ!
మల్ల నిన్ను పిలుస్తోంది తెలంగాణ మట్టిపోరూ!!



సుప్రసిద్ధ రచయిత, సాహితీవేత్త, తొలితరం కథారచయిత వట్టికోట ఆళ్వారు స్వామి నల్గొండ జిల్లాలోని చెరువు మాదారంలో 01-11-1915 నాడు జన్మించాడు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్ళాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన శుభసందర్భంలో 2015వ సంవత్సరంలో వట్టికోట ఆళ్వారు స్వామి శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. దీన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులోని సిటీసెంట్రల్ లైబ్రరీకి వట్టికోట ఆళ్వారు స్వామి పేరును పెట్టి నివాళులు అర్పించింది. ఈయన 05-02-1961 నాడు మరణించాడు. తెలంగాణలోని సాహితీప్రియులకు ఈయన స్ఫూర్తి కలిగించాడు. తెలంగాణ ప్రజలకు ఆరాధ్యుడైనాడు.

# పైడిమర్రి వేంకట సుబ్బారావు



బడి కార్యక్రమాలు ప్రార్థనతో ప్రారంభమవుతాయి. ప్రార్థనలో "వందేమాతరం", మన రాష్ట్ర గీతం, మన జాతీయ గీతం "జనగణమన" పాడుతాం. ప్రతిజ్ఞ చేస్తాం. ప్రతిజ్ఞ రాసింది ఎవరో తెలుసా! పైడిమర్రి వేంకట సుబ్బారావు. ఈయన నల్లగొండ జిల్లా అన్నెపర్తిలో 1916 జూన్ 10న పుట్టాడు. రాంబాయమ్మ, రామయ్య ఈయన అమ్మనాయనలు. చిన్నప్పటి నుండి దేశభక్తి ఎక్కువ. తను పుట్టిన నేల మీద గౌరవం ఎక్కువే. అలా పెరిగిన పైడిమర్రి ట్రెజరీ శాఖలో పనిచేశాడు.

విశాఖపట్నంలో పనిచేస్తున్నప్పుడు 1962లో చైనా యుద్ధం వచ్చింది. చైనా ప్రభుత్వం ఆ దేశ విద్యార్థులకు, యువకులకు దేశభక్తి కలిగించే పాఠాలు పెట్టారు. మన విద్యార్థులకు కూడా అలాంటి పాఠాలు, పాటలు ఉండాలనుకున్నాడు. అందుకే ప్రతిజ్ఞ రాశాడు.

పైడిమర్రి రాసిన ఈ ప్రతిజ్ఞ 1963లో ఆనాటి ప్రభుత్వం అధికారికంగా పాఠ్య పుస్తకాలలో చేర్చింది. ప్రతి రోజు ప్రార్థనలో విద్యార్థులచే చదివించాలని ఉత్తర్వులు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత కేంద్ర ప్రభుత్వం ప్రతిజ్ఞను ఇంగ్లీష్‌తోపాటు భారతీయ భాషల్లోకి అనువాదం చేయించింది. జనగణమన, వందేమాతరం లాగా ప్రతిజ్ఞకు కూడ అంత గుర్తింపు వచ్చింది.

పాఠ్య పుస్తకాలు ఉన్నంత కాలం సుబ్బారావు పేరు నిలిచే ఉంటుంది. ట్రెజరీ అధికారిగా పనిచేసిన పైడిమర్రి 1971లో ఉద్యోగ విరమణ చేశాడు. తర్వాత హోమియో వైద్యుడిగా నల్లగొండ పట్టణంలో దవాఖాన నడిపాడు. రోగులకు పైసలు తీసుకోకుండా మందులు ఇచ్చేవాడు.



పైడిమర్రికి తెలుగుతో పాటు సంస్కృతం, ఉర్దూ, పారసీ, ఇంగ్లీష్, అరబ్బీ భాషలు కూడ వచ్చు. కవిత్వం రాశాడు కథలు రాశాడు. అరబ్బీలోని కవిత్వాన్ని తెలుగులోకి అనువదించాడు. చాల తెలివైనవాడుగా గుర్తింపు పొందాడు. 1988 ఆగస్ట్ 13న చనిపోయాడు. ఇంత గొప్ప మనిషి మన తెలంగాణ వాడు కావడం మనకు ఎంతో గర్వకారణం కదా!

SCERT TELANGANA

# జాబిలి - 5

## తెలుగు వాచకం

## ఐదో తరగతి

### సంపాదకమండలి

**శ్రీ సువర్ణ వినాయక్,**
కో-ఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాద్, తెలంగాణ.

**ఆచార్య బన్న ఐలయ్య,**
తెలుగుశాఖ, కాకతీయ
విశ్వవిద్యాలయం, వరంగల్.

**శ్రీ దేశపతి శ్రీనివాస్,**
ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి,
ముఖ్యమంత్రి కార్యాలయం,
హైదరాబాద్, తెలంగాణ.

**డా॥ దహగాం సాంబమూర్తి,**
విశ్రాంత ప్రధానాచార్యుడు,
ఉపాధ్యాయ విద్యా కళాశాల వరంగల్.

**డా॥ ఎస్. రఘు,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం,
హైదరాబాద్.

**డా॥ పత్తిపాక మోహన్,**
ఎడిటర్, తెలుగువిభాగం,
నేషనల్ బుక్ ట్రస్టు, హైదరాబాద్.

### విషయనిపుణులు

**డా॥ నన్నూరు ఉపేందర్ రెడ్డి,**
విశ్రాంత ఆచార్యుడు, సలహాదారు,
విద్యా సంస్కరణలు, పాఠశాల విద్యాశాఖ,
హైదరాబాద్, తెలంగాణ.

**డా॥ ఎం. భూపాల్,**
బాలసాహితీవేత్త,
అంబర్ పేట,
హైదరాబాద్, తెలంగాణ.

**చిత్రాలు, ముఖచిత్రం : శ్రీ కూరెళ్ల శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా. కుర్మేడు, నల్లగొండ జిల్లా.

### పాఠ్యపుస్తక ప్రచురణ సమితి

**శ్రీ ఎస్. జగన్నాథ రెడ్డి**
సంచాలకులు,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ కె. కృష్ణమోహన్ రావు**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక,
పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ బి. సుధాకర్**
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించాలి
హక్కులను పొందాలి

"నా తెలంగాణ కోటి రత్నాల వీణ"

**తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్**

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

© Government of Telangana, Hyderabad

*First Published 2015*
*New Impression 2016, 2017, 2018, 2019, 2020, 2021*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Telangana.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

**తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22**

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

SCERT TELANGANA

# ముందుమాట

ఎన్నో పోరాటాల ఫలితంగా మనం కోరుకున్న తెలంగాణ రాష్ట్రం జూన్ 2, 2014 రోజున ఆవిర్భవించింది. మన రాష్ట్రంలో మన భాషతో కూడిన పాఠ్యపుస్తకాల ఆధారంగా పిల్లలు భాషను నేర్చుకోవాలి. తెలంగాణ సంస్కృతి, భాష, చరిత్ర మొదలైనవి పిల్లలు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశాలను నిర్ణయించడానికి కమిటీని నియమించించింది. కమిటీ సభ్యులు ప్రస్తుతం అమల్లో ఉన్న వాచకాలను సమీక్షించి తెలంగాణ ముద్ర ఉండేలా వాచకాలను రూపొందించడానికి కృషిచేశారు. తెలంగాణ రాష్ట్రంలో మన పిల్లల కోసం రూపొందిన తొలి వాచకం ఇది.

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 అమలులోకి వచ్చినందున పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందే హక్కును కల్గి ఉన్నారు. ప్రాథమిక స్థాయి పూర్తయ్యేసరికి పిల్లలందరూ చదువడం, అర్థం చేసుకోవడం, సొంతంగా రాయగల్గడం వంటి కనీస సామర్థ్యాలను కల్గి ఉండాలి. వీటిని సాధించిన పిల్లలకు ప్రాథమికోన్నత స్థాయిలో వివిధ విషయాల అభ్యసనం సులువవుతుంది. ప్రాథమిక స్థాయిలో మాతృభాషపైన పట్టుకల్గి ఉన్న పిల్లలు ఇతర భాషలను కూడా సులువుగా నేర్చుకోగల్గుతారు. వీటిని దృష్టిలో ఉంచుకొని పిల్లలందరూ పొందాల్సిన సామర్థ్యాలను విద్యా ప్రమాణాలుగా నిర్ధారించారు. ఈ నూతన పాఠ్యపుస్తకం వీటిని సాధించడానికి వీలుగా వినడం-ఆలోచించి మాట్లాడడం, చదివి అర్థం చేసుకోవడం, స్వీయరచన, సృజనాత్మకత, పదజాలాన్ని వినియోగించడం, భాషను గురించి తెలుసుకోవడం, ఉన్నతమైన వైఖరులను కల్గి ఉండడం వంటి సామర్థ్యాల ఆధారంగా రూపొందించారు.

ఈ నూతన పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాలను ప్రధానంగా ఐదు అంశాలను దృష్టిలో ఉంచుకొని ఎంపికచేశారు. అవి, 1. దేశభక్తి, విలువలు, మానవ సంబంధాలు 2. పిల్లల స్వభావం, శక్తి సామర్థ్యాలు ఆసక్తులు 3. పర్యావరణం, ప్రకృతి, సమాజం 4. సంస్కృతి, సంప్రదాయాలు, భాషాభిరుచి 5. హాస్యం, కాల్పనికత, సృజనాత్మకత. వీటికి సంబంధించిన వివిధ ప్రక్రియల్లోని పాఠాలను పొందుపర్చారు. కథలు, కథనాలు, పద్యాలు, సంభాషణలు, వ్యాసాలు, గేయకథలు, గేయరూపకాలు పాఠాలుగా ఉన్నాయి. ప్రతి పాఠం కూడా పిల్లల్లో ఆసక్తిని రేకెత్తించడానికి చిత్రంతో ప్రారంభం అవుతుంది. సొంతంగా చదువుకొని అర్థం చేసుకొనేలా సరళమైన భాష ఉన్నది. సాధించాల్సిన సామర్థ్యాల ఆధారంగా **'ఇవి చేయండి'** అనే శీర్షికతో అభ్యాసాలను పొందుపర్చారు. ఈ అభ్యాసాలు పూర్తి తరగతి, జట్టు, వ్యక్తిగత కృత్యాల రూపంలో ఉన్నాయి. పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి పిల్లలే కథలు, కవితలు, సంభాషణలు వంటివి రాయడాన్ని ప్రోత్సహించేలా అభ్యాసాలను చేర్చారు. చదువడం, రాయడం నేర్చుకొన్న పిల్లలు మరింత మెరుగ్గా క్రమపద్ధతిలో భావవ్యక్తీకరణ చేయడానికి వీలుగా అభ్యాసాలు ఉన్నాయి. వీటితో పాటు భాషకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం పిల్లలు పొందేలా **'భాషను గురించి తెలుసుకొందాం'** అనే శీర్షికతో అభ్యాసాలు ఉన్నాయి. పిల్లలను ఆలోచింపజేయడానికి, మాట్లాడించడానికి, పాఠంలోని విషయాన్ని ఊహించడానికి, విషయాన్ని అర్థం చేసుకోవడానికి వీటిలో చిత్రాలు కూడా ఉన్నాయి.

పిల్లలు తమను తాము అంచనా వేసుకోవడానికి వీలుగా **'నేనివి చేయగలనా?'** అనే స్వీయ మూల్యాంకన కృత్యాన్ని చేర్చారు. పిల్లల్లో నిఘంటువును చూసే అలవాటును పెంపొందించడానికి వీలుగా పాఠ్యపుస్తకం చివర **'పదాలు-అర్థాలు'** జాబితాను చేర్చారు. అట్లే పఠనాభిలాషను, భావప్రసార నైపుణ్యాలను పెంపొందించడానికి **'ప్రాజెక్టు పనులను'** పొందుపర్చారు. ప్రాథమిక స్థాయి పూర్తయ్యేసరికి పిల్లలందరు తప్పనిసరిగ చదువడం, రాయడం చేయగల్గాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వాచక ప్రారంభంలో చదువడం, రాయడం నేర్పడానికి సంసిద్ధత పాఠాలను చేర్చారు.

ఉపాధ్యాయులు ఈ పాఠ్యపుస్తకాన్ని భాగస్వామ్య పద్ధతుల్లో పిల్లలందరూ పాల్గొనేలా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. పిల్లలందరూ స్వేచ్ఛగా మాట్లాడేలా, ప్రశ్నించేలా చక్కటి వాతావరణాన్ని కల్పించాలి. బాల సాహిత్యం, కథల పుస్తకాలు, మేగజైన్ల వంటివి తరగతిలోనే అందుబాటులో ఉంచాలి.

పాఠ్యపుస్తకాల రూపకల్పనకోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు** గారికి, గౌరవ విద్యాశాఖ మంత్రి **శ్రీ కడియం శ్రీహరి** గారికి, పూర్వ విద్యాశాఖ మంత్రి **శ్రీ జి. జగదీశ్ రెడ్డి** గారికి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి **శ్రీమతి రంజీవ్. ఆర్. ఆచార్య** గారికి, పాఠశాల విద్యాశాఖ పూర్వ సంచాలకులు **శ్రీ ఎమ్. జగదీశ్వర్** గారికి, ప్రస్తుత సంచాలకులు **శ్రీ టి. చిరంజీవులు** గారికి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు **డా॥ కె.వి.రమణాచారి** గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వాచక రూపకల్పనలో పాల్గొన్న కమిటీ సభ్యులు, సంపాదక మండలి సభ్యులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, చిత్రకారులకు ధన్యవాదాలు. తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన తొలి వాచకం ఇది. కాబట్టి భాషాపరంగా లేదా ఇతర అంశాల గురించి విజ్ఞులు ఇచ్చే సలహాలు, సూచనలను ఎస్.సి.ఇ.ఆర్.టి. స్వీకరించి తగు చర్యలు చేపడుతుంది. ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచిని పెంచి ప్రాథమికోన్నతస్థాయికి అవసరమైన భాషాసామర్థ్యాల సాధనకు తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

తేది : 31/01/2015

స్థలం : హైదరాబాద్.

సంచాలకులు

రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

# ఉపాధ్యాయులకు సూచనలు

- ప్రాథమిక స్థాయి పూర్తయ్యేసరికి పిల్లలు తప్పనిసరిగా చదువడం, రాయడం చేయగలగాలి. పాఠాలు చదువగలగాలి, అర్థంచేసుకోగలగాలి.
- ఇందుకోసం పాఠాలకంటె ముందు సంసిద్ధత పాఠాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పిల్లలకు చదువడం, రాయడం అభ్యాసం చేయించాలి.
- సంసిద్ధతా పాఠాలకు తప్పనిసరిగా వర్ణమాల, గుణింతాలు, ఒత్తుల చార్టులను సిద్ధం చేసుకోవాలి. వీటిని అభ్యాసాల సందర్భంగా వినియోగించాలి.
- జూన్, జూలై మాసాలను పూర్తిగా ఇందుకోసమే వినియోగించుకోవాలి.
- పాఠాల బోధన ఆగస్టు నుండి ఫిబ్రవరి వరకు జరగాలి.
- ఈ పాఠ్యపుస్తకంలోని పాఠాలను సుమారు 160 పనిదినాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించారు. అనగా ఒక పాఠానికి సగటున 16 పనిదినాలు అవసరం. దీన్ని దృష్టిలో పెట్టుకొని 10 పాఠాలు చేర్చారు.
- పాఠ్యపుస్తకంలో పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాల జాబితా ఉన్నది. సంవత్సరాంతానికి వాటిని పిల్లలు సాధించేలా చూడాలి.
- మాతృభాషా బోధనకు ప్రతిరోజు 90 ని॥ల సమయం ఉంటుంది.
- ఈ 90 ని॥లలో మొదటి 45 ని॥లు ఉపాధ్యాయుడు బోధనాభ్యసన ప్రక్రియలకు వినియోగించాలి. రెండవ 45 ని॥లలో ఆ రోజు బోధించిన అంశం ఆధారంగా పిల్లలకు జట్టు లేదా వ్యక్తిగత కృత్యాల ద్వారా అభ్యసనం కల్పించాలి. వెనుకబడిన పిల్లలకు ఉపాధ్యాయులే దగ్గర ఉండి ప్రత్యామ్నాయ బోధన ద్వారా అవసరమైన అభ్యాసం కల్పించాలి.
- ఒక పాఠానికి ఉద్దేశించిన సామర్థ్యాలను కనీసం ఎనభైశాతం మంది పిల్లలు సాధించిన తరవాతే మరొక పాఠం ప్రారంభించాలి.
- పాఠం బోధించడం అంటే ఉన్ముఖీకరణ చిత్రం మొదలుకొని, నేనివి చేయగలనా? అనే శీర్షిక వరకు నిర్వహించాలి.
- ఉన్ముఖీకరణ చిత్రం ఆధారంగా మాట్లాడించడానికి ఒక పీరియడ్, 'పిల్లలూ! ఇట్లా చేయండి' లోని అంశాలను చేయడానికి ఒక పీరియడ్ అవసరమౌతుంది. తర్వాత 4 పీరియడ్లను పాఠం బోధించడానికి ఉపయోగించాలి.
- మిగిలిన 10 పీరియడ్లలో 'ఇవిచేయండి' శీర్షికలోని అభ్యాసాలను పిల్లలతో పాఠశాలలోనే చేయించాలి. సామర్థ్యానికి చెందిన అభ్యాసాలను సాధన చేయించాలి.
- ప్రతిరోజు భాషకు కేటాయించిన 90 ని॥లలో పాఠ్యబోధన లాగానే అభ్యాసాలను కూడా మొదటి 45 ని॥లలో ఎలా చేయాలో అవగాహన కల్పించాలి. పిల్లలు చేసిన పనిని పరిశీలించి తగిన సూచనలివ్వాలి. ఆ తర్వాత ఉండే 45 ని॥లలో పిల్లలు వ్యక్తిగతంగా అభ్యాసాలు చేసేలా చూడాలి.
- మొదటి 45 ని॥లలో బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించేటప్పుడు పిల్లలందరూ భాగస్వాములు కావాలి. ఉపాధ్యాయుడు తక్కువగా మాట్లాడాలి. పిల్లలకు మాట్లాడే అవకాశం కల్పించాలి. ప్రశ్నింపజేయాలి. వీటికోసం పూర్తి తరగతిగది కృత్యం ద్వారాగాని, జట్టుపని ద్వారా గాని బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.
- మొదటి 45 ని॥ కింది సోపానాలను పాటించాలి.

  I. **ఉపోద్ఘాతం** – పలకరింపు, ఉన్ముఖీకరణ లేదా పునశ్చరణ, శీర్షికాప్రకటన, నేపథ్యం.

  II. **పాఠ్యాంశ బోధన / సామర్థ్యాలపై అవగాహన** – చిత్రాలను గురించి మాట్లాడించడం, పిల్లలతో మౌనపఠనం బాహ్యపఠనం, ఉపాధ్యాయుని ఆదర్శపఠనం, పిల్లలతో అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ, అవగాహన.

  III. **అవగాహన పరిశీలన** – ఆ రోజు బోధించిన అంశాలపై పిల్లల అవగాహనను పరిశీలించడం.
- రెండవ 45 ని॥లలో పిల్లలకు ఆ రోజు బోధించిన అంశాల ఆధారంగా ఆయా సామర్థ్యాలపై అభ్యాసం కల్పించాలి.

- ప్రతి పాఠాన్ని ఆ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాల సాధనకు ప్రణాళికను రూపొందించుకోవాలి. తెలుగులో పాఠ్యప్రణాళికను కింది విధంగా రూపొందించుకోవాలి.
    1. పాఠం పేరు :
    2. పాఠం బోధించడానికి అవసరమైన పీరియడ్లు :
    3. సాధించాల్సిన సామర్థ్యాలు :
    4. పీరియడ్ల వారీ విభజన :

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం మొదటి 45 ని॥లు | బోధించే వ్యూహం | సామగ్రి / వనరులు | రెండవ 45 ని॥లలో పిల్లలకు కల్పించాల్సిన అభ్యాసం |
|---|---|---|---|---|
| | | | | |

    5. పాఠ్యబోధనకు అవసరమైన అదనపు సమాచార సేకరణ (ఉపాధ్యాయుని తయారీ) :
    6. పాఠం బోధించిన అనంతరం ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు (అనుభవాలు, అనుభూతులు) :
- పిల్లలు ఎట్టి పరిస్థితిలో గైడ్లు, స్టడీమెటీరియల్ వంటి వాటిలో చూసి రాయకూడదు. సొంతంగా రాయాలి. ఇలా రాసిన వాటిని ఉపాధ్యాయుడు సరిదిద్దాలి.
- అలాగే 'నేనివి చేయగలనా' శీర్షికలోని అంశాలలో ఒక్కొక్క అంశాన్ని ఎంతమంది పిల్లలు చేయగల్గారో పరిశీలించాలి. ప్రత్యామ్నాయ బోధన నిర్వహించాలి.
- పిల్లలు తాము రాయవలసిన అంశాలను అభ్యాస పీరియడ్‌లోనే పూర్తి చేసేలా చూడాలి. దానిపైన చర్చ నిర్వహించాలి.
- పాఠ్యపుస్తకంతోపాటు పాఠశాలలోని వానచినుకులు, కథలు, కథావాచకాలు, కథల పుస్తకాలు వంటి బాలసాహిత్య పుస్తకాలను చదివించాలి. వాటి గురించి డైరీలో రాయించాలి. మాట్లాడించాలి.
- ప్రాజెక్టుపనులు, సృజనాత్మకత ప్రశంసకు సంబంధించిన కృత్యాలను గురించి పూర్తి తరగతికృత్యంగా అవగాహన కల్పించాలి. జట్టుపనులుగా చేయించాలి. వాటిపైన చర్చ నిర్వహించాలి. తర్వాత 45 ని॥లు పీరియడ్‌లో పిల్లలచేత వ్యక్తిగతంగా రాయించాలి.
- పిల్లలు రాసిన సృజనాత్మక వ్యక్తీకరణ / ప్రాజెక్టుపనుల ఆధారంగా ఒక్కో పాఠానికి ఒక సంకలనంతో పుస్తకాన్ని తయారుచేయాలి. వాటిని ప్రదర్శించాలి.
- నిరంతర సమగ్ర మూల్యాంకనానికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలుగా నిర్వహిస్తారు.
- నిర్మాణాత్మక మూల్యాంకనంలో భాగంగా జులై, ఆగస్ట్, నవంబర్, ఫిబ్రవరి మాసాలలో పిల్లల ప్రగతిని నమోదుచేయాలి. ఇందుకోసం 1. పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందనలు (పుస్తక పఠనం, నివేదిక రాయడం), 2. పిల్లలు రాసిన అంశాలు (నోటు పుస్తకాలు), 3. ప్రాజెక్టుపనులు, 4. లఘుపరీక్ష వంటి అంశాల ఆధారంగా నమోదుచేయాలి. పాఠాలు, అభ్యాసాలు ఇందుకు అనుగుణంగా ఉన్నవి.
- పిల్లలు రాసిన అంశాలకు మార్కులు కేటాయించడానికి, పిల్లల పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలను ఆధారంగా తీసుకోవాలి. పిల్లలు పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను సొంతంగా రాస్తేనే మార్కులు కేటాయించాలి. గైడ్లు, స్టడీమెటీరియల్ వంటివి చూసి రాస్తే మార్కులు కేటాయించకూడదు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ఉపాధ్యాయులు సొంతంగా ప్రశ్నపత్రాలను రూపొందించుకొని నిర్వహించాలి.
- సిలబస్ పూర్తిచేయడమంటే పాఠాల ఆధారంగా సాధించాల్సిన సామర్థ్యాలను సాధించడమని అర్థం. కాబట్టి ఇందుకు కృషిచేయాలి.

SCERT TELANGANA

## పిల్లలూ! కింది అంశాలు చదువండి. ఆ సూచనల ప్రకారం చేయండి.

- పాఠ్యపుస్తకం కవరు పేజి లోపలి వైపున్న పాటను నేర్చుకొని పాడండి.
- ప్రతి పాఠంలో ముందుగా ఒక చిత్రం ఉంటుంది. ఆ చిత్రాన్ని చూడండి, దాని కింద ఉన్న ప్రశ్నలకు జవాబులను ఆలోచించి చెప్పండి.
- **"పిల్లలూ! ఇట్లా చేయండి!"** అనే గడిలోని సూచనలు చదువండి. వాటి ప్రకారం చేయండి.
- పాఠం చదువడానికి ముందు పాఠంలోని బొమ్మలను చూడండి, వాటి ఆధారంగా పాఠంలోని విషయాన్ని ఊహించండి. చిత్రాల ఆధారంగా సంభాషణలు చెప్పండి.
- ప్రతి రోజు పాఠాన్ని బిగ్గరగా చదువండి. మీ ఉపాధ్యాయుడు చదివేటప్పుడు జాగ్రత్తగా వినండి. మీకు తెలియని పదాలు / చదువలేకపోయిన పదాలను మీ ఉపాధ్యాయుడు ఎట్లా పలుకుతున్నాడో జాగ్రత్తగా వినండి.
- పాఠాన్ని చదివి అర్థం కాని పదాల కింద గీతగీయండి. వాటి అర్థాలను పుస్తకం చివర **"పదాలు - అర్థాలు"** పట్టికలో చూసి తెలుసుకొండి. ఒకవేళ పట్టికలో పదాలు లేనట్లైతే మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకొండి.
- మీ ఉపాధ్యాయుడు పాఠం చెప్పేటప్పుడు జాగ్రత్తగా వినండి, మీకు తెలియని వాటి గురించి, పదాల గురించి, విషయం గురించి తప్పకుండా అడిగి తెలుసుకోవాలి.
- పాఠం తర్వాత ఇచ్చిన **"ఇవి చేయండి"**లోని అభ్యాసాలను మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకొండి. ఆ తర్వాత మీరే సొంతంగా రాయాలి.
- అభ్యాసాలలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను గైడ్లలోగాని, ఇతరుల నోటు పుస్తకాలలో గాని చూసి రాయకూడదు. ఎందుకంటే దానివల్ల మీకు సొంతంగా రాయడం రాదు.
- అభ్యాసాలలోని ప్రాజెక్టుపనిని ఎట్లా చేయాలో మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకొండి. అవసరమైతే మీ తోటివారితో కలిసి చేయండి. మీరు రాసిన జవాబులను, చేసిన ప్రాజెక్టుపనులను తరగతిగదిలో చదివి వినిపించండి.
- సృజనాత్మకతలో ఇచ్చిన అభ్యాసాలను మీరు మీ మిత్రులతో కలిసి జట్లలో చేయండి. ఎట్లా చేయాలో మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకొండి. ఆ తర్వాత మీరు జట్లలో రాసిన వాటిని చదివి వినిపించండి. మీ ఉపాధ్యాయుడు ఇచ్చిన సూచనల ప్రకారం సరిచేసుకొండి. సరిచేసుకొన్న తర్వాతనే నోటుపుస్తకాలలో రాయండి.
- పాఠంలో చివర **'నేనివి చేయగలనా?'** అనే పట్టిక ఉన్నది. ఈ పట్టికలోని ఒక్కొక్క వాక్యాన్ని చదువండి. చేయగల్గితే ఔనని, చేయలేకపోతే కాదని గుర్తించండి. మీరు చేయలేని వాటి గురించి మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి మళ్ళీ అభ్యాసం చేయండి.
- పుస్తకంలో **'చదువు - ఆనందించు'** పేరుతో అంశాలున్నాయి. వీటిని మీరే సొంతంగా చదువండి.
- పుస్తకంలో పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు ఉన్న పేజీని చదువండి. ఏడాది చివరకు మీరు అవన్నీ చేయగలగాలి.

SCERT TELANGANA

# వందేమాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందేమాతరం, వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం; వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

# జాతీయ గీతం

– రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధ్ గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాగే !
గాహే తవ జయ గాథా !
జనగణ మంగళదాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

# ప్రతిజ్ఞ

– పైడిమర్రి వేంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల, సేవానిరతి కలిగి ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

# ఆశించిన అభ్యసన ఫలితాలు

**తెలుగు**
**5వ తరగతి**

## విద్యార్థులు ఇవన్నీ నేర్చుకుంటారు....

- తాము చూసిన, విన్న, చదివిన అంశాల్లోని విషయం, సంఘటనలు, చిత్రాలు, పాత్రలు, శీర్షిక మొదలైన వాటిపై మాట్లాడగలరు. తమ అభిప్రాయాలను సహేతుకంగా చెప్పగలరు. సారాంశం చెప్పగలరు.
- చిత్రాలను చూసి పాఠ్యాంశ విషయాలను ఊహించగలరు.
- భాషలోని జాతీయాలను, సామెతలను సందర్భానుసారంగా ఉపయోగించి రాయగలరు.
- పత్రికలు, బాల సాహిత్యం, పోస్టరు మొదలైన భాషా సామగ్రిలో ఉన్న సున్నితమైన / కీలకాంశాల గురించి మౌఖికంగా, లిఖిత రూపంగా వ్యక్తపరుస్తారు.
- అపరిచిత పదాలకు అర్థాలను నిఘంటువులో వెతుకుతారు.
- ఉపాధ్యాయుని ద్వారా నిర్ణయించబడిన ప్రక్రియలలో రాయడాన్ని, తాము రాసినటువంటి విషయంతో పోల్చి చూడగల్గుతారు. దాంట్లో మార్పులు తెలుసుకుంటారు. (ఉదా: ఏదైనా సంఘటన గురించి తెలుసుకొని రాయడం, బడిలోని గోడ పత్రిక గురించి రాయడం, సంచిక కొరకు రాయడం).
- భాషలోని వ్యాకరణపరమైన అంశాలు (ఉదా: విభక్తులు, క్రియలు, కాలాలు) గుర్తించడం మరియు వాటి పట్ల జాగరూకులై రాయగలరు.
- రాసేటప్పుడు విరామ చిహ్నాలు (ఉదా: ఫుల్‌స్టాప్, కామా, ప్రశ్నార్థక చిహ్నాలు, మొ॥ వాటిని) ఉపయోగిస్తారు.
- స్థాయికి అనుకూలంగా వేరు వేరు విషయాలలో వివిధ వృత్తులు, కళలు, గణితం, EVS, నృత్యకళ) మొదలగు వాటిలో ఉపయోగించినటువంటి పదాలను అర్థం చేసుకుంటూ, సందర్భానుసారంగా రాయగలుగుతారు.
- ఊహించి కథలు, సంభాషణలు, పోస్టరు, ఆత్మకథ, కవితలు, లేఖలు మొ॥ రాయగలరు.

విద్య మా హక్కు
సర్వశిక్షా అభియాన్
అందరూ చదవాలి - అందరూ ఎదగాలి

పాఠశాల విద్యా శాఖ,
తెలంగాణ ప్రభుత్వం

एन सी ई आर टी
NCERT

SCERT TELANGANA

# పాఠ్యపుస్తక సమీక్ష మరియు అభివృద్ధి కమిటి సభ్యులు

## విశ్వవిద్యాలయ స్థాయి

**ఆచార్య రవ్వా శ్రీహరి,** పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
**ఆచార్య ఎన్. గోపి,** పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య,** విశ్రాంత ఆచార్యుడు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**ఆచార్య ఎస్. వి. రామారావు,** విశ్రాంత ఆచార్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య బన్న అయిలయ్య,** తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ ఎన్. రజని,** తెలుగు విభాగాధిపతి, డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ జి. బాలశ్రీనివాస మూర్తి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్ జిల్లా.

## విద్యావేత్తలు, విషయనిపుణులు

**డా॥ చుక్కా రామయ్య,** విద్యావేత్త, హైదరాబాద్.
**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ఉపాధ్యాయ విద్యా కళాశాల వరంగల్.
**డా॥ నందిని సిధారెడ్డి,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట, మెదక్ జిల్లా.
**డా॥ నలిమెల భాస్కర్,** విశ్రాంత ఉపన్యాసకుడు, ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల, కరీంనగర్ జిల్లా.
**డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చండూరు, నల్లగొండ జిల్లా.
**డా॥ ముదిగంటి సుజాతారెడ్డి,** విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్.బి.వి.ఆర్.ఆర్. కళాశాల, హైదరాబాద్.
**శ్రీ వేణు సంకోజు,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ జిల్లా.
**శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట, మెదక్ జిల్లా.
**శ్రీ దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.
**డా॥ నన్నూరు ఉపేందర్ రెడ్డి,** సలహాదారు, విద్యా సంస్కరణలు, పాఠశాల విద్యాశాఖ, హైదరాబాద్, తెలంగాణ.
**శ్రీ కె. కృష్ణమోహన్ రావు,** ప్రొఫెసర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**శ్రీమతి ఎమ్.దీపిక,** ఉపన్యాసకురాలు, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**శ్రీ సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**శ్రీ కె.రాజేందర్ రెడ్డి,** కో-ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**శ్రీ తల్లావజ్ఝల మహేశ్‌బాబు,** ఉపన్యాసకుడు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, నిజామాబాద్ జిల్లా.

## క్షేత్ర స్థాయి

**శ్రీ పల్లెర్ల రామమోహన రావు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.
**శ్రీ వి. చెన్నయ్య,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.
**శ్రీ వొజ్జల శరత్‌బాబు,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.
**శ్రీ అవుసుల భానుప్రకాశ్,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.
**శ్రీ కందాడై రంగరాజు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పాఠశాల, రంగాపురం, రంగారెడ్డి జిల్లా.
**శ్రీ ఎల్.మృత్యుంజయ ప్రసాద్,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., హిమాయత్‌నగర్, సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.
**శ్రీమతి పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాద్.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

# రూపకల్పనలో పాల్గొన్నవారు

**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని,
భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.

**బెజ్జారపు వినోద్‌కుమార్,** ఎస్.ఎ.,
జి.ప.ఉ.పా., గాగిల్లాపూర్, బెజ్జంకి, కరీంనగర్ జిల్లా.

**కోట సుకన్య,** ఉపాధ్యాయిని,
జి.బి.పి.ఎస్., తిరుమలగిరి, హైదరాబాద్.

**కోట వెంకటేశ్వర్లు,** ఉపాధ్యాయుడు,
ప్రా.పా., తిర్మలాయపల్లి, రాయపర్తి (మం), వరంగల్ జిల్లా.

**పల్లెర్ల రామమోహన రావు,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**వి. చెన్నయ్య,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.

**ఎల్.మృత్యుంజయ ప్రసాద్,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**నందిగామ కిశోర్‌కుమార్,** భాషోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా., ఇప్పటూరు, నవాబుపేట (మం),
మహబూబ్‌నగర్ జిల్లా.

**వొజ్జల శరత్ బాబు,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.

**పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు
ప్రా.పాఠశాల, గిమ్మ, జైనథ్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**సంబరాజు రవి ప్రకాశరావు,** ఉపాధ్యాయుడు,
ప్రా.పా., గోవిందాయపల్లి తాండ, కడ్తాల, రంగారెడ్డి జిల్లా.

**వురిమళ్ళ సునంద,** ఉపాధ్యాయిని,
ఉ.ప్రా.పా., లక్ష్మీపూర్, ముదిగొండ (మం), ఖమ్మం జిల్లా.

**డా॥ గట్టు త్రివేణి,** భాషోపాధ్యాయిని,
జి.ప.ఉ.పా. (బాలికల), చెన్నూరు, ఆదిలాబాద్ జిల్లా.

**కోండ్రు ఉదయ్‌కుమార్,** ఉపాధ్యాయుడు,
ప్ర.ప్రా.పా., సబ్జిమండి-2, ఆసిఫ్‌నగర్-1, హైదరాబాద్.

**కళాశికం ఉపేందర్ రావు,** ఉపాధ్యాయుడు,
ప్రా.పా., పీర్యాతాండ, తుర్కపల్లి, నల్లగొండ జిల్లా.

**వేముగంటి మురళీకృష్ణమాచారి,** భాషోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా., కొల్లూరు, ఆర్.సి.పురం (మం), మెదక్ జిల్లా.

**ఊరడిగాళ్ళ బుగ్గమ్మ,** భాషోపాధ్యాయిని,
మం, ప, యు.పి.ఎస్. భీమారం, ఫరూఖ్‌నగర్ (మం),
మహబూబ్‌నగర్ జిల్లా.

---

**డి.టి.పి., లే ఔటు & డిజైనింగ్ : ప్రతిమ పాతూరి,** హైదరాబాద్.

SCERT TELANGANA

# 5వ తరగతి - విషయసూచిక

## పాఠ్యాంశాలు



| క్ర.సం. | పాఠం పేరు | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|
| | సంసిద్ధత పాఠాలు | చదువడం-రాయడం | అభ్యాసాలు | జూన్-జూలై | 2 |
| 1. | మనజెండా | దేశభక్తి | గేయం | ఆగస్టు | 19 |
| 2. | యాదగిరిగుట్ట | దర్శనీయ స్థలం, సంస్కృతి | వ్యాసం | ఆగస్టు | 26 |
| 3. | సాలార్‌జంగ్ మ్యూజియం | దర్శనీయ స్థలం, చరిత్ర | డైరీ | సెప్టెంబరు | 33 |
| ★ | ప్యారా హైదరాబాద్ | సంస్కృతి | గేయం | | 42 |
| 4. | నీడ ఖరీదు | హాస్యం, మానవ స్వభావం | కథ | అక్టోబరు | 43 |
| 5. | నీతి పద్యాలు | నైతిక విలువలు | పద్యాలు | నవంబరు | 53 |
| ★ | తెలుగు సంవత్సరాలు | సంస్కృతి | కథనం | | 61 |
| 6. | మనసుంటే మార్గముంటది | వికలాంగుల పట్ల సున్నితత్వం, ఆత్మవిశ్వాసం | లేఖ | నవంబరు | 62 |
| ★ | బోనాలు | సంస్కృతి | వ్యాసం | | 70 |
| 7. | చిట్యాల ఐలమ్మ | స్ఫూర్తి, తెలంగాణ చరిత్ర | గేయం | డిసెంబరు | 71 |
| 8. | వృథాచేయం | పర్యావరణ స్పృహ | సంభాషణ | జనవరి | 79 |
| ★ | క్రిస్మస్ | సంస్కృతి | వ్యాసం | | 88 |
| 9. | గోపి డప్పు | పిల్లల స్వభావం | కథ | ఫిబ్రవరి | 89 |
| 10. | చింతచెట్టు | పర్యావరణం | స్వగతం | ఫిబ్రవరి | 97 |
| | పదాలు - అర్థాలు | | | | 107 |



SCERT TELANGANA

# 1. వర్ణమాల

I. కింది వర్ణమాలను చూడండి. అక్షరాలను చదువండి.

## అచ్చులు

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ
ఎ ఏ ఐ ఒ ఓ ఔ ఁ ం ః

## హల్లులు

క ఖ గ ఘ ఙ
చ ౘ ఛ జ ౙ ఝ ఞ
ట ఠ డ ఢ ణ
త థ ద ధ న
ప ఫ బ భ మ
య ర ల వ శ ష స హ ళ క్ష ఱ

- నీలం రంగులో ఉన్న అక్షరాలను పలుకండి.
- ఎరుపు రంగులో ఉన్న అక్షరాలను పలుకండి.
- గులాబి రంగులో ఉన్న అక్షరాలను పలుకండి.



SCERT TELANGANA

**II.** కింది పదాలు చదువండి. గులాబి రంగు అక్షరాలను విడిగా పలకండి వాటిని వర్ణమాలలో చూపండి.

| | | | |
|---|---|---|---|
| అలసట | కలబంద | తలగడ | వసంతం |
| ఆనందం | ఖగం | పథకం | శనగ |
| ఇవతల | గగనం | దవడ | షడంగం |
| ఈదడం | ఘటన | ధనబలం | సమరం |
| ఉదయం | చదరంగం | నవతరం | హవనం |
| ఊగడం | ఛందం | పడమర | తళతళ |
| ఎడమ | జగడం | ఫలవంతం | క్షణక్షణం |
| ఏమనగ | ఝషం | బలపం | ఱంపం |
| ఐదవ | టపటప | భవనం | నవవసంతం |
| ఒకటవ | కమఠం | మరకతం | గరళకంఠం |
| ఓడ | డబడబ | యమగండం | ఆనందకరం |
| ఔషధం | ఢంక | రచన | జనకవంశం |
| అందరం | గణగణ | లవణం | మందగమనం |

SCERT TELANGANA

**III.** ‘ చ ద వ డ ం ఒ క ఆ ట ’ – దీనిలోని అక్షరాల ఆధారంగా పదాలు రాయండి.

____________ ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

# 2. సరళ పదాలు

**I.** మీ మిత్రుల పేర్లను చెప్పండి. వారి పేర్లలో వర్ణమాల అక్షరాలను గుర్తించండి. వాటిని రాయండి.

_____ _____ _____ _____ _____ _____ _____ _____ _____ _____

_____ _____ _____ _____ _____ _____ _____ _____ _____ _____

**II.** పైన రాసిన అక్షరాలు కాకుండా వర్ణమాలలోని మిగతా అక్షరాలు కింద రాయండి.


_____ _____ _____ _____ _____ _____ _____ _____ _____ _____



_____ _____ _____ _____ _____ _____ _____ _____ _____ _____


_____ _____ _____ _____ _____ _____ _____ _____ _____ _____

_____ _____ _____ _____ _____ _____ _____ _____ _____ _____

**III.** కింది బొమ్మలను చూడండి. వాటి పేర్లు రాయండి.

 _____  _____  _____  _____

 _____  _____  _____  _____

 _____  _____  _____  _____

SCERT TELANGANA

**IV. వర్ణమాలలోని అక్షరాల ఆధారంగా పట్టికలో పదాలు రాయండి.**

| రెండు అక్షరాల పదాలు | మూడు అక్షరాల పదాలు | నాలుగు అక్షరాల పదాలు |
|---|---|---|
| | | |

**V. 'టపటప, గలగల, డబడబ' - ఇలాంటి పదాలు మరికొన్ని రాయండి.**

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

సంసిద్ధత పాఠం

# 3. గుణింత పదాలు చదువడం

**I.** కింది బొమ్మలను చూడండి. వాటి పేర్లు చదువండి. వీటిలో గుణింతాక్షరాలను గుర్తించండి.


దీపావళి


ఆకుకూరలు


తేనెటీగ


సైకిలు


గోలకొండ


గౌను

**II.** పై బొమ్మల పేర్లలోని గుణింతాక్షరాలను సంబంధిత గడిలో రాయండి.

| ✓ | ా | ి | ీ | ు | ూ |
|---|---|---|---|---|---|
| | | | | | |

| ె | ే | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|
| | | | | | |

SCERT TELANGANA

## III. కింది బొమ్మలు చూడండి. సరియైన పేరును గుర్తించండి.

| | | | | |
|---|---|---|---|---|
|  | కాకరకాయ | కకారకాయ | కాకారకయా | కాకారాకాయా |
|  | కందీరీగ | కిందిరిగ | కందిరీగ | కందీరిగ |
|  | నూరు | నురు | నురూ | నూరూ |
|  | చేపల చెరువు | చెపలచేరవు | చాపెల చెవులు | చీపల చెరువు |
|  | పోడుగుకోటు | పొడుగుకోటు | పొడూగుకోటు | పొడుగూకోటు |
|  | రేలు | రౌలు | రెలు | రైలు |
|  | పౌడరు | పాడేరు | పోడరు | పీడరు |

## IV. కింది వాక్యాలు చదువండి.

1) మంచి వారి మాటలు మనకు మేలుచేయును.

2) చదువుకుంటే మనకు తెలివి పెరుగుతుంది.

3) రోజూ మనం ఆటలు ఆడుకోవాలి.

4) కలిసి ఉంటే కలదు సుఖం.

5) గోరంత దీపం కొండంత వెలుగు.

SCERT TELANGANA

V. కింది పట్టికలోని గుణింత పదాలను చదువండి. ఏయే గుణింతాక్షరాలకు పదాలు లేవో చెప్పండి.

| గుణింతం | | పదాలు | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| తలకట్టు | ✓ | క | గ | చ | జ | ట | డ | త | ద | న |
| దీర్ఘం | ా | కాడ | గాలం | చాయ | జామ | టాక | డాబా | తాత | దానం | నావ |
| గుడి | ి | కిటికి | గిలక | చివర | జింక | ఒకటి | డింగరి | తిలకం | దివిటి | నిజం |
| గుడిదీర్ఘం | ీ | కీటకం | గీత | చీర | జీడి | టీకా | డీలా | తీగ | దీపం | నీడ |
| కొమ్ము | ు | కుండ | గుడి | చురుకు | రాజు | కాటు | శివుడు | తురుము | దురద | నుదురు |
| కొమ్ముదీర్ఘం | ూ | కూజా | గూడు | చూరు | జూలు | టూరు | గూడూరు | తూము | దూరం | నూరు |
| ఎత్వం | ె | కెరటం | గెలుపు | చెలిక | జెండా | టెంక | దండెం | తెలుపు | పందెం | నెల |
| ఏత్వందీర్ఘం | ే | కేక | గేదె | చేను | జేబు | టేకు | డేరా | తేలు | దేవుడు | నేల |
| ఐత్వం | ై | కైక | గైడు | చైనా | జైలు | టైరు | డైరీ | తైలం | దైవం | నైజం |
| ఒత్వం | ొ | కొడుకు | గొడుగు | చొరవ | జొ | టొ | డొంక | తొందర | దొర | నొసలు |
| ఓత్వందీర్ఘం | ో | కోడలు | గోడ | చోటు | జోల | టోపి | డోలు | తోట | దోస | నోరు |
| ఔత్వం | ౌ | కౌముది | గౌరి | చౌక | జౌళి | టౌను | డౌటు | తౌడు | దౌడు | నౌకరు |
| సున్న (అనుస్వారం) | ం | కంప | గంప | చందనం | జంతువు | టంకం | డంబం | తంగేడు | దంచు | నంది |

SCERT TELANGANA

## పదాలు

| ప | బ | మ | య | ర | ల | వ | శ | స | హ | ళ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| పాట | బాజా | మామ | యాగం | రాగం | లాభం | వాన | శాపం | సాగర్ | హారం | భళా |
| పిలక | బిరడా | మిరప | హాయి | రింగు | లివరు | వింత | శిరం | సినిమా | హిమం | తాళి |
| పీట | బీర | మీగడ | ఓయీ | రీలు | లీటరు | వీధి | శీతలం | సీసా | హీనం | ఖాళీ |
| పులుపు | బురద | మునుగు | యువత | రుచి | లుంగి | వాయువు | శునకం | సుందరం | హుండి | తళుకు |
| పూలు | బూటు | మూలుగు | యూరప్ | రూపం | లూటీ | మావూరు | శూలం | సూది | హూనం | ళూ |
| పెరుగు | బెరడు | మెడ | పోయెను | రెండు | లెంప | వెదురు | కాశె | సెలవు | హెలెన్ | ళె |
| పేరు | బేడీలు | మేడ | యే | రేగుపండు | లేత | వేరు | శేషం | సేరు | హేమం | కళేబరం |
| పైసలు | బైరాగి | మైదాకు | యై | రైతు | లైను | వైరం | శైలి | సైకిలు | హైరానా | ళై |
| పొగరు | బొంగరం | మొసలి | యొక | రొద | లొసుగు | వొ | శొంఠి | సొగసు | హొయలు | ళొ |
| పోరు | బోనం | మోసం | యోగి | రోకలి | లోటు | పోవోయి | శోభ | సోమరి | హోరు | కాళోజి |
| పౌడరు | బౌ | మౌనం | యౌ | రౌతు | లౌకికం | వౌ | శౌరి | సౌధం | హౌరా | ళౌ |
| పందెం | బంతి | మందం | యంత్రం | రంపం | లంక | వంద | శంఖం | సుంబురం | హంస | తాళం |

SCERT TELANGANA

సంసిద్ధత పాఠం

# 4. గుణింత పదాలు రాయడం


**I.** కింది పట్టికలో గుణింతాక్షరాలను రాయండి.


| అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ | ఎ | ఏ | ఐ | ఒ | ఓ | ఔ | ం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ✓ | ా | ి | ీ | ు | ూ | ె | ే | ై | ొ | ో | ౌ | ం |
| క | | | | | | | | | | | | |
| గ | | | | | | | | | | | | |
| చ | | | | | | | | | | | | |
| జ | | | | | | | | | | | | |
| ట | | | | | | | | | | | | |
| డ | | | | | | | | | | | | |
| త | | | | | | | | | | | | |
| ద | | | | | | | | | | | | |
| న | | | | | | | | | | | | |
| ప | | | | | | | | | | | | |
| బ | | | | | | | | | | | | |
| మ | | | | | | | | | | | | |
| య | | | | | | | | | | | | |
| ర | | | | | | | | | | | | |
| ల | | | | | | | | | | | | |
| వ | | | | | | | | | | | | |
| శ | | | | | | | | | | | | |
| ష | | | | | | | | | | | | |
| స | | | | | | | | | | | | |
| హ | | | | | | | | | | | | |
| ళ | | | | | | | | | | | | |

SCERT TELANGANA

**II.** కింది పక్షులు, జంతువుల బొమ్మలు చూడండి. పేర్లు రాయండి.

 ____________
 ____________
 ____________
 ____________

 ____________
 ____________
 ____________
 ____________

 ____________
 ____________
 ____________
 ____________

 ____________
 ____________
 ____________
 ____________

**III.** కింది పట్టికను చూడండి. అందులో ఉన్న రామాయణంలోని పాత్రల పేర్లను వెతికి రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| రా | తు | త | డు | థ |
| వా | సీ | ము | ర | యు |
| మం | ను | భ | ద | టా |
| లి | హ | తా | యి | వు |
| కే | థు | శ | కై | జ |




____________ ____________
____________ ____________
____________ ____________
____________ ____________
____________ ____________

SCERT TELANGANA


సంసిద్ధత పాఠం

# 5. ఒత్తుల పదాలు – చదువడం

**I.** కింది బొమ్మలను చూడండి. పదాలు చదువండి. ఒత్తు అక్షరాన్ని గుర్తించండి. ఒత్తు గుర్తును గడిలో రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
|  | – కుక్క | – క్క | – ‘ క ’ ఒత్తు | |
|  | – ముగ్గు | – గ్గ | – ‘ గ ’ ఒత్తు | |
|  | – ఆకుపచ్చ | – చ్చ | – ‘ చ ’ ఒత్తు | |
|  | – పూలసజ్జ | – జ్జ | – ‘ జ ’ ఒత్తు | |
|  | – పుట్ట | – ట్ట | – ‘ ట ’ ఒత్తు | |
|  | – లడ్డు | – డ్డ | – ‘ డ ’ ఒత్తు | |
|  | – నత్త | – త్త | – ‘ త ’ ఒత్తు | |
|  | – గద్ద | – ద్ద | – ‘ ద ’ ఒత్తు | |

SCERT TELANGANA

| | | | | |
|---|---|---|---|---|
|  | - దున్నపోతు | - న్న | - ' న ' ఒత్తు | |
|  | - చెప్పులు | - ప్పు | - ' ప ' ఒత్తు | |
|   | - సబ్బు | - బ్బు | - ' బ ' ఒత్తు | |
|  | - బతుకమ్మ | - మ్మ | - ' మ ' ఒత్తు | |
|  | - రొయ్య | - య్య | - ' య ' ఒత్తు | |
|  | - విసనకర్ర | - ర్ర | - ' ర ' ఒత్తు | |
|  | - ముల్లంగి | - ల్ల | - ' ల ' ఒత్తు | |
|  | - పువ్వు | - వ్వు | - ' వ ' ఒత్తు | |
|  | - ధనుస్సు | - స్సు | - ' స ' ఒత్తు | |
|  | - పెళ్ళి | - ళ్ళి | - ' ళ ' ఒత్తు | |

SCERT TELANGANA

## II. కింది పదాలను చదవండి. గులాబి రంగులోని ద్విత్వాక్షరాలను స్పష్టంగా పలకండి.

| | | | | |
|---|---|---|---|---|
| అమ్మ | పెద్దనాన్న | చెక్కర | అల్లరి | వెన్నెల |
| అయ్య | మామయ్య | బెల్లం | పిల్లలు | కొప్పెర |
| అన్న | పొయ్యి | సున్నం | తక్కెడ | గబ్బిలం |
| అక్క | నెయ్యి | అన్నం | బొగ్గు | గుమ్మి |
| అత్త | జీలకర్ర | బియ్యం | పిచ్చుక | మర్రి |
| తమ్ముడు | ఉప్పు | నీళ్ళు | గజ్జెలు | మల్లె |
| చిన్నాన్న | నువ్వులు | సుద్దముక్క | గడ్డపార | లస్సీ |
| చిన్నమ్మ | నిప్పు | బొమ్మలు | కత్తెర | కళ్ళెం |
| పెద్దమ్మ | కొబ్బరి | పెన్ను | మిద్దె | గుఱ్ఱం |

## III. కింది పేరాను చదవండి. ఒత్తు అక్షరం కింద గీత గీయండి. ఆ పదాలను రాయండి.

రామయ్య పొలానికి వెళ్ళాడు. నాగలికి ఎద్దులను కట్టాడు. దుక్కి దున్నాడు. సాళ్ళల్లో విత్తనాలు వేశాడు. వానలు పడ్డాయి. విత్తనాలు మొలకెత్తాయి. కొంత కాలానికి పంట చేతికి వచ్చింది. పంటను సంతలో అమ్మాడు. డబ్బులు బాగా వచ్చాయి. రామయ్య ఎంతో సంతోషపడ్డాడు.

__________ __________ __________ __________ __________

__________ __________ __________ __________ __________

__________ __________ __________ __________ __________

## IV. కింది పదాలను చూడండి. గీత గీసిన అక్షరాల మధ్య తేడాను చెప్పండి. ఆ అక్షరాలను స్పష్టంగా పలకండి.

ముక్క – మర్కటం          క్క – ర్క

క్క – ద్విత్వం          ర్క – సంయుక్తం

SCERT TELANGANA

**V.** కింది పదాలను చదువండి. గులాబి రంగులోని సంయుక్తాక్షరాలను స్పష్టంగా పలకండి.


| | | | | | |
|---|---|---|---|---|---|
| చమత్కారం | ఉత్కళ | జట్కా | ఆబ్కారి | చెమ్కీ | కర్నాటకం |
| ఉల్క | దస్కం | నస్కుల | దుర్గ | గద్గదం | ఫల్గుణి |
| అర్చన | ఖర్జూరం | తుల్జాపూర్ | డాక్టరు | మాస్టరు | డాల్డా |
| కార్డు | పంక్తి | లుప్తం | కీర్తి | పార్థుడు | మర్దన |
| దుర్దినం | ముగ్ధ | పట్నం | కట్నం | యత్నం | దుర్నీతి |
| కర్ణుడు | దిక్పాలకుడు | ఉత్పలం | శూర్పనఖ | వివాదాస్పదం | నిష్ఫలం |
| అక్బరు | బీర్బలు | మల్బరి | అద్భుతం | అర్భకుడు | మఖ్మల్ |
| రుక్మిణి | యుగ్మం | ఆత్మ | పద్మం | సన్మంగళం | ఉన్ముఖం |
| ఉప్మా | నిర్మల | విస్మయం | గుల్మం | కల్మషం | వాక్యం |
| వాచ్యం | వాజ్యం | నాట్యం | కుడ్యం | సత్యం | పథ్యం |
| పద్యం | న్యాయం | ఆప్యాయత | అభ్యాసం | సేమ్యా | భార్య |
| బాల్యం | వ్యయం | నశ్యం | సస్యం | బాహ్యం | కళ్యాణం |
| లక్ష్యం | చక్రం | అగ్రజులు | వజ్రం | చట్రం | ఛత్రం |
| ద్రవం | ప్రతిమ | అభ్రకం | భ్రమణం | తామ్రం | తీవ్రత |
| శ్రమ | సహస్రం | హ్రీంకారం | శుక్లం | హుబ్లీ | పొట్లం |
| అట్లు | వడ్లు | విప్లవం | ఆమ్లం | గొర్లు | ఆహ్లాదం |
| పక్వం | అగ్వ | ఉజ్వలం | పట్వారి | చత్వారం | సద్వంశం |
| అధ్వరం | అన్వయం | గర్వం | అశ్వం | భాస్వరం | హర్షం |
| దిక్సూచి | సంవత్సరం | ఈప్సితం | ఉర్సు | బిల్హణుడు | అర్హతలు |
| కల్హారం | వాక్చాతుర్యం | షట్చక్రవర్తులు | దుశ్చర్య | పశ్చాత్తాపం | స్వప్నం |
| సన్మార్గం | ద్రవ్యం | ప్రయత్నం | కీర్తిప్రతిష్టలు | తీర్థప్రసాదం | వస్త్రం |
| దుష్టద్యుమ్నుడు | స్త్రీ | జ్యోత్స్న | స్వాతంత్ర్యం | అస్త్రం | శస్త్రం |

SCERT TELANGANA

సంసిద్ధత పాఠం

# 6. ఒత్తుల పదాలు రాయడం

I. కింది బొమ్మను చూడండి. పదాలు, వాక్యాలు రాయండి.



SCERT TELANGANA

## II. బొమ్మను చూసి వాక్యాలు రాయండి.



SCERT TELANGANA

**III. వృద్ధులతో పిల్లలు ఏం మాట్లాడి ఉంటారో సంభాషణ రాయండి.**

పిల్లలు : ____________________

వృద్ధులు : ____________________

పిల్లలు : ____________________

వృద్ధులు : ____________________

పిల్లలు : ____________________

వృద్ధులు : ____________________

**IV. పిల్లలు వారి టిఫిన్‌బాక్స్ వృద్ధులకు ఇచ్చారు కదా! దీనిని గురించి కింద సూచించిన వ్యక్తులు ఏం అని ఉంటారో రాయండి.**

స్నేహితులు : ____________________

____________________

ఉపాధ్యాయులు : ____________________

____________________


తల్లిదండ్రులు : ____________________

____________________

SCERT TELANGANA

# 1. మన జెండా

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- పై బొమ్మలో మాట్లాడుతున్నది ఎవరు?
- ఆయన దేని గురించి మాట్లాడుతుండవచ్చు?
- మీకు తెలిసిన దేశభక్తి పాటను ఏదైనా పాడండి.

**ఉద్దేశం**

భారత స్వతంత్ర పోరాటంలో మన జెండా కలిగించిన చైతన్యం, ఉత్తేజం గురించి ఈ గేయంలో ఉన్నది. మన జెండా బ్రిటీష్ వారి గుండెల్లో గుబులు పుట్టించి, హడలెత్తించిన విధం ఎటువంటిదో ఈ గేయం ద్వారా తెలుసుకుంటారు.

**పిల్లలూ! ఇట్లా చేయండి.**




- పాఠంలోని బొమ్మలు చూడండి. వాటి గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు - అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకోండి.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22



శాంతి సహనం సత్యరూపమా
శౌర్యకాంతితో వెలిగిన దీపమా
నమామి భారత పతాకమా
స్మరామి త్రివర్ణ కేతనమా ॥ శాంతి ॥

పవిత్ర భారత ధరాతలమ్మున
పరాయిపాలన మంత మొనర్చి
పంజర విముక్త ఖగమ్ములా
అంబర మెగిసిన స్వతంత్రమా! ॥ శాంతి॥

SCERT TELANGANA



స్వేచ్ఛా సాధన సమరంలో
ముందు నడిచిన ప్రతాపమా
స్వాతంత్ర్యం మా జన్మహక్కనీ
గర్జించిన పర్జన్య రావమా! ॥ శాంతి ॥

ముష్కర బ్రిటీషు మత్తగజాలను
హడలెత్తించిన అంకుశమా
సమరావనిలో సహోదరాళికి
అండగ నిల్చిన ఆయుధమా ॥ శాంతి ॥

శేషం లక్ష్మీనారాయణాచార్య
*('స్వరభారతి' - 'భక్తి-దేశభక్తి' గేయ సంకలనంలోనిది)*

SCERT TELANGANA

## భావం

1. ఓ భారత పతాకమా! నువ్వు శాంతి, సహనం, సత్యాల ప్రతిరూపానివి. పరాక్రమ కాంతితో వెలిగే దీపానివి. మూడు రంగులు కలిగిన దానివి. నీకు వందనం.
2. ఓ స్వతంత్ర పతాకమా! పవిత్రమైన భారత భూమిపై పరాయివాళ్ళ పాలనను అంతం చేశావు. పంజరం నుండి బయట పడిన పక్షిలా ఆకాశంలోకి ఎగిరిన నీకు వందనం.
3. ఓ ప్రతాప పతాకమా! స్వాతంత్ర్య పోరాటంలో ముందు నడిచిన తేజానివి. స్వాతంత్ర్యం నా జన్మహక్కని గర్జించిన మేఘానివి. అట్టి నీకు వందనం.
4. ఓ మువ్వన్నెల పతాకమా! మదించిన ఏనుగులవలె ఉన్న బ్రిటీష్ దుష్టులను భయపెట్టిన అంకుశానివి. యుద్ధ భూమిలో పోరాడుతున్న సోదరులకు అండగా నిల్చిన ఆయుధానివి. అట్టి నీకు వందనం.

## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) గేయాన్ని రాగంతో పాడండి. అభినయం చేయండి.

(ఆ) ఈ గేయానికి 'మన జెండా' అనే పేరు సరైనదేనా? ఎందుకో చెప్పండి?

### II. ధారాళంగా చదువడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం



(అ) కింది వాక్యాలు చదువండి. గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి. పాఠం ఆధారంగా వరుస క్రమంలో రాయండి.

పంజర విముక్త ఖగమ్ములా
పవిత్ర భారత ధరాతలమ్మున
అంబర మెగిసిన స్వతంత్రమా!
పరాయిపాలన మంత మొనర్చి

______________________________
______________________________
______________________________
______________________________

SCERT TELANGANA

(ఆ) గేయంలో స్వతంత్రమా, ఆయుధమా ... వంటి ప్రాస పదాలు ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

1.__________ 2.__________ 3.__________ 4.__________

5.__________ 6.__________ 7.__________ 8.__________

(ఇ) కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

తెలంగాణ రాష్ట్రం జూన్ 2వ తేది 2014న ఆవిర్భవించింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నాలను ప్రకటించింది. రాష్ట్ర జంతువుగా జింకను, రాష్ట్ర పక్షిగా పాలపిట్టను, రాష్ట్ర పుష్పంగా తంగేడుపువ్వును, రాష్ట్ర వృక్షంగా జమ్మిచెట్టును (శమీ వృక్షం) అధికారిక చిహ్నాలుగా నిర్ణయించారు. జింక తెలంగాణ ప్రజల మంచితనానికి గుర్తు. పాలపిట్టను మనం శుభ సూచకంగా భావిస్తాం. పసుపు పచ్చగా కళకళలాడుతూ ప్రకృతికి అందం తెచ్చే తంగేడు పువ్వును బతుకమ్మను పేర్చడానికి వాడుతారు.

(1) పై పేరాకు పేరు పెట్టండి.

______________________________

(2) తెలంగాణ రాష్ట్రం ఎప్పుడు ఏర్పడింది?

______________________________

(3) తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నాలుగా వేటిని ప్రకటించారు?

______________________________

(4) పై పేరాలో 'ఆవిర్భవించింది' అనే పదానికి అర్థం ఏమిటి?

______________________________

(5) తంగేడు పువ్వు ప్రత్యేకత ఏమిటి?

______________________________

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) మనం మన జెండాకు ఎందుకు వందనం చేయాలి?

(ఆ) మన జెండా గొప్పదనం ఏమిటి?

SCERT TELANGANA

## IV. పదజాలం



(అ) కింది వాక్యాలు చదువండి. వీటికి అనువైన పదాలు పాఠంలో ఉన్నాయి. వాటిని రాయండి.

(1) జెండాను ఇట్లా కూడ అంటారు.

(2) వెలుతురును ఇచ్చేది.

(3) రామచిలుకను దీంట్లో ఉంచుతారు.

(4) వీరి పాలన అంతమయ్యింది.

(5) యుద్ధాన్ని ఇట్లా కూడ అంటారు.

(ఆ) కింది వాక్యాలు చదువండి. గీతలు గీసిన పదాలకు అర్థాలు రాయండి.

(1) ఆగష్టు 15, జనవరి 26 తేదీల్లో దేశమంతట త్రివర్ణకేతనం ఎగుర వేస్తారు.

(2) అంబరంలో పక్షులు ఎగురుతూ పోతున్నాయి.

(3) ధరాతలం మీద మనతో పాటు ఎన్నో జీవరాశులు గూడ ఉన్నాయి.

(4) వానకాలంలో ఆకాశంలో పర్జన్యాలు ముసురుకొస్తాయి.

(5) పోలీసులు ముష్కరులు దొంగిలించిన సామాన్లను స్వాధీనం చేసుకున్నారు.

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) మన జెండా బొమ్మ గీసి, రంగులు వేయండి. దాని గురించి కొన్ని నినాదాలు రాసి ప్రదర్శించండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది పేరా చదువండి. పేరాలోని నామవాచకాలు, సర్వనామాలు, విశేషణాలు, క్రియా పదాలను గుర్తించండి.

సరోజినీనాయుడు 1879 సంవత్సరం ఫిబ్రవరి 13న హైదరాబాదులో జన్మించింది. ఆమె తండ్రి పేరు అఘోరనాథ ఛటోపాధ్యాయ. తల్లి పేరు వరద సుందరీ దేవి. ఆమె భర్త జనరల్ ముత్యాల గోవిందరాజులునాయుడు. ఆయన సుప్రసిద్ధ వైద్యుడు. 1915 సం॥లో

SCERT TELANGANA

ఆమెకు మహాత్మ గాంధీతో పరిచయం ఏర్పడింది. 1930 సం॥లో ఆయన పిలుపునందుకొని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నది. ఆమెను ఎరవాడ జైలులో నిర్బంధించారు. అక్కడ ఆమె పూల మొక్కలకు నిత్యము నీరు పోసి వాటిని చక్కగా పెంచుతుండేది. ఆమె ఆంగ్లంలో ఎన్నో కవితలు రాసింది. ఆంగ్ల కవయిత్రిగా మంచి పేరు సంపాదించింది. అంతేగాక "భారతకోకిల" (నైటింగేల్ ఆఫ్ ఇండియా) అనే గొప్ప పేరు కూడా సంపాదించింది.

## ప్రాజెక్టు పని



**తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నలుగురైదుగురు ప్రముఖుల బొమ్మలు సేకరించండి. వారి బొమ్మలు చార్టుపై అతికించండి. వారిలో ఒకరి గురించి నాలుగైదు వాక్యాలు రాయండి.**

## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతోపాడి, పాఠంపేరు సరైనదేనని చెప్పగలను. | అవును / కాదు |
| 2. | గేయంలోని ప్రాసపదాలు గుర్తించగలను. పేరాకు పేరు పెట్టి ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 3. | మన జెండా గొప్పదనం గురించి సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. | జెండా బొమ్మ గీసి రంగులు వేయగలను. జెండా గురించి నినాదాలు రాసి ప్రదర్శించగలను. | అవును / కాదు |




భారతదేశం నాకు పావన గంగ.
సమస్త భారతం ఒక పవిత్ర భూమి.
– స్వామి వివేకానంద

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

# 2. యాదగిరిగుట్ట

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- బొమ్మలో కనిపిస్తున్నది ఏమిటి?
- గుడికి ఎందుకు పోతాం? అక్కడ జరిగే కార్యక్రమాలేవి?
- మన రాష్ట్రంలోని ఇట్లాంటి ప్రదేశాలపేర్లు చెప్పండి.

**ఉద్దేశం**

తెలుగునేలలో పేరు పొందిన పుణ్యక్షేత్రం 'యాదగిరిగుట్ట' ఇది మన తెలంగాణలో ఉంది. దీని గురించి పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం.



**పిల్లలూ! ఇట్లా చేయండి.**

- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు – అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.


SCERT TELANGANA

**మన పూర్వీకులు ప్రకృతి శక్తినే దేవుడిగా భావించారు. అందుకే మనుషుల ఆవాసాలకు దూరంగా కొండలపై, గుట్టలపై, సముద్ర, నదీ తీర ప్రాంతాలలో, అడవులలో ప్రశాంతంగా ప్రార్థించాలని అనుకున్నారు. అందుకే ఆ ప్రదేశాలలో గుళ్ళు కట్టారు. కొలిచారు. మొక్కారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆ గుళ్ళు కీర్తికెక్కినయి. ఇలా కీర్తికెక్కినదే తెలంగాణలోని గొప్ప పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట. ఆ క్షేత్రం గురించి తెలుసుకుందాం.**

తెలంగాణలో ప్రసిద్ధిపొందిన నారసింహ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట. పూర్వం ఇది నల్లగొండ జిల్లాలో ఉండేది. ప్రస్తుతం యాదాద్రి జిల్లాలో ఉన్నది. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరంలో వరంగల్ మార్గంలో ఉన్నది.

ఋష్యశృంగుని కొడుకైన యాదర్షి హనుమంతుని ఆశీస్సులతో ఈ గుట్టపైన తపస్సు చేశాడని పురాణ కథలో ఉన్నది. యాదర్షి తపస్సుకు మెచ్చిన నరసింహస్వామి ప్రత్యక్షమై “భక్తా! ఏమి కావలెనో కోరుకో” అని అడిగాడు. దానికి యాదర్షి “నాకు ఎటువంటి కోరికలు లేవు, కాని మీ రూపాన్ని దర్శించుటకే నేను తపస్సు చేశాను. నా కోరిక ఒక్కటే. మీరు ఈ గుట్టపైననే వెలసి, మావంటి ఎందరో భక్తులకు నిత్యం దర్శనమివ్వాలి” అని యాదర్షి కోరుకున్నాడు. ఆయన కోరిక ప్రకారం నరసింహస్వామి యాదగిరిగుట్టపై వెలిశాడు. అప్పటి నుంచి ఆ గుట్టను యాదర్షి పేరు మీద ‘యాదగిరి గుట్ట’ అని పిలుస్తున్నారు.

నరసింహస్వామి స్వయంభువుగా వెలసిన నారసింహక్షేత్రం ఆనాటి నుండి భక్తుల కోరికలను తీరుస్తు దేదీప్యమానంగా వెలుగొందుతున్నది. భక్తులపాలిట కల్పతరువుగా, సకల దుఃఖాలను దూరం చేసే పుణ్యక్షేత్రంగా కీర్తించబడుతున్నది. ఇక్కడ నిద్రచేస్తే మంచి జరుగుతుందని భక్తులు నమ్ముతారు. స్వామివారి దీక్షను స్వీకరించడం, గోశాలకు ఆవులను దానం చేయడం పుణ్యకార్యమని భావిస్తారు. ఇంత గొప్ప మహిమ కలిగిన ఈ క్షేత్రంలోని స్వామిని కీర్తిస్తూ చాలామంది కవులు శతకాలు రచించారు.



SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

ఈ గుట్టమీద ఒక గుండం ఉన్నది. దానిని ‘విష్ణు గుండం’ అని పిలుస్తారు. ఇందులో స్నానం చేస్తే పాపాలు తొలిగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ గుండంలో మునులు, దేవతలు కూడా స్నానాలు చేస్తారని భక్తుల విశ్వాసం. విష్ణుగుండం పక్కనే ఆంజనేయస్వామి దేవాలయం ఉన్నది. ఈ కొండమీదనే మరొక దేవాలయం ఉన్నది. అదే రామలింగేశ్వర ఆలయం. నరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు తప్పకుండా ఈ రామలింగేశ్వరుడిని కూడా దర్శించుకొని ఆ స్వామి అనుగ్రహాన్ని పొందుతారు.

నరసింహ ఆలయంలో స్వామి వారికి ప్రతినెల స్వాతి నక్షత్రం రోజున అష్టోత్తరశత కలశాభిషేకం జరుగుతుంది. ఉగాది రోజున స్వామి వారికి తిరువీధి సేవచేసి, పంచాంగ శ్రవణం జరుపుతారు. శ్రీరామనవమి, హనుమజ్జయంతి, శ్రీకృష్ణాష్టమి పండుగలకు పవిత్రోత్సవాలు జరుపుతారు.

ప్రతి సంవత్సరం ఆలయంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఫాల్గుణ శుద్ధ విదియ నుండి ద్వాదశి వరకు 11 రోజులు ఈ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీవారి ఎదుర్కోళ్ళు, కళ్యాణం, రథోత్సవం కన్నుల పండుగగా జరుగుతాయి. ఇంతే కాకుండా కవి సమ్మేళనాలు, ధార్మిక కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు విపరీతంగా భక్తుల తాకిడి ఉంటుంది. అన్ని జిల్లాల నుండి, ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తారు.

భక్తులు యాదగిరిగుట్టపైకి చేరుకోవడానికి రెండు తొవ్వలు ఉన్నాయి. ఒకటి మెట్ల తొవ్వ. మరొకటి బస్సులు పోయే తొవ్వ. గ్రామాల నుంచి వచ్చే చాలా మంది భక్తులు మెట్లు ఎక్కి గుట్టమీదున్న గుడికి చేరుకుంటారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల బస కోసం దేవస్థానం కమిటీవాళ్ళు గదులు కట్టించారు. తెలంగాణ పర్యాటక శాఖ కూడా భక్తుల కోసం గుట్టపై గదుల వసతిని కల్పిస్తున్నది.

ఇక్కడికి వచ్చే భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, దేవుడిని దర్శనం చేసుకుని, లడ్డు, పులిహోర ప్రసాదాలు స్వీకరించి గుట్ట కిందికి చేరుకుంటారు. కిందికి చేరుకున్న భక్తులు ఈ గుట్టకు దగ్గరలోనే ఉన్న పాత నరసింహస్వామిని కూడా దర్శనం చేసుకోవడం ఒక ఆనవాయితీగా వస్తున్నది.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సప్తగిరి పేరుతో ఉన్న దూరదర్శన్ ఛానల్‌కు “యాదగిరి” అని పేరుపెట్టారు. తెలంగాణలో నివసిస్తున్న చాలా మందికి యాదగిరి అని పేరు పెట్టుకోవడం ఒక ఆచారంగా ఉన్నది. అంటే యాదగిరి గుట్టకు ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఎంత ఉన్నదో మనకు అర్థం అవుతున్నది.

SCERT TELANGANA

## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) యాదగిరిగుట్ట క్షేత్రం గురించి సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) మీకు తెలిసిన పుణ్యక్షేత్రాల గురించి చెప్పండి.

### II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



(అ) పాఠం చదువండి. కింది విషయాలు ఏ పేరాలో ఉన్నవో వివరాలు పట్టికలో రాయండి.

| విషయం | విషయం ఉన్న పేరా సంఖ్య |
|---|---|
| యాదగిరిగుట్ట వివరాలు | |
| యాదగిరిగుట్టకు ఆ పేరు రావడం | |
| గుట్ట మీద ఉన్న గుళ్ళ వివరాలు | |
| యాదగిరిగుట్టలో జరిగే ఉత్సవాలు | |
| గుట్టపై ఉన్న సౌకర్యాలు | |

(ఆ) కింది పేరా చదువండి. ప్రశ్నలు తయారుచేయండి.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు. అది మన రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో ఉన్నది. ఈ క్షేత్రంలో శ్రీ ఆంజనేయస్వామి స్వయంభువుగా వెలిశాడు. కొండగట్టు క్షేత్రం కరీంనగర్ నుండి నిజామాబాదు వెళ్ళే దారిలో జగిత్యాలకు 15 కి.మీ.ల దూరంలో ఎత్తైన కొండమీద ఉన్నది. ఇక్కడ స్వామివారిని ప్రతిరోజు చాలామంది భక్తులు దర్శనం చేసుకుంటారు. ఇక్కడి ఆంజనేయస్వామి సగం నరసింహస్వామి ముఖంతో ఉత్తరాభిముఖుడై ఉన్నాడు. ఆంజనేయస్వామి భక్తులు హనుమాన్ దీక్ష స్వీకరించి 41 రోజుల పాటు నిష్ఠతో ఉంటారు. ఎలాంటి శారీరక, మానసిక రుగ్మతలైనా స్వామివారి దర్శనంతో తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. దీనికి దగ్గరలోనే జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన ఇంజనీరింగ్ కళాశాల కూడా ఉన్నది. కొండగట్టు అంజన్నపై భక్తితో కవులు శతకాలు కూడా రాశారు.

SCERT TELANGANA

(1) ______________________________

(2) ______________________________

(3) ______________________________

(4) ______________________________

(5) ______________________________

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) యాదగిరిగుట్ట గురించి రాయండి.

(ఆ) పుణ్యక్షేత్రంలో ఏదైనా ఉత్సవం జరిగినప్పుడు అక్కడ ఎట్లా ఉంటుందో రాయండి.

(ఇ) పుణ్యక్షేత్రాలు లేదా ఉత్సవాలకు వెళ్ళేటప్పుడు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి?

## IV. పదజాలం



(అ) కింది పదాల వరుసలో వేరుగా ఉన్న పదానికి '◯' చుట్టండి.

| | | | | |
|---|---|---|---|---|
| (1) | బ్రహ్మ | విష్ణువు | యాదర్షి | ఈశ్వరుడు |
| (2) | రథోత్సవం | కల్యాణోత్సవం | బ్రహ్మోత్సవం | ఏకాదశి |
| (3) | ఆదిలాబాద్ | యాదగిరిగుట్ట | కరీంనగర్ | వరంగల్ |
| (4) | శ్రీరామనవమి | జాతర | హనుమజ్జయంతి | శ్రీకృష్ణాష్టమి |

(ఆ) కింది పదాలు పాఠంలో ఉన్నాయి. ఈ పదాలున్న వాక్యాలు చదువండి. వాటి అర్థం గ్రహించి సొంత వాక్యాలు రాయండి.

(1) ప్రసిద్ధిపొందిన : ______________________

(2) దర్శించుట : ______________________

(3) దేదీప్యమానం : ______________________

(4) వసతి : ______________________

(5) కీర్తించడం : ______________________

(6) ఉత్సవాలు : ______________________

SCERT TELANGANA

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) దేవాలయాలలో ఉత్సవాలు జరిగేటప్పుడు ఆ వివరాలు అందరికి తెలుపుటకు పోస్టర్లు అంటిస్తారు. అటువంటి పోస్టరు ఒకటి చూడండి.

**శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం**
**వేములవాడ, కరీంనగర్ జిల్లా.**
**మహాశివరాత్రి ఉత్సవాలు**

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వేములవాడలో తేది : 17-02-2015 రోజున మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తారు. కాబట్టి భక్తజనులందరూ పాల్గొని కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించి భగవంతుని అనుగ్రహాన్ని పొందగలరని కోరడమైనది.

కల్యాణం జరిగే తేది : 17-02-2015
సమయం : రాత్రి 12 గంటలకు
స్థలం : రాజరాజేశ్వరస్వామి దేవాలయం,
వేములవాడ, కరీంనగర్ జిల్లా.

ఇట్లు
ఆలయ కమిటీ,
శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం,
వేములవాడ.

(ఆ) మీ గ్రామంలోని దేవాలయంలో లేదా గ్రామంలో జరిగే ఉత్సవం గురించి పోస్టర్ తయారుచేయండి. ప్రదర్శించండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది వాక్యాలు చదువండి. క్రియా పదాలను పట్టికలో రాయండి.

(1) ఇక్బాల్ బంతి ఆట ఆడుతున్నాడు.

(2) సంయుక్త పాట పాడింది.

(3) అమ్మ రేపు కొత్తబట్టలు కొని తెస్తుంది.

| జరిగిన పని | జరుగుతున్న పని | జరగబోయే పని |
|---|---|---|
| | | |

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

పట్టికను నింపారు కదా!

'పాడింది', ఈ పదం జరిగిపోయిన పనిని గురించి తెలుపుతుంది కదా! ఇట్లా జరిగిపోయిన పనిని గురించి తెలిపే పదాలున్న వాక్యాలను 'భూతకాలపు' వాక్యాలు అంటారు.

'ఆడుతున్నాడు', ఈ పదం జరుగుతున్న పనిని తెలుపుతుంది కదా! ఇట్లా జరుగుతున్న పనిని గురించి తెలిపే పదాలున్న వాక్యాలను "వర్తమాన కాలపు" వాక్యాలు అంటారు. 'కొనితెస్తుంది' ఈ పదం జరుగబోయే పనిని తెలుపుతుంది కదా! ఇట్లా జరుగబోయే పనిని గురించి తెలిపే పదాలున్న వాక్యాలను 'భవిష్యత్ కాలపు' వాక్యాలు అంటారు.

**(ఆ) కింది వాక్యాలు చదువండి. ఏ కాలంలో ఉన్నాయో రాయండి.**

(1) ఆదిత్య రేపు హైదరాబాదు వెళతాడు. __________

(2) గీత సినిమా చూసింది. __________

(3) సౌమ్య పాఠం చదువుతున్నది. __________

**ప్రాజెక్టు పని**



తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలు ఉన్నాయి. తెలంగాణలో ఏయే జిల్లాలలో ఏయే పుణ్యక్షేత్రాలున్నాయో తెలుసుకొని రాయండి. తరగతి గదిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా?





1. యాదగిరిగుట్ట గురించి సొంతమాటల్లో చెప్పగలను. అవును / కాదు
2. పాఠం చదివి పట్టికను నింపగలను. పేరాను చదివి ప్రశ్నలు తయారుచేయగలను. అవును / కాదు
3. యాదగిరిగుట్ట గురించి సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు
4. మా గ్రామంలోని దేవాలయంలో జరిగే ఉత్సవాల గురించి ఒక పోస్టర్‌ను తయారుచేసి ప్రదర్శించగలను. అవును / కాదు





దేవాలయాలు మన సంస్కృతికి మూలస్తంభాలు.
వాటిని రక్షించుకోవడం మన కర్తవ్యం.

SCERT TELANGANA

# 3. సాలార్‌జంగ్ మ్యూజియం

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**




**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- బొమ్మ చూడండి. ఏం జరుగుతున్నదో చెప్పండి.
- బొమ్మలో వివిధ జంతువులు ఏమేం మాట్లాడుకున్నాయో ఊహించి చెప్పండి.
- జంతు ప్రదర్శనశాలలో ఇంకా ఏమేం ఉంటాయి?

**ఉద్దేశం**

మ్యూజియంను, అందులో భద్రపరిచే వస్తువులను, వాటి ప్రాశస్త్యాన్ని, ఉద్దేశాన్ని పిల్లలకు తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.

**పిల్లలూ! ఇట్లా చేయండి.**



- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు - అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA

**"నేను రోజూ డైరీ రాస్త. కానీ ఈ రోజు రాసింది చాలా ప్రత్యేకమైనది. నేను మళ్ళ మళ్ళ చదువుకొనేటందుకు ఉపయోగపడే పేజీలు. ఇవి నాకు బాగా నచ్చినయి. ఎప్పటికీ మర్చిపోలేని ఆనందాన్ని ఇచ్చినయి."**
**ఆ పేజీలలో ఏం రాశానో అవి ఎందుకు అంత నచ్చాయో పాఠం చదువండి. మీకే తెలుస్తది.**

తేది : 27-12-2014, శనివారం

ఈ రోజు మా బడినుండి విహారయాత్రకు పోయినం. పొద్దుగాల్నే లేచి, మంచిగ తయారై, అమ్మ కట్టిచ్చిన టిఫిన్‌డబ్బ తీసుకొని పొయ్యేటప్పటికి బడి ముందర బస్సు ఉన్నది. టీచర్లు, పిల్లలందరం ఎక్కినం. బస్సు కదిలింది. మాట్లాడుకుంట, పాటలు పాడుకుంట పోతుంటే టైమే తెల్వలేదు. బస్సు హైదరాబాద్‌కు రాంగానే కిటికిలకెల్లి బైటికి చూసినం. పెద్ద పెద్ద బిల్డింగులు, దుకాణాలు, బస్సులు, కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్ళు ... అంత కొత్త కొత్తగ అనిపించింది.

ఇంతలో బస్సు ఆగింది. ఎదురుగ ఉన్న పెద్ద భవంతిని చూపెడుతూ 'ఇదే సాలార్‌జంగ్ మ్యూజియం' అన్నడు సార్. అందరం బస్సు దిగినం. ఇద్దరు సార్లు పోయి టిక్కెట్లు తెచ్చారు. పెద్ద లైనుల నిలబడి మ్యూజియం లోపలికి పోయినం.



లోపలికి పోయినంక అందర్ని ఒక దగ్గర నిలబెట్టి "ఇప్పుడు మనం సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉన్నం. హైదరాబాదులో ఉన్న దర్శనీయ స్థలాలలో ఇది ఒక ముఖ్యమైన వస్తు ప్రదర్శనశాల. ఇది మూసీనదికి దక్షిణం ఒడ్డున "దార్-ఉల్-షిఫా" అనే ప్రాంతంలో ఉన్నది. హైదరాబాద్‌కు చెందిన నిజాం పరిపాలకులలో సాలార్‌జంగ్ కుటుంబానికి చెందిన "మీర్ యూసుఫ్ అలీఖాన్ సాలార్‌జంగ్-III" ప్రపంచం నలుమూలల నుండి ఎన్నో విలువైన కళాఖండాలు వస్తుసామగ్రి సేకరించిండు. ఈయన తండ్రి, తాత కూడ కొన్ని వస్తువులు సేకరించి అన్నింటిని భద్రపరిచారు."

"అర్ధచంద్రాకారంగా ఉన్న ఈ మ్యూజియంను 1951 డిసెంబరు 16న ప్రజలు చూసేటందుకు తెరిచారు. భారతదేశంలో ఉన్న అతిపెద్ద మ్యూజియాలలో ఇది మూడోస్థానంలో ఉన్నది. భారత పార్లమెంటు దీనిని జాతీయ ప్రాముఖ్యత గల సంగ్రహాలయంగా గుర్తించింది. దీంట్లో మొత్తం 38 అర్రలున్నయి. ఒక్కొక్క అర్రలో ఒక్కొక్క తీరుకు చెందిన ఎన్నో కళాఖండాలున్నయి. వాటిలో ముఖ్యమైన వాటిని చూద్దాం!"

అని చెప్పి ముందుగ ఒక అర్రలోకి తీసుకపోయిండు సార్. ఒక అర్రలో అన్నీ అద్దాల బొమ్మలుంటే ఒక అర్రలో అన్నీ చెక్కమీద చెక్కిన శిల్పాలు. ఇంకొక అర్రలో పెద్దపెద్ద పెయింటింగులు. మరొక అర్రలో అన్నీ దేవుళ్ళ విగ్రహాలు. మొఘలు రాజులు ఉపయోగించిన షేర్వాణీలు, శాలువాలు, గాజుపాత్రలు ఎన్నెన్ని రకాలో... చూసినాకొద్ది చూడబుద్ధి అయితున్నది.

ఒక అర్రపేరు పిల్లల గాలరీ. ఎన్ని మంచి మంచి బొమ్మలున్నవో! అందంగ చెక్కతో కట్టిన బొమ్మరిండ్లు. ఆ ఇండ్లలోపట నిజంగ ఇండ్లల్లో ఉండే సామాన్లన్ని బుజ్జిబుజ్జిగ ఉన్నయి. మంచాలు, సోఫాలు, కుర్చీలు, ఇండ్ల ముందట తోటలు అవన్నీ చూస్తుంటే వాటితోని ఆడుకోబుద్ధి అయింది.

దాని పక్క అర్రలో అన్ని యుద్ధానికి సంబంధించిన బుజ్జి బొమ్మలు. చిట్టి చిట్టి యుద్ధ నౌకల బొమ్మలు, బుచ్చి బుచ్చి సిపాయిల బొమ్మలు, అశ్వదళాల బొమ్మలు, ఫిరంగుల బొమ్మలు వందలకొద్ది అద్దాల పెట్టెలల్లో పెట్టారు. అవి చూసేటందుకు చానా బాగున్నయి.

అంతట్ల సారు ... "అరె ... ! పిల్లలూ! టైమ్ 11.50 అయితున్నది. ఈ మ్యూజియంలో ముఖ్యమైనది గంటల గడియారం. ఇంక 10 నిమిషాలల్లో గడియారం గంటలు కొడుతది అటుపోదాం రండి! అనుకుంటు మమ్మల్ని వరండా మధ్యలోకి తీసుకపోయిండు. వామ్మో ... ! ఆడ ఉష్కెస్తె రాలనంత జనం ఉన్నరు. సార్ ఎట్లనో అట్ల సందుజేసి మాకందరికి గడియారం కనబడేటట్లు నిలబెట్టిండు.

పిల్లలు, పెద్దలు అందరు ఒకటే లొల్లి. అందరి చేతులల్లో కెమెరాలు, సెల్‌ఫోన్లు, వీడియో కెమెరాలు... మా సారు గూడ వీడియో తీసేటందుకు కెమెరా రెడీగ పట్టుకున్నడు.

SCERT TELANGANA




తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

గడియారం పెద్ద నక్ష చెక్కిన చెక్క డబ్బాలో ఉన్నది. దాంట్లో ఎడమ పక్క చిన్న ఇల్లు లెక్క ఉన్నది. దాని తలుపు మూసి ఉన్నది. మధ్యల ఒక గంట ఉన్నది. కుడి పక్క చెట్టు, చెట్టు కింద ఒక మనిషి డోలు కొడుతున్నట్టున్నది. సార్ చెప్పిండు “ఆ డోలు కొట్టుడు అంటే ప్రతి సెకనుకు ఒక దెబ్బకొట్టుడు” అని. ఆ మూసి ఉన్న తలుపు తెరుచుకొని ఒక మనిషి బైటకు వచ్చి ఆ గంట మీద ఎంత టైమ్ అయితే అన్ని గంటలు కొట్టి మల్ల లోపలికి పోయి తలుపు మూసుకుంటడట. “ఇప్పుడు పన్నెండు కావొస్తుంది కదా! పన్నెండు గంటలు కొడుతడు” అని చెప్పిండు. పన్నెండయ్యింది. తలుపు తెరుచుకున్నది. ఒక బొమ్మ మనిషి వచ్చిండు. ఠంగు, ఠంగుమనుకుంట పన్నెండు గంటలు కొట్టి లోపలికి పొయ్యిండు. తలుపు మూసుకున్నడు. అందరం దాన్ని బీరిపోయి చూసినం. చాన మంచిగనిపించింది.




అది కాంగనె సారు గడియారం వెనుక ఉన్న అర్రలోకి తీసుకపోయిండు. దాంట్లో అన్ని పాలరాతి శిల్పాలున్నయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రెబెక్కా శిల్పం ఈ అర్రలోనే ఉన్నది. ఈ రెబెక్కా శిల్పం ప్రత్యేకత ఏందంటే ఒక ఆడమనిషి నెత్తి మీది నుండి కిందిదాక సన్నటి పరదా కప్పుకున్నట్టు, ఆ పరదానుండి ముఖం కనపడుతున్నట్టు ఉన్నది. ఎంతబాగా చెక్కిండో ఆ శిల్పి. అది బొమ్మ లెక్కలేదు. నిజంగ మనిషి ముసుగు కప్పుకొని నిలబడి చూస్తున్నట్లున్నది. ఆ శిల్పం చెక్కినాయన 19వ శతాబ్దానికి చెందిన జి.బి.బెన్‌జోని ఇటలీ దేశస్థుడట. ఈ అర్రలో శిల్పంతోపాటు మరికొన్ని పాలరాతి శిల్పాలు చానా అందంగ చెక్కినవి ఉన్నయి.



అక్కడికెల్లి పక్క అర్రలోకి పోయినం. దాంట్లో అన్నీ ఏనుగు దంతంతోటి చెక్కిన శిల్పాలు ఉన్నయి. ఒక్కొక్క బొమ్మ చూస్తుంటె కండ్లు గిర్రున తిరిగినట్లైంది. పెద్ద పెద్ద దంతాలమీద తీరు తీరు బొమ్మలు చెక్కారు. పెద్ద ఏనుగు దంతం మీద పడవ ఇల్లు ఉన్నట్లు, అది సముద్రంలో పోతున్నట్టు, మరొక దంతం మీద 20 ఏనుగులు ఒకదాని వెనుక ఒకటి పోతున్నట్టు, ఇంకొక దంతం మీద సీతారాములు వనవాసం చేసినట్లు... ఇట్ల మస్తు బొమ్మలు. ఇండ్లనే 18వ శతాబ్దంలోని

SCERT TELANGANA

ఫ్రాన్స్‌రాజు లూయిస్ XVI మన మైసూరు మహారాజైన టిప్పుసుల్తానుకు బహుకరించిన కుర్చీలు, టీపాయ్‌లు కూడా ఉన్నయి. ఈ కుర్చీలు, బల్లలను ఏనుగు దంతంతో చేసిన తొడుగు (పూత) పెట్టి అందంగ తీర్చిదిద్దారు. ఇంకా చాన బొమ్మలున్నయి. అక్కడ్నుంచి సారు మమ్ములను పై అంతస్తుకు తీసుకపోయిండు. అక్కడ మొత్తం 18 అర్రలున్నయి. ముందుగ ఒక అర్రలకు పోయినం. అక్కడ అన్నీ చెక్క శిల్పాలు, చెక్క వస్తువులు ఉన్నయి. ఆ అర్ర నడిమిట్ల నిలువెత్తు చెక్క శిల్పం... దాని వెనుక అద్దం పెట్టారు. ముందు నుండి చూస్తె మగమనిషి, వెనుక భాగం అద్దంలో చూస్తె ఆడమనిషి బొమ్మలు కనబడుతున్నయి. ఎంత అద్భుతంగ ఉంది ఈ పనితనం. చెక్కినాయన చేతులకు మొక్కాలె. కాని ఆ గొప్పాయన పేరు తెలవలేదట. 19వ శతాబ్దానికి చెందిన ఫ్రాన్సు దేశస్థుడని మాత్రం తెలుసు. ఆ శిల్పంలో ఉన్న మనుషుల పేర్లు మెఫిస్టోఫిలిప్స్ (ముందు) మార్గరిట్టా (వెనుక). ఈ ఇద్దరూ గూడ జర్మన్ దేశంలో ప్రదర్శించే ఒక ప్రముఖ నాటకంలోని ముఖ్యపాత్రలట.



ఇంకా ఎన్నో ఎన్నెన్నో తీరు తీరు వస్తువులు, బొమ్మలు... లెక్కలేనన్ని ఉన్నయి. ఒక అర్రలో అన్నీ గడియారాలే. పాతకాలంలో ఉపయోగించే నీడ గడియారాలు మొదలుకొని ఇప్పుడు వాడుతున్న కొత్త కొత్త రకాలు అనేకం. ఒక అర్రలో అన్నీ చేతికర్రలు. ఒక అర్రలో అన్నీ ఆయుధాలు, కత్తులు, డాలులు, బల్లేలు, విల్లమ్ములు, తుపాకులు, యుద్ధంలో వేసుకునే లోహపు దుస్తులు (కవచాలు), గొలుసుల అంగీలతో పాటు జహంగీర్ ఉపయోగించిన చురకత్తి, నూర్జహాన్ పండ్లు కోసుకొనే కత్తి కూడ ఉన్నయి. ఇంకో అర్రలో మొఘలు రాజులు, నిజాం రాజులు వాడిన వెండి బోళ్ళు ఉన్నయి. ఇంకా ప్రపంచం నలుమూలల నుండి సేకరించిన ఖురాన్‌లు, బంగారంతో రాసిన ఖురాను, వెండితో రాసిన ఖురాను, రకరకాల అచ్చులతో (font) రకరకాల డిజైన్లలో ఖురాన్‌లు ఉన్నయి. ఒక ఖురాను అగ్గిపెట్టె సైజులో కూడ ఉన్నది.

ఇవన్నీ చూసుకుంటు మధ్యలో ఒకటిన్నరకు పక్కనున్న పార్కులో అందరం అన్నాలు తిన్నం. మ్యూజియం అంత చూసి బైటకొచ్చేటప్పటికి పొద్దుగుంకంగ నాలుగయ్యింది. బస్సులో ఎక్కి తిరిగి బడికాడికి వచ్చినం. తొవ్వలంత బస్సులో ఇవే ముచ్చట్లు. నిజంగ సాలార్‌జంగ్ మ్యూజియం చాలా అద్భుతమైన ప్రదర్శనశాల. అందరు తప్పక చూడాలె.

...నేను రోజూ డైరీ రాస్త. కాని ఈ రోజు రాసింది చాలా ప్రత్యేకమైనది. నేను మళ్ళమళ్ల చదువుకొనేటందుకు ఉపయోగపడే పేజీలు. ఇవి నాకు బాగా నచ్చినయి. ఎప్పటికీ మర్చిపోలేని ఆనందాన్ని మిగిల్చాయి.

SCERT TELANGANA

## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) సాలార్‌జంగ్ మ్యూజియం వంటివి మనం ఎందుకు చూడాలి?

(ఆ) సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉన్న ప్రత్యేకాంశాల గురించి చెప్పండి.

(ఇ) మీ పాఠశాల నుండి గాని లేదా మీ తల్లిదండ్రులతో గాని వెళ్ళిన విహారయాత్ర గురించి చెప్పండి.

### II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



(అ) రజని రోజూ తన డైరీలో ఆరోజు తానేం చేసిందో రాస్తుంది. ఒకరోజు తన డైరీలో ఏం రాసిందో చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

తేది : 12-07-2014

మేము పాఠశాల నుండి 12-7-2014వ తేదీ ఉదయం 9 గంటలకు బస్సులో బయలుదేరాం. 10 గం॥లకు 'నెహ్రూ జూలాజికల్ పార్కు' చేరుకున్నం. విజయటీచర్ వెళ్ళి టిక్కెట్లు తీసుకువచ్చింది. అందరం జంతు ప్రదర్శనశాల (జూ) లోపలికి వెళ్ళాం. అబ్బో! జూ ఎంత పెద్దగా ఉన్నదో! పెద్ద పెద్ద చెట్లతో అడవిలాగే ఉన్నది. రంగు రంగుల పక్షులను, కోతులను చూశాం. తరువాత సింహాలు, పులులు, ఖడ్గమృగాలు, నీటి ఏనుగులు, తాబేళ్ళను చూశాం. రైలెక్కి జూ అంతా తిరిగాం. జయ, లత, మాధవి, రమ, రాము, మాధవ్ ఇలా అందరితో కలిసి వెళ్ళడం, అన్నీ చూడడం చాలా మంచిగా అనిపించింది. అయితే అడవిలో ఉండాల్సిన జంతువులను అలా బోనుల్లో బంధించి ఉంచడం బాధ కలిగించింది. స్వేచ్ఛగా ఉండాల్సిన ఆ జంతువులన్నీ తిరిగి ఎప్పుడు బయటపడతాయో!

(1) రజని తన డైరీలో దేని గురించి రాసింది?

____________________________________

____________________________________

SCERT TELANGANA

(2) 'జూ' ఎట్లా ఉందని రాసింది?

______________________________

(3) 'జూ'లో ఏమేమి చూసింది?

______________________________

(4) 'జూ'ను చూసిన తరువాత ఆ జంతువుల గురించి రజని ఏమనుకున్నది?

______________________________

**(ఆ) పాఠం చదివి దాని ఆధారంగా కింది పట్టిక పూరించండి.**

| | |
|---|---|
| మ్యూజియంలోని వస్తువులు సేకరించినవారు | |
| మ్యూజియం ప్రారంభించిన తేది | |
| జాతీయ సంగ్రహాలయంగా గుర్తించినవారు | |
| రెబెక్కా శిల్పం చెక్కిన శిల్పి వివరాలు | |
| రెండు రూపాల చెక్క శిల్పం పాత్రల పేర్లు | |

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



**(అ) సాలార్‌జంగ్ మ్యూజియం గురించి రాయండి.**

**(ఆ) రెబెక్కా శిల్పం ప్రత్యేకతలు రాయండి.**

**(ఇ) గంటలు కొట్టే గడియారం గురించి విన్నాక / చదివాక మీకేమనిపించిందో రాయండి.**

**(ఈ) సాలార్‌జంగ్ మ్యూజియం వంటి వాటిని మనం ఎందుకు చూడాలి?**

## IV. పదజాలం



**(అ) ఒక హల్లుకు అదే హల్లు చేరితే వాటిని ద్విత్వాక్షరాలు అంటారు కదా! పాఠంలోని ద్విత్వాక్షర పదాలు వెతికి రాయండి.**

ఉదా: బస్సు ______________ ______________

______________ ______________ ______________

______________ ______________ ______________

SCERT TELANGANA

(ఆ) మ్యూజియంకు సంబంధించిన పదాలు పట్టిక నుండి వెతికి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ల్పం | శి | తి | రా | ల | పా |
| వెం | డి | వా | లు | శా | యు |
| లు | కు | పా | తు | లీ | ద్ధ |
| న్ | టీ | పా | య్ | ట | నౌ |
| ర్మ | న్స్ | ఫ్రా | సా | ఇ | క |
| జ | క | ళా | ఖం | డా | లు |

1) ____________ 6) ____________

2) ____________ 7) ____________

3) ____________ 8) ____________

4) ____________ 9) ____________

5) ____________ 10) ____________

(ఇ) పాఠంలో చిట్టి చిట్టి, బుచ్చి బుచ్చి అనే జంట పదాలు ఉన్నాయి కదా! ఇట్లాంటి పదాలు వస్తువుల లేదా వ్యక్తుల ఆకారాలు చెప్పేటప్పుడు ఉపయోగిస్తారు. ఇట్లాంటివి మరికొన్ని పదాలు రాయండి.

____________ ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) సాలార్‌జంగ్ మ్యూజియం చూసిన తర్వాత రజని డైరీ రాసింది కదా? అట్లా మీరు కూడా చూసిన ఏదైన ఒక దర్శనీయ స్థలం గురించి డైరీ రాయండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది పట్టిక ఆధారంగా వాక్యాలు రాయండి. అవి ఏకాలానికి చెందినవో రాయండి.

| | | |
|---|---|---|
| శ్రీధర్ | బజారుకు | పోయింది |
| స్వాతి | సర్కస్‌కు | పోయిండు |
| అతడు | ఊరికి | పోతడు |
| ఆమె | సినిమాకు | పోతుంది |
| రాజు | హైదరాబాద్‌కు | పోతున్నరు |
| సలీమా | బడికి | పోతున్నది |

SCERT TELANGANA

(1) ________________________________________ (            )

(2) ________________________________________ (            )

(3) ________________________________________ (            )

(4) ________________________________________ (            )

(5) ________________________________________ (            )


(6) ________________________________________ (            )

**ప్రాజెక్టు పని**



హైదరాబాదులోని దర్శనీయ స్థలాల బొమ్మలు సేకరించండి. చార్టు మీద అతికించి వాటి గురించి రాయండి.

**నేనివి చేయగలనా?**



| | | |
|---|---|---|
| 1. | సాలార్‌జంగ్ మ్యూజియం వంటివి ఎందుకు చూడాలో చెప్పగలను. మ్యూజియంలో ఉన్న ప్రత్యేకాంశాల గురించి చెప్పగలను. | అవును / కాదు |
| 2. | డైరీ చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. పట్టిక నింపగలను. | అవును / కాదు |
| 3. | సాలార్‌జంగ్ మ్యూజియం గురించి సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. | దర్శనీయ స్థలాల వివరాలను డైరీలో రాయగలను. | అవును / కాదు |




విహారయాత్రలు కేవలం మానసిక ఆనందమే కాదు విజ్ఞానాన్ని కూడా అందిస్తాయి.

SCERT TELANGANA

# చదువు - ఆనందించు

## ప్యారా హైదరాబాద్

హైదరాబాద్ హైదరాబాద్
ప్యారా ప్యారా హైదరాబాద్



1. చార్ మినారులా పావురమూ
నీ గుండెల నిండా గావురమూ
నువు నెత్తురు చిందిన నందనమూ
నీకు చెమట పూలతో వందనమూ ॥ హైదరాబాద్ ॥



2. గోల్కొండల కొడితె చప్పట్లు
అవి చెప్పును ఎన్నో ముచ్చట్లు
కులీ కుతుబ్‌షా ఫర్మానా
భాగమతికి దిల్ నజరానా ॥ హైదరాబాద్ ॥



3. మూసీ నదిపై వెన్నెలవూ
జలతారు ముసుగులో వన్నెలవూ
అస్సోయి దూలా ఆటలవూ
ఆ ఫకీరు సూఫీ పాటలవూ ॥ హైదరాబాద్ ॥



4. లష్కర్‌లోన కవాతువూ
పట్నంలోన బరాతువూ
యుద్ధ ఫిరంగుల ఆవాజువూ
ఆ మక్కా మసీదు నమాజువూ ॥ హైదరాబాద్ ॥



5. తాళం తప్పెట నాదాలు
పోతరాజుల కొరడాలు
తీన్‌మార్ దరువుల గానాలూ
మాంకాలమ్మకు బోనాలూ ॥ హైదరాబాద్ ॥




6. మల్లేశ్, మస్తాన్ భాయీ భాయీ
ఏక్‌మె దోపియ ఇరాని ఛాయి
తెలంగాణోంక పసీన హై
హైదరాబాద్ ఏక్ హసీన హై ॥ హైదరాబాద్ ॥

SCERT TELANGANA

# 4. నీడ ఖరీదు

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**





### ప్రశ్నలకు జవాబులు చెప్పండి

- బొమ్మలోని పిల్లలు ఏం మాట్లాడుకుంటున్నారు?
- బొమ్మ చూసి కథను ఊహించి చెప్పండి.
- కొబ్బరికాయని పట్టుకొని వేళ్ళాడుతున్న మనిషిని చూస్తే మీకేమనిపిస్తుంది? ఆయన ఎలాంటి వాడై ఉంటాడు?

### ఉద్దేశం

కొంతమంది తమ అతి తెలివితో ఇతరులను మోసం చేయాలని చూస్తారు. అట్లాంటి వాళ్ళకు తగిన బుద్ధి ఎలా చెప్పాలో తెలియజేయడమే ఈ పాఠం యొక్క ముఖ్య ఉద్దేశం.

### పిల్లలూ! ఇట్లా చేయండి.




- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు - అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA

“ఈ చెట్టు నాది. ఈ చెట్టునీడ కూడా నాదే! అన్న ముసలాయనతో క్షమించు, ఈ చెట్టు నీడను నాకు అమ్ముతవా?” అని నమ్రతగా శివయ్య అడిగాడు. ఇంతకు శివయ్య ఎవరు? ఎందుకట్లా అడిగాడు? ఏం జరిగిందో తెలుసుకోవాలని ఉన్నదా? ఐతే పాఠం చదువండి. మీకే తెలుస్తుంది.

ఆ రోజు బడికి సెలవు కావడంతో పిల్లలందరు ఊరి చివర మామిడి చెట్టు కింద ఆటలాడుకుంటున్నారు. కొందరు చెట్టు ఎక్కుతూ దిగుతూ కోతి కొమ్మచ్చి ఆడుకుంటున్నారు. “మామిడికాయ పులుపు చెట్టెక్కి దులుపు” అనుకుంటూ చెట్టు కొమ్మల్ని ఊపుతూ కాయలు రాలుస్తున్నారు మరికొందరు.

మామిడి చెట్టుకు దగ్గరగా పెద్ద ఇల్లు ఉన్నది. ఆ ఇల్లు పిసినారి పాపయ్యది. పిల్లికి బిచ్చం పెట్టని పాపయ్య ఎవళ్ళనూ దగ్గరకు రానియ్యడు. ఎప్పుడూ రుసరుసలాడుకుంటూ, ముఖం చిట్లించుకుంటూ ఉంటాడు. ఈ విషయం అక్కడ ఆడుకునే పిల్లలకు కూడా తెలుసు. అందుకే పిసినారి పాపయ్య కంట పడకుండా ఆడుకుంటూనే ఉంటారు. ఆరోజు పిల్లల లొల్లి విన్నాడో లేదో “ఎవడ్రా అది, నా చెట్టుకిందే



ఆడుతారా? ఎంత ధైర్యం మీకు? మీ పని చెప్తా” అని అరుస్తూ పిల్లల్ని పట్టుకోవటానికి ఉరికాడు. పిల్లలు దొరికితేనా! ఈయన మాట వినిపించిందో లేదో పిల్లలంతా కాలికి బుద్ధిచెప్పారు.

ఒకరోజు పక్క ఊరి నుండి శివయ్య అనే యువకుడు ఆ దారినపోతూ అలసటతో మామిడి చెట్టు కింద కూర్చున్నాడు. ఆ రోజు కూడా యథావిధిగా పిల్లలు రావడం, ఆడుకోవటం పిసినారి పాపయ్య నిప్పులు చెరుగుతూ ఉరుక్కుంటూ రావటం జరిగింది. పిల్లలందరూ ఉరుకుడే ఉరుకుడు!

పాపయ్య చెట్టు కిందికి వచ్చాడు. కానీ చెట్టునీడలో శివయ్య కనిపించాడు. అలసిపోయి ఉన్నాడేమో శివయ్యకు కునుకుపట్టింది. నిద్రపోతున్న శివయ్య, పాపయ్యను గమనించలేదు.


పాపయ్య కోపంతో "ఎవఁ్రానువ్వు? పరాయి వాళ్ళ చెట్టు నీడలో కూచోని కునుకు తీస్తున్నవ్! లే!" అని గట్టిగా కేకలేశాడు.

ఆ కేకలకు శివయ్య దబుక్కున లేచాడు. "అయ్యా! క్షమించు. ఏమంటున్నారు. ఇంకోసారి చెప్పండి" అన్నాడు.

"ఏరా! నేనన్నది చెవికెక్కలేదా? పరాయివాళ్ళ చెట్టునీడలో హాయిగా కునుకుతీస్తున్నవ్!" అని అన్నాడు.

శివయ్యకు పాపయ్య ప్రవర్తన వింతగా అనిపించింది. "పరాయివాళ్ళ చెట్టు నీడేమిటి?" అని అడిగాడు శివయ్య.

"ఇది నా చెట్టు. ఈ నీడ నా చెట్టునీడ! ఊ... నడు... బైటికినడు" అంటూ పాపయ్య మళ్ళీ శివయ్యమీద గట్టిగా అరిచాడు. "ఈ చెట్టు ఊరందరిది కదా!" అన్నాడు శివయ్య.



SCERT TELANGANA

"ఎవరన్నరామాట? మా తాత – ఈ చెట్టును నాటాడు. అందుకే ఈ చెట్టు నాది. ఇగ ఇక్కడినుంచి దయచెయ్యి!" అంటూ పాపయ్య కస్సుమన్నాడు "అదేమిటి! దారిన పోతుంటే సేదతీరటం తప్పా! రోడ్డు పక్కన చెట్టు బాటసారులకు నీడనిస్తుందనే కదా, మహానుభావులు చెట్లను నాటేది! మీరు మరీ వింతగా మాట్లాడుతున్నారు" అని శివయ్య విస్తుపోతూ అన్నాడు.

ఈ మాటలు పిసినారి పాపయ్య చెవికెక్కితే కదా! "ఇదేమి నీ జాగీరు కాదు. ఉత్తపుణ్యానికే చెట్టుకింద కూర్చొని ఇంకా నాకే నీతులు చెబుతున్నావా? లే... లే... నడు! మర్యాదగా ఇక్కడి నుంచి పో!" అని పాపయ్య అన్నాడు. ఈ మాటలకు శివయ్య మనసు చివుక్కుమన్నది. పాపయ్య ఎట్లాంటివాడో అర్థమైంది. ఎట్లాగైనా పిసినారి పాపయ్యకు బుద్ధి చెప్పాలనుకున్నాడు. "ఐతే, ఈ చెట్టు నీడను నాకు అమ్ముతవా నేను కొనుక్కుంటా!" అని శివయ్య, ఎంతో నమ్రతగా పాపయ్యను అడిగాడు.

ఈ మాటలు విన్న పిసినారి పాపయ్యకు శివయ్య అమాయకునిలా కన్పించాడు. "చెట్టు నీడను కొనుక్కుంటావా? ఓ... తప్పక అమ్ముత. ఎంత ఇస్తవు?" అని వస్తున్న నవ్వును లోలోపలే అణుచుకుంటూ అన్నాడు పాపయ్య.

"మీరే చెప్పాలి" అని శివయ్య అన్నాడు.

"వెయ్యి రూపాలిస్తావా? ఈ చెట్టు నీడ నీదయిపోతుంది" అని పాపయ్య అన్నాడు. "అమ్మో! వెయ్యి రూపాయలే! చాలా ఎక్కువ" అని శివయ్య అన్నాడు. "నీడంటే మాటలా? ఎంతచల్లగా, హాయిగా ఉంటదో చూసినవా మరి! వెయ్యి రూపాలిస్తే నీడ నీదైతది. లేకుంటే లేదు. ఎంతమంది ఉన్నారో ఈ నీడను కొనుటకు" అని పిసినారి పాపయ్య అన్నాడు.

సరేనని శివయ్య వెయ్యి రూపాయిలు తీసి ముసలాయనకు ఇచ్చాడు. నవ్వుతూ వెళ్ళి చెట్టు నీడలో పండుకున్నాడు.

"చెట్టు నీడను కొనుక్కునే తెలివితక్కువ వాడు కూడా ఒకడుంటడా?" అని తన అదృష్టానికి తానే మురిసిపోతూ ఇంట్లోకి పోయాడు పాపయ్య.

కాసేపటికి సూర్యుడి దిశ మారింది. దాంతోపాటే చెట్టు నీడ కూడా జరుగసాగింది. అట్లా... అట్లా... ఆ నీడ ముసలాయన ఇంటి ఆవరణ వరకు జరిగింది. శివయ్య లేచి నిల్చున్నాడు.

చెట్టు నీడ పడ్డ ఇంటి వాకిట్లకు వెళ్ళి కూర్చున్నాడు. "శివయ్యా! ఇక్కడికి ఎందుకు వచ్చినవు? ఇట్ల ఇంకొకరి ఇంటి వాకిట్లకు వచ్చి కూర్చుంటవా? నడు... అవతలికి నడు" అన్నాడు పాపయ్య.

"అదేంది అట్లా అంటవు! నువ్వు నాకు అమ్మిన చెట్టు నీడలోనే కూర్చున్నా కదా!" అని శివయ్య అన్నాడు.

పిసినారి పాపయ్యకు కోపం నషాళానికి అంటింది. "నా ఇంటి వాకిట్లకు రావద్దన్నానా? ఎన్నిసార్లు చెప్పాలి! పో ... అవతలికి!" ముసలాయన మళ్లీ గట్టిగా కేకలు వేశాడు.

"నువ్వు ఈ చెట్టు నీడను నాకు అమ్మావు కదా! ఆ నీడ ఎక్కడ పడితే అక్కడికి వెళ్ళి కూర్చోవడానికి నాకు హక్కు ఉన్నది" ఎంతో మెల్లగా చెప్పాడు శివయ్య.

ముసలాయన తెల్లబోయాడు. లోలోపల గొణుక్కుంటూ ఇంట్లోకి పోయాడు. ఆ తర్వాత నీడతోపాటే శివయ్య అరుగుమీదికి, తరువాత అర్రలోకి పోయాడు.

"ఫో! బయటకు ఫో! నా ఇంట్లోంచి బయటకు ఫో!" అనుకుంటూ గట్టిగా చిందులు తొక్కాడు ముసలాయన.

శివయ్య చిరునవ్వులు నవ్వుకుంటూ కూర్చున్న చోటు నుండి లేవలేదు. చెట్టునీడ దిశమారి పాపయ్య తోటమీద కూడా పడ్డది. శివయ్య తోటలోనికి పోయి నీడ పడిన చోటులోని కూరగాయలన్నీ తెంపడం మొదలు పెట్టాడు.

ఇది చూసి పిసినారి పాపయ్య లబోదిబోమనుకుంటూ కన్నీరు మున్నీరుగా ఏడ్వడం మొదలు పెట్టాడు. తెల్లారి, ఆ తర్వాత రోజు, ఇట్లా ప్రతిరోజు శివయ్య చెట్టు నీడతో పాటు జరుగుతూ, పడుకుంటూ, కూర్చుంటూ పిసినారి పాపయ్య ఇంట్లోకి పోతూనే ఉన్నాడు. తోటలోని కూరగాయలు తెంపుకొంటూనే ఉన్నాడు.

ఆఖరికి ఓ రోజున ముసలాయన ఇక ఉండబట్టలేక "బాబూ! నా చెట్టు నీడని నాకు ఇచ్చెయ్యి నీ వెయ్యి రూపాయలు నీకు తిరిగి ఇస్తా!" అని అన్నాడు.



TELANGANA

"ఇంత చక్కటి చెట్టునీడను అమ్మే ఉద్దేశం నాకులేదు. నా నీడ దగ్గరికి రావద్దు! వెళ్ళిపో! ఇక్కడి నుంచి" అన్నాడు శివయ్య. ఇక లాభం లేదనుకుని పాపయ్య ఊళ్ళో వాళ్ళకు ఈ విషయం చెప్పాడు. ఇది విన్న ఊరి వాళ్ళందరూ పిసినారి పాపయ్యకు తగిన శాస్తి జరిగిందన్నారే తప్ప ఎవ్వరూ సహాయం చేసేటందుకు ముందుకు రాలేదు.

"పాపయ్యా! ఇంకేదన్నా చెట్టునీడ ఉంటే మాక్కూడా అమ్ముతవా? మేముకూడ కొనుక్కుంటం" అంటూ ఆట పట్టించటం మొదలు పెట్టారు.

చివరకు పిసినారి పాపయ్య ఊరి పెద్దకు ఫిర్యాదు చేశాడు. ఊరి పెద్ద శివయ్యను పిలిపించాడు. శివయ్య జరిగినదంత వివరించాడు. శివయ్య చేసిన పని సరైనదేనని తీర్పు చెప్పాడు.

తీర్పు విన్న పిసినారి పాపయ్య తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. ఇది చూసి పిసినారి పాపయ్యలో మార్పు వచ్చిందని గ్రహించిన శివయ్య, "పాపయ్యా! చెట్టూ నీదే! నీడా నీదే! నీలో మార్పు కోసమే ఇదంతా చేసిన" అని అన్నాడు.

పిసినారి పాపయ్య శివయ్యకు వెయ్యి రూపాయలు తిరిగి ఇచ్చివేసి కృతజ్ఞతలు చెప్పాడు. అప్పటి నుండి చెట్టు నీడలో ఎవరు ఎప్పుడు కూర్చున్నా ఏమీ అనేవాడు కాదు. తాగటానికి నీళ్ళిచ్చేవాడు. బువ్వ కూడా పెట్టేవాడు. పిల్లలందరూ ఆటలాడుతుంటే వాళ్ళతో కలిసి ఆడుకుంటూ పిల్లవాడైపోయేవాడు పాపయ్య.



## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) పాఠం పేరు కథకు తగ్గట్లు ఉన్నదా? మీరైతే ఏపేరు పెడుతారు? ఎందుకు?

(ఆ) ఈ కథను సొంత మాటల్లో చెప్పండి.

### II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



(అ) పిసినారి పాపయ్య ప్రవర్తనను, స్వభావాన్ని తెలిపే పదజాలాన్ని పాఠంలో గుర్తించండి. ఆ పదాలున్న వాక్యాలను చదువండి. రాయండి.

________________________________________

________________________________________

________________________________________

________________________________________

(ఆ) కింది పేరా చదువండి. ఖాళీలలో పదాలను ఊహించి రాయండి.

నవ్వు మనిషి ఆరోగ్యానికి సూచిక. నవ్వడం ఒక భోగం. నవ్వకపోవడం ఒక __________ అన్నారు. అందుకే __________తూ బతకాలిరా తమ్ముడూ అన్నాడొక కవి. అంటే పెద్దగా __________ కాదు. వెకిలిగా __________ అంతకన్నా కాదు. నవ్వులో అనేక రకాలు ఉన్నాయి. చిరుహాసం, మంద__________, దరహాసం ఇట్లా ఎన్నో ఉన్నాయి. సందర్భోచితంగా __________ వల్ల ప్రమాదం రాదు. అపార్థం చేసుకోరు. నవ్వు నాలుగు విధాలుగా __________ అనే సామెత కూడా ఉన్నది. ఒక్కొక్కప్పుడు ఈ __________ అనేక అనర్థాలకు కూడా దారితీస్తుంది. కాబట్టి వెకిలి __________, ఎగతాళి __________ పనికిరావు. ఎల్లప్పుడూ చిరు __________ చిందిస్తూ ఎదుటివారి మనస్సు నొప్పించకుండా __________ కాలం గడుపాలి.

SCERT TELANGANA

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) పాపయ్యను అందరూ "పిసినారి పాపయ్య" అనడం సరైనదేనా? ఎందుకు?

(ఆ) పిసినారి పాపయ్య స్వభావం గురించి మీ సొంతమాటల్లో రాయండి.

(ఇ) శివయ్యను సమర్థిస్తూ ఊరి పెద్ద ఇచ్చిన తీర్పు సరైనదేనా? ఎందుకు?

## IV. పదజాలం



(అ) మామిడి చెట్టుకు సంబంధించిన పదాలు రాయండి.

______________________________

______________________________

______________________________

(ఆ) "కాలికి బుద్ధి చెప్పు" ... అంటే ఉరుకడం అని అర్థం. ఇటువంటి పదాలకు సందర్భాన్ని బట్టి అర్థం వస్తుంది. వీటిని జాతీయాలు అని అంటారు. పాఠం చదివి ఇటువంటివి మరికొన్ని జాతీయాలు రాయండి.

______________________________

______________________________

______________________________

______________________________

(ఇ) ఎటునుండి చదివినా ఒకేలా ఉండే పదాలు రాయండి.

ఉదా: పులుపు

__________ __________ __________ __________

__________ __________ __________ __________

(ఈ) కింది జాతీయాలతో సొంతవాక్యాలు రాయండి.

(1) పిల్లికి బిచ్చం పెట్టు : ______________________________

______________________________

SCERT TELANGANA

(2) కాలికి బుద్ధి చెప్పు : ________________

________________

(3) నిప్పులు చెరుగు : ________________

________________

(4) చెవికెక్కడం : ________________

________________

(5) నషాళానికి అంటడం : ________________

________________

(6) చిందులు తొక్కడం : ________________

________________

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) పాఠాన్ని నాటకీకరణ చేయండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



**ఈ పాఠంలో ఉన్న క్రియాపదాలు కొన్ని కింద ఉన్నాయి. వాటిని పరిశీలించండి.**

**చూశాడు, కాలిపోయింది, పడిపోయాను** ఈ పదాలు వాక్యభావాన్ని పూర్తయినట్లుగా తెలుపుతున్నాయి కదా! ఇట్లా వాక్యభావాన్ని పూర్తిగా తెలిపే క్రియా పదాలను **'సమాపక క్రియలు'** అంటారు.

**చూసి, వచ్చి, తిని** ఇటువంటి క్రియా పదాలు పూర్తికాని పనిని తెలిపే పదాలు. ఈ పదాలు వాక్యభావాన్ని అసంపూర్తిగా తెలిపే క్రియా పదాలు. వీటిని **'అసమాపక క్రియలు'** అంటారు.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

SCERT TELANGANA

(అ) మీరు రోజు రకరకాల పనులు చేస్తుంటారు కదా! పనులను తెలియజేసే క్రియాపదాలు రాయండి. వాటికి అసమాపక క్రియాపదాలు రాసి వాటితో వాక్యాలు రాయండి.

ఉదా: నిద్ర లేచాను – నిద్రలేచి


నేను ఉదయాన్నే నిద్రలేచి, ముఖం కడిగాను.

## ప్రాజెక్టు పని



మీ పాఠశాల గ్రంథాలయం నుండి హాస్య కథల పుస్తకం తీసుకొని చదువండి. వాటిల్లో మీకు బాగా నచ్చిన కథను చదివి వినిపించండి. ఎందుకు నచ్చిందో చెప్పండి.

## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | ఈ కథను సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | పేరాలోని ఖాళీలను పూరించగలను. | అవును / కాదు |
| 3. | పిసినారి పాపయ్య స్వభావం గురించి సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. | కథను నాటకీకరణ చేయగలను. | అవును / కాదు |


## సూక్తి

సొంత లాభం కొంత మానుకొని
పొరుగువారికి తోడుపడవోయ్ ... !

SCERT TELANGANA

# 5. నీతి పద్యాలు

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**




**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- పై బొమ్మలో పాప ఏం చెబుతున్నది?
- ఆ పద్యం ద్వారా మీకేం అర్థమైంది?
- మీకు తెలిసిన నీతి పద్యం చెప్పండి.

**ఉద్దేశం**

తెలుగు భాషలో పద్యం ఒక ప్రముఖమైన ప్రక్రియ. భారతభాగవతాలలో మన జీవితానికి పనికివచ్చే ఎన్నో నీతులు ఉన్నాయి. పద్యం తీరును పరిచయం చేస్తూ వాటిలోని కొన్ని పద్యాల ద్వారా పిల్లలలో నైతిక విలువలు పెంపొందించడం ఈ పాఠం ఉద్దేశం.



**పిల్లలూ! ఇట్లా చేయండి.**

- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు – అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

"తింటే గారెలు తినాలి. వింటే భారతం వినాలి" అని ప్రసిద్ధ సూక్తి. మహాభారతం మానవ స్వభావాన్ని చెప్పిన మహాకావ్యం. సంస్కృతంలో వేదవ్యాసుడు రాసిన భారతాన్ని నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు తెలుగులోకి అనువాదం చేశారు. వీరిని "కవిత్రయం" అంటారు. మహాభారతంలో మన జీవితానికి పనికివచ్చే ఎన్నో నీతులు ఉన్నాయి. అలాగే పోతన రాసిన భాగవతంలో కూడా ఇలాంటి పద్యాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని చూద్దాం.

## నన్నయ



1. కం. అలిగిన నలుగక, యెగ్గులు
పలికిన మఱి విననియట్లు ప్రతివచనంబుల్
పలుకక బన్నము వడి యెడఁ
దలఁపక, యున్నతఁడ చూవె! ధర్మజ్ఞుఁడిలన్

**తాత్పర్యం :** ఎవరైనా తనను కోపగించుకుంటే తాను వాళ్ళను కోపించక, దూషిస్తే విననట్లుండి ఎదురు మాట్లాడక, అవమానపడినా చింతించకుండా ఉన్నవాడే ధర్మం తెలిసినవాడు.



2. కం. పలుమఱు శపథంబులు, నం
జలియును, నభివాదముయును, సామప్రియ భా
షలు, మిథ్యా వినయంబులుఁ
గలయవి దుష్ట స్వభావ కాపురుషులకున్

**తాత్పర్యం :** మళ్ళీ మళ్ళీ ఒట్లుపెట్టుకోవడం, నమస్కారంచేయడం, ఎదుటివానికి నచ్చే మాటలు మాట్లాడడం, దొంగవినయాలను ప్రదర్శించడం చెడ్డవాళ్ళ లక్షణం.

## తిక్కన




3. కం. ధనమును, విద్యయు, వంశం
బును, దుర్మతులకు మదంబుఁ బొనరించును, స
జ్జనులైన వారికడఁకువ
యును, వినయము, నివియతెచ్చు నుర్వీనాథా!

**తాత్పర్యం :** ఓ మహారాజా! ధనము, విద్య, వంశము అనేవి చెడ్డవాళ్ళకు మదాన్ని (అహంకారాన్ని) కలిగిస్తాయి. ఇవే మంచివారికి గర్వం లేకుండా చేసి వినయాన్ని కలిగిస్తాయి.



SCERT TELANGANA

4. కం. తనువున విఱిగిన యలుఁగుల
నను వునఁ బుచ్చంగవచ్చు; నతి నిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
విను మెన్నియుపాయములను వెడలునె? యధిపా!



**తాత్పర్యం :** ఓరాజా! శరీరంలో బాణాలు నాటుకుంటే ఏదో ఉపాయంతో వాటిని బయటికి తీయవచ్చుకాని మనసులో నాటుకొన్న (బాధలుకలిగించే) మాటలు ఎన్ని ఉపాయాలతోనైనా బయటకు రావు.

## ఎఱ్ఱన




5. తే.గీ. పాపముల కెల్ల నెక్కుడు పాతకములు
సుమ్మి క్రోధ, లోభంబులు సువ్రతాత్మ!
వాని రెంటి జయించిన వాఁడు గాని
యెందుఁ బరమ ధార్మికుఁడని యెన్నఁబడఁడు

**తాత్పర్యం :** అన్ని పాపాలకంటే కోపము, పిసినారితనం (అత్యాశ), అనేవే గొప్ప పాపములు. ఈ రెండింటినీ జయించిన వాడే ధర్మాత్ముడు.

6. కం. శరణంబని వచ్చిన భీ
కర శత్రువు నయినఁ బ్రీతిఁగావగవలయున్
గరుణాపరుల తెఱంగిది;
యిరవుగ సరిగావు దీనికే ధర్మంబుల్



**తాత్పర్యం :** ఎంత భయంకర శత్రువైనా శరణని వస్తే ప్రేమతో కాపాడాలి. దయగలవారు ఇట్లాగే చేస్తారు. ఏ ధర్మాలు దీనితో సరిరావు.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22



## పోతన

7. క. చదువని వాడజ్ఞుండగుఁ
జదివిన సదసద్వివేక చతురత గలుగున్
జదువగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ!

**తాత్పర్యం :** కుమారా! చదువుకోనివాడు జ్ఞానహీనుడగును. చదువుకుంటే మంచిచెడులను తెలుసుకొనే నేర్పు వస్తుంది, కాబట్టి ప్రజలు తప్పకుండా చదువుకోవాలి. నాయనా! నిన్ను శ్రేష్ఠులైన గురువుల దగ్గర చదివిస్తాను. చదువుకో.



8. క. పరహితము సేయునెవ్వడు
పరమహితుండగును భూత పంచకమునకున్
బరహితమె పరమ ధర్మము
పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ!

**తాత్పర్యం :** పున్నమి చంద్రునివంటి ముఖము కలదానా! ఇతరులకు మేలుచేసేవాడు పంచభూతాలకు, జీవరాశులకు పరమ హితుడవుతాడు. పరహితమే గొప్పధర్మం. పరహితులకు ఎక్కడా ఎదురుండదు.

## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) పద్యాలను రాగంతో, భావంతో చదువండి. వాటి భావాన్ని సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) “ధర్మాత్ములు” అని ఎవరిని అంటారు?

SCERT TELANGANA

## II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



**(అ) కింది వాక్యాలకు సరిపోయే పద్యపాదాలను పద్యాల నుండి వెతికి రాయండి.**

(1) ధనాన్ని రక్షించుకోవడంకన్నా సత్ప్రవర్తన రక్షించుకోవడమే మంచిది.

_______________________________________________

(2) అందరూ చదువుకోవాలి.

_______________________________________________

(3) అవమానపడినా చింతించకుండా ఉన్నవాడే ధర్మం తెలిసినవాడు.

_______________________________________________

(4) మనసున నాటుకొన్న మాటలు (బాధను కలిగించేవి) ఎన్ని ఉపాయాలతోనైనా బయటికి రావు.

_______________________________________________

(5) ఇతరులకు మేలుచేయడమే ధర్మం.

_______________________________________________

**(ఆ) పాఠంలోని పద్య తాత్పర్యాల ఆధారంగా కింది వాక్యాలను పూరించండి.**

(1) చదువుకోకుంటే _______________________________

(2) ఎదుటివారికి నచ్చే మాటలు మాట్లాడటం _______________________

(3) అన్ని పాపాలకంటే కోపము, పిసినారితనం(అత్యాశ), _______________

(4) ఇతరులు మేలు చేస్తే _______________________________

(5) ధనము, విద్య, వంశము అనేవి మంచివారికి _______________________

**(ఇ) కింద పద్యపాదాలు సరిచేసి రాయండి.**

| | |
|---|---|
| మనమున నాటిన మాటలు | _______________________ |
| ననువున బుచ్చంగవచ్చు; నతి నిష్ఠురతన్ | _______________________ |
| విను యెన్నియుపాయములను వెడలునె యధిపా! | _______________________ |
| తనువును విఱిగిన యలుగుల | _______________________ |

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) అన్నిటికన్నా గొప్పధర్మం ఏది?

(ఆ) ధర్మం తెలిసిన వానికి ఉండవలసిన లక్షణాలేవి?

(ఇ) మనసుకు బాధను కలిగించే మాటలు ఎందుకు మాట్లాడకూడదు?

(ఈ) మనలో కోపం, పిసినారితనం (అత్యాశ) అనేవి ఎందుకు ఉండకూడదు?

## IV. పదజాలం

(అ) కింది వాక్యాలలో గీత గీసిన పదానికి సరైన అర్థాన్ని రాయండి.



(1) కథల పుస్తకాలంటే రవికి ఎంతో ప్రీతి. __________

(2) చదువు వల్ల వివేకము కలుగుతుంది. __________

(3) మంచి పనులు చేసేవారిని సజ్జనులు అంటారు. __________

(4) పున్నమిరోజు పర్వేందుని కాంతి హాయినిస్తుంది. __________

(5) మంచి వచనములు ఆచరిస్తే మేలు జరుగుతుంది. __________

(6) పిల్లలు చేస్తున్న అల్లరిపనులవల్ల తండ్రికి క్రోధం వచ్చింది. __________

(ఆ) వాక్యంలో వచనం మారినప్పుడు, వాక్యంలో కలిగే మార్పును తెలుసుకున్నారు కదా! కింది వాక్యాలలో గీతగీసిన పదాల వచనాలను మార్చి, వాక్యాన్ని తిరిగి రాయండి.

ఉదా: విద్యార్థులు బొమ్మ గీశారు.

విద్యార్థులు బొమ్మలు గీశారు.

(1) కొంగ చెరువులోని చేపలు తిన్నది.

(2) రమ్య కథల పుస్తకం చదివింది.

(3) ఆకాశంలో గాలిపటాలు ఎగురుతున్నాయి.

(4) వినయ్ లడ్డూ తిన్నాడు.

(5) తోటలో మామిడిచెట్లు ఉన్నది.

SCERT TELANGANA

(ఇ) కింది పదాలు ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

(1) ధర్మం : ______________________________

(2) శపథం : ______________________________

(3) అణకువ : ______________________________

(4) లోభం : ______________________________

(5) శరణు : ______________________________

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) పాఠంలో ఏదైనా ఒక పద్యభావం వచ్చేటట్లు కథ రాయండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది అసమాపక, సమాపక క్రియా పదాలు ఉపయోగించి వాక్యాలు రాయండి. అవి ఏకాలానికి చెందిన వాక్యాలో తెలుపండి.

(1) వచ్చి, చేసింది (2) తిని, చూస్తున్నది

(3) చదివి, రాస్తూ ఉన్నాడు (4) రుబ్బి, చేశారు

(5) తెచ్చి, వండుతారు

ఉదా: పాపవచ్చి భోజనం చేసింది (భూత కాలం)

పాపవచ్చి భోజనం చేస్తూ ఉన్నది. (వర్తమాన కాలం)

పాపవచ్చి భోజనం చేస్తుంది. (భవిష్యత్ కాలం)

(1) ______________________________ (                )

(2) ______________________________ (                )

SCERT TELANGANA

(3) ____________________ (          )

(4) ____________________ (          )

(5) ____________________ (          )



ప్రాజెక్టు పని

మీ గ్రంథాలయం లోని ఏవైన నీతి శతక పద్యాల పుస్తకం తీసుకొండి. మీకు నచ్చిన ఏవైనా మూడు, నాలుగు పద్యాలను తరగతిలో చదివి వినిపించండి. భావాలు చెప్పండి.

## నేనివి చేయగలనా?

1. పద్యాలను రాగంతో, భావంతో పాడగలను, భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. అవును / కాదు
2. వాక్యాలకు సరిపోయే పద్య పాదాలను పద్యాల నుండి వెతికి రాయగలను. అవును / కాదు
3. ధర్మం గొప్పతనం గురించి సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు
4. పాఠంలో ఏదైనా ఒక పద్యభావం వచ్చేటట్లు కథ రాయగలను. అవును / కాదు

**సూక్తి**

ప్రయత్నం, సాహసం, ధైర్యం, బుద్ధిబలం, శక్తి, పరాక్రమం, ఈ ఆరు గుణాలు ప్రతి మనిషిలో ఉండడం అవసరం.

SCERT TELANGANA

# చదువు - ఆనందించు

## తెలుగు సంవత్సరాలు

చేతిలోని శుభలేఖను చూసుకుంటూ దీపిక మురిసిపోతున్నది. ఇంట్లోకి వస్తున్న హారిక "ఏమిటమ్మా! అలా నీలో నీవే సంతోషపడుతున్నవు?" అంటూ దగ్గరకు వచ్చింది. "మా బాబాయి కొడుకు రాముకి పెళ్ళికుదిరింది. ఇదిగో శుభలేఖ" అంటూ దాన్ని హారికకు ఇచ్చింది. హారిక శుభలేఖ చదివింది.

"అమ్మా! ఈ శుభలేఖలో 'జయ నామ' సంవత్సరం అని ఉన్నది. ఇది 2015వ సంవత్సరం కదా! ఇందులో ఇలా రాశారేమిటి?" అని అడిగింది హారిక.

"ఓహో! అదా నీ సందేహం! మార్చి నెలలో మనం 'ఉగాది' పండుగ జరుపుకున్నం గుర్తున్నదా?" "గుర్తున్నదమ్మా! ఆ రోజు కొత్త సంవత్సరం వచ్చిందని నువ్వు ఉగాది పచ్చడి చేశావు. తాతయ్య పంచాంగశ్రవణం చేసిండు కదా!" "అవును. బాగానే గుర్తున్నది! 'జయ' అనేది ఒక తెలుగు సంవత్సరం పేరు" అన్నది దీపిక. "ఈ సంవత్సరాలు అనేవి ఎందుకమ్మా?" అడిగింది హారిక. "చరిత్రలో ఎప్పుడు ఏం జరిగిందో చెప్పడానికి సంవత్సరాలు అవసరం కదా! అందుకని మన పెద్దలు సంవత్సరాల లెక్కలు, వాటికి పేర్లు ఏర్పాటు చేశారు."

"అంటే ఒక్కో సంవత్సరానికి ఒక్కో పేరు ఉంటదన్నమాట" అన్నది హారిక.

"ఔను, మనకు తెలుగులో అరవై సంవత్సరాలు ఉన్నాయి" అన్నది దీపిక.

"వాటిపేర్లు నీకు తెలుసా? చెప్పవా అమ్మా!" అన్నది హారిక.

"తెలుసు!" అని అమ్మ సంవత్సరాల పేర్లు చెప్పింది. హారిక రాసుకున్నది.

1. ప్రభవ
2. విభవ
3. శుక్ల
4. ప్రమోదూత
5. ప్రజోత్పత్తి
6. ఆంగీరస
7. శ్రీముఖ
8. భావ
9. యువ
10. ధాత
11. ఈశ్వర
12. బహుధాన్య
13. ప్రమాది
14. విక్రమ
15. వృష
16. చిత్రభాను
17. స్వభాను
18. తారణ
19. పార్థివ
20. వ్యయ
21. సర్వజిత్తు
22. సర్వధారి
23. విరోధి
24. వికృతి
25. ఖర
26. నందన
27. విజయ
28. జయ
29. మన్మథ
30. దుర్ముఖి
31. హేవిళంబి
32. విళంబి
33. వికారి
34. శార్వరి
35. ప్లవ
36. శుభకృతు
37. శోభకృతు
38. క్రోధి
39. విశ్వావసు
40. పరాభవ
41. ప్లవంగ
42. కీలక
43. సౌమ్య
44. సాధారణ
45. విరోధికృతు
46. పరీధావి
47. ప్రమాదీచ
48. ఆనంద
49. రాక్షస
50. నల
51. పింగళ
52. కాళయుక్తి
53. సిద్ధార్థి
54. రౌద్రి
55. దుర్మతి
56. దుందుభి
57. రుధిరోద్గారి
58. రక్తాక్షి
59. క్రోధన
60. అక్షయ


"ఈ అరవై సంవత్సరాలు పూర్తి అయిపోతే ఎలాగమ్మా! మళ్ళీ కొత్త పేర్లు వస్తయా?" సందేహం వెలిబుచ్చింది హారిక. అమ్మ చిరునవ్వు నవ్వింది. "ఈ అరవై సంవత్సరాలు ఇదే వరసలో ఒకదాని తరువాత ఒకటి మళ్ళీ వస్తాయి. ఈ వరస పూర్తి అయిన తర్వాత మళ్ళీ ఇవే మొదలయితాయి. దీన్నే షష్టివర్ష చక్రం అంటారు." అని చెప్పింది దీపిక.

"ఈ పేర్లను నేను చదివి జ్ఞాపకం పెట్టుకొంటా. నోటికి నేర్చుకొంటా. నేను తెలుసుకున్న ఈ తెలుగు సంవత్సరాల పేర్లను మా మిత్రులకు కూడా తెలియజేస్తా", అంటూ సంతోషంగా వెళ్ళింది హారిక.

SCERT TELANGANA

# 6. మనసుంటే మార్గముంటది

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**




**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- పై బొమ్మలో ఏ పోటీలు జరుగుతున్నాయి?
- బొమ్మలోని వ్యక్తుల్లో ఏం తేడాలు గమనించారు?
- బొమ్మలో కాళ్ళు లేకుండా పరుగెత్తే వ్యక్తిని చూస్తే మీకేమనిపిస్తున్నది?

**ఉద్దేశం**

అవయవలోపం ఉన్నవాళ్ళు కూడా ఇతరులతో సమానంగా రాణించగలరని, వారిని చూసి ఇతరులు స్ఫూర్తిని పొందాలని తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.



**పిల్లలూ! ఇట్లా చేయండి.**

- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు - అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



అన్ని అవయవాలు సరిగా ఉన్నవాళ్ళు కూడా చేయలేని పనులు ఎన్నో ఉన్నాయి. మరి చేతుల్లేని వారు ఏం చేయగలరు? అని అనుకొంటాం. కానీ చేతుల్లేకున్నా పట్టుదలతో తాను అనుకున్నది సాధించిందామె. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం ముందు ఆ దేవుడైనా తల వంచవలసిందే. ఇంతకూ ఎవరామె ? ఏం చేసింది ? పాఠం చదివి తెలుసుకొండి.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

సరూర్‌నగర్,

31-12-2014.

ప్రియమైన లక్ష్మీ!

ఎట్లున్నవు? ఇక్కడ మేమంతా బాగున్నం. నీకు గుర్తున్నదా! మేము తెలంగాణకు రాక ముందు గుజరాత్‌లోని సూరత్‌లో ఉండేటోళ్ళం. మొన్న దసరా సెలవులకు మా ఊరు సూరత్‌కు పోయినం. అక్కడ మా నాయినమ్మ ఉన్నది. సాయంత్రం అయ్యేసరికి దోస్తులందరం కలుసుకున్నం. మా వాడలోని పిల్లలందరం కలిసి మట్టిల గీతలు గీసి, కుంటుడాటలు, రావిఆకులతో పీకలు చేసి పీపీ... ఊదుడ్లూ, ఉరుకుతూ నేల-బంద, దాగుడు మూతలు ఇట్లా రకరకాల ఆటలు ఆడినం. జ్యోత్స్న కూడ మాతో కలిసి ఆడేది. మేము పాటలు పాడితే మాతో కలిసి పాడేది. తాడాట, చెండాట వంటి ఆటలు ఆడేటప్పుడు మాత్రం ఒక పక్కన కూర్చునేది. నీకు జ్యోత్స్న గురించి చెప్పలేదు గదా! మా దోస్తు జ్యోత్స్న మనందరివలె కాదు. చాలా ప్రత్యేకమైనది. ఎందుకో తెలుసా? ఆమెకు చేతులు లేవు. కాని కాళ్ళు మాత్రం బాగా పని చేస్తయి. జ్యోత్స్నకు చాలా పట్టుదల. "నేనెందుకు అందరివలె చేయలేక పోతున్న"? అని అనుకునేది. అందుకని ఎక్కడ వెనుకడుగు వేయలేదు. గమ్మత్తైన విషయం ఏమంటే మనం చేతులతో చేసే పనులన్నీ ఆమె కాళ్ళతో చేయడం నేర్చుకున్నది. నువ్వు జ్యోత్స్నను చూస్తే పరేషానైతవు. ఆమె బియ్యంలో రాళ్ళు ఏరడం, తల దువ్వడం, కూరగాయలు కోయడం, బట్టలుతకడం, పలక మీద రాయడం వంటి పనులన్నీ కాళ్ళతోనే చేస్తది. జ్యోత్స్న పదో తరగతి వరకు చదివింది. ఉడుం పట్టులాంటి ఆమె పట్టుదల నాకు బాగా నచ్చుతది. ఏది చేయాలనుకుంటే అది నేర్చుకునేదాక విడిచిపెట్టదు.

జ్యోత్స్న వాళ్ళ అమ్మ, అక్క ఇంట్లో అనేకతీర్ల కుట్లు, అల్లికలూ చేస్తుండేటోళ్ళు. వాళ్ళు చేస్తున్న పనులను జ్యోత్స్న ఎంతో శ్రద్ధగా గమనించేది. ఎప్పుడు నేర్చుకుందో తెలువదు గాని ఆమె కూడా సూది పట్టింది. అందంగా బట్టలపై డిజైన్లు కుట్టేది. బట్టల మీద అందంగా ఎంబ్రాయిడరీ చేయడం అంత అల్కటి పని కాదు. కానీ మనసుంటే మార్గం ఉంటది గదా! ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం చాలా గొప్పది.

చాలా తక్కువ కాలంలోనే జ్యోత్స్న ఊళ్ళోనే గొప్ప ఎంబ్రాయిడరీ కళాకారిణి అయింది. ఏ ఏ దుస్తులకు ఎటువంటి దారాలు, పూసలు వాడాలో జ్యోత్స్నకు తెలిసినంత ఎవరికీ తెలువదు. ఆమె తయారుచేసినవన్నీ ప్రదర్శనలో పెట్టారు. మా ఊళ్ళోనేగాక లక్నో, బెంగాల్లో కూడ ఆమె కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ చేసిన

బట్టలు అమ్ముడయ్యేవి. వాటికి మంచి గిరాకీ ఉండేది. సంప్రదాయ డిజైన్లకు ఆధునికతను జతచేసే ఆమె పనితనాన్ని అందరు మెచ్చుకునేటోళ్ళు. జ్యోత్స్న కాళ్ళకు అసలు అలసట ఉండదు. ఆమె కాళ్ళు ఆగవు. ఏదో ఒక పని చేస్తనే ఉంటయి. ఆమె ఎదుగుదలకు అవి సహకరిస్తూనే ఉంటయి.

నిజంగా జ్యోత్స్న వంటి దోస్తు నాకు ఉండడం చాలా గర్వంగా అనిపిస్తున్నది. నాకు అన్నీ బాగున్నా నేను జ్యోత్స్న వలె పేరు సంపాదించలేదు గదా! ఈసారి ఆమెను మన ఊరికి తీసుకువస్త. మీకందరికీ పరిచయం చేస్త. మనం ఆమెను చూసి ఎంతో నేర్చుకోవాలె. మన స్నేహితులందరినీ అడిగిన అని చెప్పు. మీ అమ్మానాయినలకు నా నమస్కారాలు చెప్పు. తొందర్లో కలుసుకుందాం.

నీ

శాంతి

**చిరునామా :**

లక్ష్మి
తండ్రి పేరు : శ్రీనివాసు,
శివాలయం వీధి,
చెన్నూరు,
ఆదిలాబాదు - 504201.



## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) లేఖ చదువగానే మీకు ఏం అనిపించిందో చెప్పండి.

(ఆ) పట్టుదల, ఆత్మవిశ్వాసంతో జ్యోత్స్న కళాకారిణి అయింది కదా! మీకు ఏ ఏ విషయాల్లో పట్టుదల ఉన్నది. వాటిలో నైపుణ్యం పొందడానికి ఏం చేస్తారో చెప్పండి.

### II. ధారాళంగా చదువడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం



(అ) కింది వాక్యాలు చదువండి. పాఠం ఆధారంగా సరైన వాటికి '✓' పెట్టండి. తప్పుగా ఉన్న వాటికి '✗' పెట్టండి.

(1) జ్యోత్స్న లేఖ రాసింది. ( )

(2) జ్యోత్స్న ముంబయిలో ఉంటున్నది. ( )

(3) కాళ్ళు కదపలేక జ్యోత్స్న బాధపడింది. ( )

(4) సంప్రదాయక డిజైన్లకు ఆధునికత జోడించడం జ్యోత్స్న ప్రత్యేకత. ( )

(5) పట్టుదల, ఆత్మవిశ్వాసానికి మారుపేరు జ్యోత్స్న. ( )

(ఆ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

(1) ఉత్తరం ఎవరు రాశారు? ____________________

(2) ఉత్తరాన్ని ఎవరికి రాశారు? ____________________

(3) ఎవరి గురించి రాశారు? ____________________

(4) చిరునామాను ఎందుకు రాయాలి? ____________________

(5) లక్ష్మి ఎక్కడ ఉంటున్నది? ____________________

SCERT TELANGANA

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) జ్యోత్స్న మీకు ఎదురైతే మీరు ఏమేమి ప్రశ్నలు అడుగుతారు?

(ఆ) జ్యోత్స్న పట్టుదల గురించి తెలుసుకొన్నారు కదా! మరి మీరు పట్టుదలతో ఏం చేయాలనుకుంటున్నారు? ఎందుకు?

(ఇ) జ్యోత్స్న గొప్పతనం గురించి రాయండి.

## IV. పదజాలం



(అ) కింది పదాలు చూడండి. ఒకటి కన్నా ఎక్కువగా అదే అర్థం వచ్చే పదాలు రాయండి.

ఉదా: (1) దోస్తులు = స్నేహితులు, మిత్రులు, సోపతిగాళ్ళు

(2) బట్టలు = ____________________


(3) ఎదుగుదల = ____________________


(4) గమనించడం = ____________________

(5) ఆధునికత = ____________________

(6) ఊరు = ____________________

(ఆ) జ్యోత్స్నకు సంబంధించిన పదాలు కింద ఉన్నాయి. ఐతే మీకు సంబంధించిన పదాలు రాయండి.





SCERT TELANGANA

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) 'జ్యోత్స్న' గురించి లక్ష్మికి శాంతి ఉత్తరం రాసింది కదా! 'జ్యోత్స్న' లాంటి వారి నుండి మనం నేర్చుకోవాల్సిన విషయాల గురించి మీ మిత్రుడు / మిత్రురాలికి ఉత్తరం రాయండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



(అ) కింది వాక్యాలు చదువండి.

(1) శివ గుర్రం కళ్ళాన్ని చేత్తో పట్టుకున్నాడు.

(2) ప్రజ్ఞ మొక్కలు నాటింది.

(3) మన ముఖ్యమంత్రి పండితులను సత్కరించాడు.

(ఆ) పై వాక్యాలకు సంబంధించిన ప్రశ్నార్థక వాక్యాలను చదువండి.

(1) గుర్రం కళ్ళాన్ని ఎవరు పట్టుకున్నారు?

(2) మొక్కలు ఎవరు నాటారు?

(3) పండితులను ఎవరు సత్కరించారు?

పిల్లలూ! పై వాక్యాలలో 'ఎవరు' అనే పదానికి సమాధానం వచ్చే వాటిని 'కర్త' అంటారు.

(1) శివ దేన్ని పట్టుకున్నాడు?

(2) ప్రజ్ఞ వేటిని నాటింది?

(3) మన ముఖ్యమంత్రి ఎవరిని సత్కరించాడు?

ఈ ప్రశ్నలలో 'ఎవరిని, దేనిని' అనే పదాలకు సమాధానంగా వచ్చే పదాలను 'కర్మ' అంటారు. పనిని తెలిపే పదాలను క్రియలు అంటారని తెలుసుకదా!

SCERT TELANGANA

(ఇ) కింది వాక్యాలను చదువండి. కర్త, కర్మ, క్రియలను గుర్తించి పట్టికలో రాయండి.

(1) నితీశ్ సౌజన్యకు బహుమతి ఇచ్చాడు.

(2) తాబేలు కుందేలును ఓడించింది.

(3) సైనానెహ్వాల్ బాడ్మింటన్ ఆటలో చైనా దేశపు క్రీడాకారిణిని ఓడించింది.

(4) నిఖిల్ మామిడి పళ్ళు తిన్నాడు.

| కర్త | కర్మ | క్రియ |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |

## ప్రాజెక్టు పని



జ్యోత్స్న లాంటి వారి గురించి తెలుసుకొని రాయండి. చదివి వినిపించండి.

(మీ బంధువులు / గ్రామం / జిల్లా / రాష్ట్రం / దేశంలో ఎవరైనా కావచ్చు)

## నేనివి చేయగలనా?



1. జ్యోత్స్న గురించి సొంతమాటల్లో చెప్పగలను. అవును / కాదు
2. పాఠం ఆధారంగా వాక్యాలను తప్పు, ఒప్పులుగా గుర్తించగలను. అవును / కాదు
3. జ్యోత్స్న లాగా నేను కూడా పట్టుదలతో సాధించాలనుకొన్న విషయాలను సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు
4. నా అనుభూతులను తెలుపుతూ జ్యోత్స్నకు లేఖ రాసి, చదివి వినిపించగలను అవును / కాదు






ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు.
నీకీ లోకంలో అసాధ్యమేదీ లేదు.

– స్వామి వివేకానంద

SCERT TELANGANA

# చదువు - ఆనందించు

## బోనాలు



తెలంగాణ రాష్ట్రమంతటా ఘనంగా జరుపుకొనే పండుగల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగినది "బోనాల పండుగ" ఒకటి.

ఈ పండుగను ఆషాఢమాసంలో ప్రారంభించి శ్రావణ మాసం చివరి దాకా జరుపుకుంటారు. వర్షాలు బాగా కురవాలనీ, పాడిపంటలు బాగా అభివృద్ధి చెందాలనీ ప్రజలంతా ఎట్లాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలనీ, అమ్మవారినీ, గ్రామదేవతలను కోరుకుంటూ జరుపుకొనే పండుగ ఇది.

ఆషాఢమాసంలో దేవి తన పుట్టింటికి పోతుందని నమ్మకం. భక్తి శ్రద్ధలతో "బోనాలను" నైవేద్యంగా అర్పిస్తారు. వస్త్రాలను, కానుకలను, ఒడిబియ్యాన్ని కూడ సమర్పిస్తారు. ఈ తంతును "ఊరడి" అంటారు.

'బోనం' అంటే భోజనం. కుండ అనే మరో అర్థం కూడ ఉన్నది. ఇదే దేవికి సమర్పించే నైవేద్యం. కొత్త మట్టి కుండకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి వేపాకులను జడగా అల్లి కుండకు కడుతారు. పూలమాల కూడ కడుతారు. ఆ కుండలో పసుపు కలిపి వండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లం, అల్లం, పచ్చిపులుసు, ఆకుకూర మొదలగు వంటకాలను నైవేద్యంగా పెట్టుకొని దానిపై మరో చిన్న కుండను పెడుతారు. దానిని కూడా అలంకరించి దానిలో నీళ్లు పోసి అందులో కొంచెం బెల్లం, పెరుగు వేస్తారు. దీనినే 'సాక' అంటారు. ఈ చిన్న కుండపై మట్టి కంచుడు ఉంచి అందుల నూనె పోసి గండదీపం వెలిగిస్తారు. డప్పులతో, పోతరాజు ఆటలతో, మంగళహారతులతో ఊరేగింపుగా గుడికి పోతారు.



పండుగ మరునాడు పూనకం వచ్చిన శివసత్తులు చేతిలో వేపమండలు పట్టుకొని జుట్టు విరబోసుకొని బోర్లించిన పచ్చి మట్టికుండపై నిలబడి భవిష్యవాణి చెప్తారు. ఈ తంతును 'రంగమెక్కుడు' అంటారు. భక్తికి చిహ్నంగ భక్తులు రంగురంగుల కాగితపు "తొట్టెల"లను గుడికి కట్టి మొక్కులు తీర్చుకుంటారు.

బోనాల పండుగ జరుపుకున్నప్పుడు ఒక వాడ / ప్రాంతంలోని వాళ్ళంతా కలిసి అమ్మవారి దగ్గరికి ఊరేగింపుగా వెళ్ళడం, కలిసి జరుపుకోవడం పండుగలోని గొప్పదనం. అట్లాగే బంధువులను, చుట్టుపక్కల వాళ్ళను స్నేహితులను పిలిచి జరుపుకోవడం దీని ప్రత్యేకత.

SCERT TELANGANA

# 7. చిట్యాల ఐలమ్మ

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**




SCERT TELANGANA

**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- బొమ్మలో ఎవరున్నారు? ఏం చేస్తున్నారు?
- వాళ్ళు ఏం మాట్లాడుతుండవచ్చు?
- బొమ్మలో ఉన్న వారి గురించి మీకేమర్థమైందో తెల్పండి.

**ఉద్దేశం**

అన్యాయాన్ని ఎదిరించడం వీరుల లక్షణం. తెలంగాణ ఎంతోమంది వీరులు, వీరవనితలకు నిలయం. వాళ్ళలో ఒకరైన చాకలి ఐలమ్మ గురించి తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.



**పిల్లలూ! ఇట్లా చేయండి.**

- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు – అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22



పల్లవి: ఐలమ్మా... చాకలైలమ్మ...
తెలంగాణ పోరాటాన వెలుగమ్మా- ॥ ఐలమ్మ ॥

చరణం: ఓరుగల్లుజిల్ల రాయపర్తిలోని
కిష్టాపురంలోన పుట్టింది ॥ కిష్టా ॥

ఓరుగంటి మల్లమ్మ సాయన్నల
ముద్దు కూతురయ్యి మురిసింది. ॥ ముద్దు ॥

రజక కులంలోన రత్నదీపమయ్యి
ఊరువాడ పేరు వడసింది ॥ ఊరు ॥

* పదమూడో యేటనె పాలకుర్తిలోని
చిట్యాల గ్రామపు కోడలై చేరింది ॥ ఐలమ్మా...॥

చరణం: చిట్యాల నర్సింలు సిరుల ఇల్లాలయ్యి
మెట్టినింటిలోన మెరిసింది ॥ మెట్టి ॥

కులకాయికముతోని కూటికి జాలక
వ్యవసాయమును తలపెట్టింది ॥ వ్యవ ॥

మల్లంపల్లి కొండ్రావు భూస్వామి తా
కౌలు యెవుసము జేయ సాగింది ॥ కౌలు ॥

* యేటి కే డాదికి మంచి పంటలు దీసి
సొంత ఇంటిని తాను గట్టుకున్నాదమ్మ ॥ ఐలమ్మా...॥

**తెలంగాణ ఎంతోమంది వీరులకు, వీరవనితలకు పుట్టినిల్లు. అట్లాంటి వీరవనితల్లో ఒకరు చాకలి ఐలమ్మ. నాటికాలంలో పాలకులను ఎదిరించి తెలంగాణ మహిళల వీరత్వం చాటిచెప్పిన పోరాట యోధురాలు ఐలమ్మ. ఆమె వీరత్వం గురించి తెలుసుకుందాం.**



SCERT TELANGANA

చరణం: ఐనవారి రీతిగైన ఐలమ్మను
పట్వారి చిత్రంగ జూసిండు – ఊరి ॥ పట్వారి ॥

కాలికింది చెప్పులోలె ఉండేటిది
తలకెక్కుడేమని తలచిండు ॥ తల ॥

కూలి జేసేటోళ్ళు కౌలు పనేందని
పటపట పండ్లను గొరికిండు – వాడు ॥ పటపట ॥

* కౌలు బందు జేసి, కూలికి రమ్మంటె
కయ్యానికే సిద్ధమయ్యింది ఆయమ్మ ॥ ఐలమ్మ ॥

చరణం: మాటినలేదని మండిన పట్వారి
పాము తీరుగ పగ వట్టిండు ॥ పాము ॥

దేశిముఖు రామచంద్రరెడ్డిని గల్సి
కుట్రలెన్నొతాను జేసిండు ॥ కుట్ర ॥

పొలమంత నాశన మొనరించి, ఆగక
పంట నింటికి గొంచ వొయ్యిండు ॥ పంట ॥

* వాని అన్యాయాన్ని మానక యెదిరించి,
కొంగు నడుముకు జుట్టి కోర్టుల్ల గెలిచింది ॥ ఐలమ్మ ॥



SCERT TELANGANA

చరణం: ఈమె తీరుజూసి రామచంద్రారెడ్డి
తోక దొక్కిన తాచు అయ్యిండు ॥ తోక ॥

రౌడీలు గూండాలు రజాకార్లనుగూడి
ఐలమ్మనే అణచ జూసిండు ॥ ఐలమ్మనే ॥

ఇల్లు ఇల్లంతాను కొల్లగొట్టిచ్చిండు
ఇంటికి నిప్పు వెట్టిచ్చిండు ॥ ఇంటికి ॥



* పెనిమిట్ని గొట్టిచ్చి, కొడుకుల జంపిన
దుర్మార్గులకు ఆమె దుర్గమ్మ అయ్యింది ॥ ఐలమ్మ ॥

చరణం: అందరొక్కటయ్యి-అమ్మ ధైర్యం జూసి
ఆమెకు అండగ నిలిచిన్రు ॥ ఆమెకు ॥

న్యాయ పోరాటాన నాయకత్వంలోన
వెనుకుండి ఆమెను నడిపిన్రు ॥ వెనుకుండి ॥

జిత్తుల మారుల చిత్తుగ ఓడించి
కొత్త చరిత్రను రాసింది ॥ కొత్త ॥

* కంటినీటి నుండి మంటలు రేగంగ
కాళికాంబగమారి చీల్చిచెండాడింది ॥ ఐలమ్మ ॥

చరణం: స్త్రీ శక్తి రూపము - ఐలమ్మ
పోరాట దీపము - ఐలమ్మ
నారీ శిరోమణి - ఐలమ్మ
నాతి కిరీటము - ఐలమ్మ
దానము ధైర్యము - ఐలమ్మ
మానము-ప్రాణము - ఐలమ్మ

* ఘన సాయుధ తెలంగాణ పోరాటాన
తనదైనముద్రను ధరపైన నిలిపిన ॥ ఐలమ్మ ॥

SCERT TELANGANA

## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) గేయాన్ని రాగ, భావ యుక్తంగా పాడండి.

(ఆ) "వెనుకుండి నడిపిస్రు" అంటే మీకు ఏమర్థమయ్యిందో చెప్పండి.

(ఇ) ఐలమ్మవంటి వీరనారి / స్త్రీ మూర్తి మీకు ఇంకెవరైనా తెలుసా? వారి గురించి చెప్పండి.

### II. ధారాళంగా చదువడం, అర్థం చేసుకొని చెప్పడం, రాయడం



(అ) పాఠంలో ఐలమ్మ వీరత్వాన్ని తెలిపే పదాలు గుర్తించండి. వాటిని రాయండి.

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

(ఆ) ఈ కింది చరణం చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

ఐనవారి రీతిగైన ఐలమ్మను
పట్వారి చిత్రంగ జూసిండు – ఊరి ॥ పట్వారి ॥

కాలికింది చెప్పులోలె ఉండేటిది
తలకెక్కుడేమని తలచిండు... ॥ తల ॥

కూలిజేసేటోళ్ళు కౌలు పనేందని...
పటపట పండ్లను గొరికిండు – వాడు ॥ పటపట ॥

కౌలు బందు జేసి, కూలికి రమ్మంటె–
కయ్యానికే సిద్ధమయ్యింది ఆయమ్మ– ॥ ఐలమ్మ ॥

(1) పట్వారి ఐలమ్మను చిత్రంగా ఎందుకు చూశాడు?

____________________________________________

SCERT TELANGANA

(2) కాలికింది చెప్పులోలె ఉండాలని ఎవరనుకున్నారు?

(3) పట్వారి పటపట పండ్లను ఎందుకు కొరికాడు?

(4) కయ్యానికి సిద్ధమవడం అంటే ఏమిటి?

(5) ఐలమ్మ కయ్యానికి ఎందుకు సిద్ధమైంది?

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) "దుర్మార్గుల పాలిట ఐలమ్మ దుర్గమ్మ అయింది." ఎట్లాగో వివరించి రాయండి.

(ఆ) ఐలమ్మ వీరత్వం గురించి సొంతమాటల్లో రాయండి.

## IV. పదజాలం



(అ) కింది వాక్యాలు చదువండి.

కడుపు మండింది, కాలికి బుద్ధి చెప్పు... వీటిని జాతీయాలు అంటారని తెలుసుకదా! మరికొన్ని జాతీయాలు చూడండి. వీటితో సొంతవాక్యాలు రాయండి.

(1) తలప్రాణం తోకకు వచ్చినట్లు
(2) పొయ్యిలో ఉప్పువేసినట్లు
(3) తోక తొక్కిన తాచు
(4) అరికాలి మంట నెత్తికెక్కినట్లు
(5) తంతె పరుపులో పడ్డట్టు
(6) పోయింది పొల్లు ఉన్నది గట్టి

SCERT TELANGANA

### (ఆ) కింది పదాల వరుసలోని ఖాళీలలో తరువాత వచ్చే వరుస పదాలు రాయండి.

ఉదా: పొలం, ________, ________, ధనం.

పొలం, పంట, అంగడి, ధనం.

(1) దొంగలు, ________, ________, జైలు.

(2) దుష్టులు, ________, ________, శిక్ష.

(3) వడ్లు, ________, ________, అన్నం.

(4) నది, ________, ________, వంట.

(5) చెరువు, ________, ________, మత్తడి.

### (ఇ) కింది పదాలు ఒకే వాక్యంలో వచ్చేలా సొంతవాక్యం రాయండి.

(1) పుట్టింది, మురిసింది ____________________

(2) చేరింది, మెరిసింది ____________________

(3) కూలీ, బియ్యం ____________________

(4) పంట, ధర ____________________

(5) పొలమంత, మెరిసింది ____________________

## V. సృజనాత్మకత / ప్రశంస



### (అ) పాఠం ఆధారంగా మీకు తెలిసిన వీరనారి / స్త్రీ మూర్తి గురించి కింది పదాలు ఉపయోగించి గేయం రాయండి.

గేయం: స్త్రీశక్తి రూపమూ, పోరాట దీపమూ,
నారీ శిరోమణీ, నాతి కిరీటమూ,
దానమూ ధైర్యమూ, మానమూ ప్రాణమూ,

## VI. భాషను గురించి తెలుసుకుందాం



### (అ) కింది వాక్యాలు చదవండి. వాటిలోని పదాలలో కర్త, కర్మ, క్రియలు గుర్తించండి.

(1) విద్యార్థులు ఊరేగింపులు నిర్వహిస్తున్నారు.

(2) తాతయ్య స్నేహను సర్కస్‌కు తీసుకొని పోయాడు.

SCERT TELANGANA

(3) పింగళి వెంకయ్య త్రివర్ణపతాకాన్ని రూపొందించాడు.

(4) రజిత గేయం రాసింది.

(5) అమ్మ పాపాయికి పాలు ఇచ్చింది.

(6) కృష్ణ మామిడి పండ్లు తెచ్చిండు.

(7) మంగ శుభలేఖను చదివింది.

(8) సందీప్ నాయనమ్మను కథలు చెప్పుమని అడిగాడు.

## ప్రాజెక్టు పని



**వివిధ జిల్లాలలోని తెలంగాణ వీరనారీమణుల వివరాలు సేకరించండి, తరగతి గదిలో ప్రదర్శించండి.**

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | వీరనారీమణుల గురించి మాట్లాడగలను. | అవును / కాదు |
| 2. | చరణం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 3. | ఐలమ్మ వీరత్వం గురించి సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. | గేయం ఆధారంగా నాకు తెలిసిన వీరనారి / స్త్రీమూర్తి గురించి పదాలనుపయోగించి గేయాన్ని రాయగలను. | అవును / కాదు |




"వీరోచితంగా చేసే పనులు విరజిమ్మే పరిమళమే కీర్తి"

– సోక్రటీస్

SCERT TELANGANA

# 8. వృథాచేయం

కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.



ప్రశ్నలకు జవాబులు చెప్పండి

- బొమ్మ చూడండి. ఏమి జరుగుతున్నదో చెప్పండి.
- పై బొమ్మలోలాగ జరగడం వల్ల ఏమవుతుంది?
- పై బొమ్మలోలాగ జరగకుండా ఉండాలంటే మనం ఏం చేయాలి?

**ఉద్దేశం**

నీరు, విద్యుత్ వృథా, గురించి అవగాహన కలిగించడం, పోస్టరును పరిచయం చేయడం. ఈ పాఠం ఉద్దేశం.



**పిల్లలూ! ఇట్లా చేయండి.**

- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు – అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

**సాధారణంగా డబ్బును పొదుపు చేయాలని మనకు తెలుసు. అట్లే నీటిని పొదుపుగా వాడాలని కూడా తెలుసు. మరి ఇంకా వేటిని పొదుపుగా వాడాలో కూడా తెలుసుకోవాలి.**
**శైలజ, లక్ష్మి, రాధలు మంచి మిత్రులు. వాళ్ళు ఒక మంచి విషయం గురించి మాట్లాడుకున్నారు. దేని గురించి మాట్లాడుకున్నారు? ఏమేం చేయాలనుకున్నారో పాఠం చదువండి. తెలుసుకోండి.**

ఆ రోజు ఆదివారం. శైలజ హడావిడిగా అన్నం తిని ఆటలకు బయల్దేరింది. తోవలో ఆమె చూపు గోడపై అతికించిన పెద్ద కాగితంపై పడింది. ఏమిటిది? అనుకొని, ఆసక్తిగా ఆ కాగితం వైపు అట్లా చూస్తున్నది. ఇంతలోనే శైలజ స్నేహితులు లక్ష్మి, రాధ, సరిత, అనిరుధ్ అక్కడకు వచ్చి "ఏంది గోడవైపు అట్ల గుడ్లప్పగించి చూస్తున్నావు?" అన్నది లక్ష్మి. దానికి శైలజ "గోడమీద అతికించిన ఈ పెద్ద కాగితంలో ఏమున్నదో చూస్తున్నా" అన్నది. అందరు కలసి గోడ దగ్గరికి వెళ్ళి, ఆ కాగితాన్ని చదివారు. అందులో ఈ విధంగా ఉన్నది.

## ఒక్క నిమిషం ఆలోచించండి!

**విద్యుత్తు వినియోగదారులకు విజ్ఞప్తి,**


విద్యుత్తు విలువ మీకు తెలుసు. దాన్ని ఎంత పొదుపుగా వాడుకుంటే అంత మంచిది. లేకపోతే భవిష్యత్తు అంధకారమవుతుంది.

**"నేటి విద్యుత్తు పొదుపు - రేపటి జాతికి వెలుగు"**

రాష్ట్ర విద్యుత్‌శాఖ, తెలంగాణ

**విద్యుత్ పొదుపు చేయడానికి సూచనలు :**

- ఇంట్లో ఉన్నప్పుడు, పగటిపూట బల్బులు వేసుకోకండి.
- సి.యఫ్.యల్ బల్బులను మాత్రమే వాడండి.
- గాలి, వెలుతురు కోసం ఫ్యాను, ఎ.సి., కూలర్లకు బదులు కిటికీలు తెరిచి ఉంచుకోండి.
- ఇంటి నుండి బయటకు వెళ్తున్నప్పుడు విద్యుత్తును నిలిపివేయండి.
- మాటి మాటికీ ఫ్రిజ్‌ను తెరువవద్దు.
- గీజర్ / హీటర్, లిఫ్టులు మొదలగువాటిని తక్కువగ వాడండి.
- ఎలక్ట్రిక్ కుక్కర్, మైక్రోవేవ్ ఓవెన్‌కి బదులు గ్యాస్ పొయ్యిని వాడండి.
- ప్రతిరోజూ కాకుండా కొన్ని రోజులకు అవసరమైన ఆహార పదార్థాలను, దినుసులను రుబ్బి పెట్టుకొండి.
- విద్యుత్‌ను ఆదాచేసే సామర్థ్యమున్న (ఐదు నక్షత్రాలు) ఎలక్ట్రానిక్ పరికరాలను మాత్రమే వాడండి.



SCERT TELANGANA

“ఇందులో విద్యుత్తుకు సంబంధించిన వివరాలు ఉన్నాయి.” విద్యుత్‌ను పొదుపు చేయమని రాసి ఉన్నది” అన్నరు లక్ష్మి, రాధ, అనిరుధ్.

పెద్ద పెద్ద కాగితాలు గోడలకు అతికించి ఉండటం చూస్తూ ఆడుకోవడానికి మైదానం వైపు ఉరికారు.

ఇంతలో నర్మద అక్కడకు రావడం చూసి, పిల్లలందరూ సంతోషంతో “అక్కా!” అని ఆమె చుట్టూ చేరారు.


**నర్మద** : ఏం మాట్లాడుకుంటున్నారు?

**శైలజ** : అక్కా! గోడలపై పెద్ద పెద్ద కాగితాలు అతికించి ఉండటం మేం ఇక్కడికి వస్తుంటే చూశాం. దాని గురించే మేమందరం మాట్లాడుకుంటున్నాం.

**నర్మద** : అదా సంగతి! నేనుగూడ ఇటు దిక్కు వస్తుంటే గోడలపై చూశాను. దాన్ని పెద్ద కాగితం అనగూడదు. ‘పోస్టరు’ అనాలి.

**రాధ** : మరి దాన్ని ఎవరు అక్కడ అతికించారు?

**నర్మద** : విద్యుత్ శాఖవారు అతికించారు. ఇటువంటి పోస్టర్లు మీరు ఇంకా ఏమైన చూశారా?



SCERT TELANGANA

**సరిత** : ఇంతకన్న కొంచెం చిన్న పోస్టరును మన ఊరి జాతరలో చూశాం. ఫిబ్రవరి 4వ తేదీ వసంతపంచమి నాడు అనంతసాగర్‌లో సరస్వతీమాత ఉత్సవం జరుగుతుందని రాసి ఉన్నది.

**నర్మద** : ఇంకా ఎవరైనా ఇటువంటి పోస్టరు చూశారా?

**అనిరుధ్** : సినిమా పోస్టరు చూశాను. దాని మీద హీరో బొమ్మలు, ఇంకా వేరే బొమ్మలు కూడా ఉన్నాయి. సినిమా పేరు, దర్శకునిపేరు, నిర్మాతపేరు, ఇంకా వేరే పేర్లు కూడ రాసి ఉన్నాయి.

**శైలజ** : చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని మన ఊర్లో పోస్టరు అతికించారు.

**లక్ష్మి** : ఈ పోస్టర్లు ఎందుకు అతికిస్తారు?

**నర్మద** : సమాచారం అందరికీ తెలవడం కోసం, ప్రజలను చైతన్య పరచడం కోసం కార్యాలయాల్లో, చౌరస్తాలో, జనసమ్మర్ధంగా ఉండే చోట పోస్టర్లను అతికిస్తారు. ప్రభుత్వ కార్యక్రమాలను గురించి తెలియజేయడానికి, వ్యాపార సంస్థలు తమ సంస్థల గురించి, ఉత్పత్తుల గురించి ప్రచారం చేసుకొనుటకు పోస్టర్లను ముద్రించి గోడలమీద అతికిస్తారు.

**అనిరుధ్** : సర్కస్ గురించి తెలియజేసేవి కూడా అతికిస్తారు గదా!

**నర్మద** : అవును.

**అనిరుధ్** : విద్యుత్ గురించి పోస్టర్‌లో ఏమున్నది అక్కా?

**నర్మద** : కరెంటును తెలుగులో విద్యుత్తు అంటారు. ఫ్రిజ్, ఇస్త్రీపెట్టె, రైస్‌కుక్కర్, మిక్సీ, వాషింగ్‌మెషీన్ మొదలైనవి విద్యుత్తుతో పని చేస్తాయి. పంటచేలలో బోర్‌మోటార్లు పని చేస్తుంటాయి. ఎలక్ట్రిక్ రైలు నడవడానికి విద్యుత్తు అవసరం. కాబట్టి విద్యుత్తును పొదుపు చేయాలని పోస్టరు ద్వారా ప్రచారం చేస్తున్నారు. అందరికీ తెలిసేటట్టు చేస్తున్నారు.

**రాధ** : ఇన్ని అవసరాలుండగా విద్యుత్ సరఫరాను రోజులో ఎక్కువసార్లు ఎందుకు నిలిపివేస్తున్నారు?

**నర్మద** : జలాశయాల్లో నీళ్ళు అడుగంటడం, బొగ్గునిల్వలు తగ్గిపోవడం దీనికి కారణం. అందుకని విద్యుత్తుకోత తప్పనిసరి అయ్యింది.

SCERT TELANGANA

**అనిరుధ్ :** విద్యుత్తు కోతకు నీళ్ళకు సంబంధం ఏందక్కా?

**నర్మద :** విద్యుత్తు ఉత్పత్తికి నీటిని వినియోగిస్తరు. వానలు లేక జలాశయాల్లో చాలినంత నీరులేక విద్యుత్తు మన అవసరాలకు తగినంత తయారవడం లేదు.

**శైలజ :** అయితే బొగ్గుకు, విద్యుత్తుకు ఉన్న సంబంధం గురించి గూడా చెప్పు అక్కా!

**నర్మద :** మన తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి బొగ్గుతోనే జరుగుతున్నది. కొత్తగూడెం, రామగుండంలలో థర్మల్ పవర్ స్టేషన్లు ఉన్నాయి. విద్యుత్ తయారీ అధిక ఖర్చుతో కూడుకున్నది. అందుకొరకు మనం విద్యుత్తును ఆదా చేయాలి. పొదుపుగా వాడితే దానిని ఉత్పత్తి చేసినట్టే లెక్క.

**సరిత :** ఆదా చేయటమా? అంటే?

**నర్మద :** మన ఇంటిలో అవసరంలేకున్నా ఫ్యాన్ వేయడం, ఫ్రిజ్ తలుపు మాటి మాటికి తీయడం, ఇంట్లో ఎక్కువ బల్బులు వాడడం, పగటిపూట గూడ లైట్లు వెలిగించడం మొదలైన వాటితో విద్యుత్తును వృథా చేస్తున్నం. ఇవన్నీ తగ్గిస్తే విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నట్లే. అందుకని విద్యుత్తును వినియోగించేముందు ఒక్క నిమిషం ఆలోచించాలి.

**పిల్లలందరూ :** సరే అక్కా! 'ఈ రోజు నుంచి మేమంతా మా ఇండ్లలో విద్యుత్తును వృథా చేయం' అని ప్రతిజ్ఞ చేస్తున్నాం.

అని పిల్లలందరూ నర్మద అక్క దగ్గర నుంచి వెళ్ళి ఆటల్లో మునిగిపోయారు.

## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) ఈ పాఠం ద్వారా ఏమేమి, ఎందుకు వృథా చేయకూడదని తెలుసుకున్నారో చెప్పండి.

(ఆ) మీ ఇంట్లో వేటికోసం విద్యుత్తును వాడుతున్నారు? వీటిలో దేనికి ఎక్కువ విద్యుత్తు అవసరమవుతున్నది?

(ఇ) మీ గ్రామంలో / వీధిలో విద్యుత్తును అవసరం మేరకే వినియోగిస్తున్నారా? లేక వృథా చేస్తున్నారా? ఎట్లాగో తెలుపండి.

SCERT TELANGANA

## II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



### (అ) కింది పోస్టరును చదువండి. జవాబులు చెప్పండి. రాయండి.

**గ్రామ ప్రజలారా! జాగ్రత్త పడండి! నీటిని పొదుపుగా వాడండి!**

**గ్రామ ప్రజలకు విజ్ఞప్తి**

**నీటి వృథాను అరికట్టండి.**

- నీరు మనకు ప్రాణాధారం.
- ప్రతి నీటి చుక్క విలువైనదే!
- నీటిని పొదుపుగా వాడుకుందాం!
- మనం అవసరం మేరకు మాత్రమే నీటిని వినియోగిద్దాం!
- నీరు ఎక్కడైనా పంపులు నల్లాలలో వృథా అవుతుంటే వెంటనే మునిసిపాలిటీ / పంచాయితీ వారికి తెలియజేయండి.
- నల్లాను వదిలేసి పనులు చేయకండి. బకెట్‌లో పట్టుకొని నీటిని వాడండి.
- వాడుకొన్న నీటిని మొక్కలకు మళ్ళించండి.
- వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడుగుంత ద్వారా భూగర్భజలాలను వృద్ధి పరుద్దాం.

గ్రామ పంచాయతీ,
జముదాపురం

(1) పోస్టరు దేన్ని గురించి తెలియజేస్తున్నది?

______________________________

______________________________

(2) పోస్టరును ఎందుకోసం అతికించారు?

______________________________

(3) పోస్టరు ద్వారా నీవు తెలుసుకున్న మూడు ముఖ్యమైన విషయాలు ఏవి?

______________________________

______________________________

______________________________

SCERT TELANGANA

(ఆ) పాఠంలోని పోస్టరును చదువండి. దాని ఆధారంగా మీ ఇంట్లో ఏమేమి అమలు చేస్తున్నారు? ఏమేమి అమలు చేయడంలేదో రాయండి.

| అమలు చేసేవి | అమలు చేయనివి |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) "విద్యుత్తును పొదుపు చేస్తే, దాన్ని ఉత్పత్తి చేసినట్టే" దీన్ని సమర్థిస్తూ నాలుగు వాక్యాలు రాయండి.

(ఆ) విద్యుత్తును పొదుపుగా వాడాలని తెలుసుకున్నారు కదా! ఇంకా వేటిని, ఎందుకు పొదుపు చేయాలో రాయండి.

(ఇ) 'పోస్టరు'ను ఎందుకు వాడుతారు? విద్యార్థులుగా మీరు ఏఏ విషయాలు ఇతరులకు తెలుపడానికి పోస్టరును తయారుచేయాలనుకుంటున్నారో రాయండి.

## IV. పదజాలం



(అ) విద్యుత్తుతో పనిచేసే కొన్ని వస్తువుల పేర్లు రాయండి.

________ ________ ________ ________ ________

________ ________ ________ ________ ________

(ఆ) కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.

(1) పొదుపు : ________________

(2) జాతర : ________________

(3) పోస్టరు : ________________

(4) ఉత్పత్తి : ________________

SCERT TELANGANA

### (ఇ) కింది వాక్యాలను ఒకే పదంతో సూచించండి.

(1) వృథా చేయకుండుట. ______________________

(2) సమాచారాన్ని పెద్ద కాగితం మీద ప్రదర్శించేది. ______________________

(3) పిల్లలు ఆటలాడుకునే స్థలం. ______________________

(4) దేవాలయం దగ్గర ప్రతి ఏటా జరిపే ఉత్సవం. ______________________

(5) ఎక్కువ నీరు నిలువ ఉండే చోటు. ______________________

## V. సృజనాత్మకత / ప్రశంస



### (అ) విద్యుత్తు శాఖ వాళ్ళ పోస్టరు చూశారు కదా! అట్లాగే మీ గ్రామంలో మొక్కలు నాటాలని సూచించేలా ఒక పోస్టరును తయారుచేయండి. ప్రదర్శించండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



### (అ) కింది వాక్యాలను చదువండి. క్రియాపదాల కింద గీత గీయండి.

(1) పిల్లలు చెట్టు కింద ఆడుకొంటున్నారు.

(2) వెంకటయ్య నిద్రపోతున్నాడు.

(3) పోతన గొప్పకవి.

(4) కుంటాల జలపాతం అందమైనది.

1, 2 వాక్యాలకు, 3, 4 వాక్యాలకు గల భేదమేమి? 3, 4 వాక్యాలలో క్రియాపదం లేకపోయినా పూర్తి అర్థాన్ని ఇస్తున్నాయి కదా! ఇలాంటి వాటిని 'క్రియరహిత' వాక్యాలు అంటారు.

మరికొన్ని క్రియరహిత వాక్యాలు రాయండి.

ఉదా: సీతయ్య అమాయకుడు, మా ఊరు రామాపురం.

______________________

______________________



SCERT TELANGANA

**(ఆ) కింది వాక్యాలు చదువండి.**

ఉదా: సైనికులు యుద్ధంలో పాల్గొన్నారు. <u>వీర</u> సైనికులు యుద్ధంలో పాల్గొన్నారు.

రెండవ వాక్యంలో 'సైనికులు' ముందు 'వీర' అనే పదం ఉంది కదా! ఇది 'కర్త' గురించి తెలిపే విశేషణ పదం. అలాగే కింది వాక్యాలు చదువండి. కర్తకు ముందు విశేషణ పదాలు చేర్చి రాయండి.

(1) నక్క సింహం దగ్గరకు వెళ్ళింది.

____________________________

(2) మల్లెలు తోటలో విరబూశాయి.

____________________________

(3) వెన్నెల ఆకాశం నిండా పరుచుకున్నది.

____________________________

**ప్రాజెక్టు పని**



**మీ గ్రామంలో ఏ ఏ అంశాల మీద పోస్టర్లు వేశారో అవి వేటికి సంబంధించినవో వాటిలోని వివరాలు రాయండి. తరగతిలో చెప్పండి.**

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | విద్యుత్ వినియోగం, పొదుపు గురించి సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| 2. | నీటి వృథాపై పోస్టరు ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 3. | విద్యుత్తు వినియోగం, పొదుపును సమర్థిస్తూ సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. | మొక్కలు నాటడంపై పోస్టరును తయారుచేసి ప్రదర్శించగలను. | అవును / కాదు |




వృథా చేయకపోవడమంటే
సంపాదించడమే.

SCERT TELANGANA

# చదువు - ఆనందించు

## క్రిస్మస్

ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న పండుగలలో క్రిస్మస్ పండుగ ఒకటి. ఈ పండుగ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ. ఇది ప్రతి సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన జరుపుకుంటారు. ఈ పండుగను క్రిస్మస్ ఈవ్, క్రిస్మస్, బాక్సింగ్ దినం అనే మూడు రోజులుగా జరుపుకుంటారు. ఇవి ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో 24, 25, 26 తేదీలనాడు వస్తాయి.

సంప్రదాయ కథనాల ప్రకారం జీసస్ ఒక పశువులశాలలో, పశువుల మధ్య పుట్టాడని, జన్మించగానే ఆయన తల్లి మేరీ మాత ఆయనను వస్త్రాలతో చుట్టి వారున్న ధర్మశాలలో ఖాళీ లేనందున పశువుల కొట్టంలోనే ఉంచవలసి వచ్చిందని 'బైబిలు' చెబుతున్నది. ఆయన పుట్టిన రోజు రాత్రి ఆ ఊరికి పక్కనున్న పొలాల్లో కొందరు పశువుల కాపర్లు తమ గొర్రెల మందలను కాపలా కాస్తున్నారు. అప్పుడు ఒక దేవదూత ఆకాశం నుంచి వారి ముందుకు దిగి వచ్చాడు. ఆ దూత చుట్టూ ఉన్న వెలుగుకు గొర్రెల కాపరులు భయపడ్డారు. దేవదూత వాళ్ళతో "భయపడకండి ఇదిగో! మీకొక సంతోషకరమైన శుభవార్త. ఇవ్వాళ బెత్లహేంలోని ఒక పశువుల పాకలో లోకరక్షకుడు పుట్టాడు. ఆయన అందరికీ ప్రభువు. ఒక పసికందు పొత్తిగుడ్డలో చుట్టబడి పశువులశాలలో ఉన్న దాణాతొట్టెలో పడుకుని ఉంటాడు. ఇదే మీకు ఆనవాలు". దేవదూత ఇలా చెబుతుండగా పొలమంతా దేవదూతలతో నిండిపోయింది. వాళ్ళంతా దేవునికి స్తుతి గీతాలు పాడి మాయమయ్యారు. గొర్రెల కాపరులు హుటాహుటిన వెళ్ళి దేవదూత చెప్పిన పశువుల పాకకు చేరుకున్నారు. అక్కడ తొట్టెలో పడుకుని ఉన్న శిశువును చూశారు.

అలా 2000 సంవత్సరాల కిందట డిసెంబర్ 24వ తేదీ అర్ధరాత్రి ఏసుక్రీస్తు జన్మించాడు. అందుచేత ఆ మరునాడు అంటే డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ పండుగని జరుపుకుంటున్నారు.

ఈ పండుగకు క్రైస్తవులు తమ ఇళ్ళను, చర్చిలను అలంకరిస్తారు. వెదురుబద్దలతో, రంగు కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటికప్పు మీద ఎత్తులో పెడుతారు. రాత్రివేళ దీపాలంకరణలతో ఇళ్ళు, చర్చీలు అందంగా ఉంటాయి. ప్రతిఇంట్లోనూ ఒక క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేస్తారు. ఇది ఈ పండుగ ప్రత్యేకత. ఈ చెట్టును రంగురంగుల కాగితాలతోనూ, కాగితపు నక్షత్రాలతోనూ, చిరుగంటలతోనూ, చిన్నచిన్న గాజు గోళాలతోనూ అలంకరిస్తారు. మరొక విశేషం ఉన్నది. క్రిస్మస్ కిందటి రాత్రి శాంతాక్లాజ్ (ఫాదర్ క్రిస్మస్) ఆకాశం నుండి ధ్రువపు జింకలు లాగే బండిలో వచ్చి పిల్లలకు బహుమతులు ఇస్తాడని నమ్ముతారు. క్రిస్మస్ రోజున బంధువుల ఇళ్ళకు, మిత్రుల ఇళ్ళకు వెళ్ళి ప్రేమాభిమానాలతో క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ పండుగను అందరు ఆనందందోత్సాహాలతో జరుపుకోవాలని రెండు రోజులు సెలవులు మంజూరు చేసింది.

SCERT TELANGANA

# 9. గోపి డప్పు

**కింది బొమ్మను చూడండి. ఆలోచించి మాట్లాడండి.**



### ప్రశ్నలకు జవాబులు చెప్పండి

- బొమ్మలో ఏమేమి అమ్ముతున్నారు? వాటిలో మీకు తెల్సినవి ఏవి?
- బొమ్మలోని పిల్లలు పీకలు అమ్మేవానితో ఏం మాట్లాడుతున్నారు?
- బొమ్మలో కనపడుతున్న వస్తువులలో నీ కిష్టమైనది ఏది? ఎందుకు?

### ఉద్దేశం

మనం ఇతరులకు చేతనైన సహాయం చేస్తే మనకు కూడా మేలు జరుగుతుంది. దీనివల్ల అసలైన ఆనందం కలుగుతుంది అని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

### పిల్లలూ! ఇట్లా చేయండి.




- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు – అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

“పేదలకు, నిస్సహాయులకు సహాయం చేయడం వల్లనే కర్రచక్రం నాకు ఇష్టమైన దప్పుగా మారింది.” ఇట్లా ఎవరు అనుకున్నారు? ఎందుకు? కథ చదివి తెలుసుకొండి.



రామాపురం గ్రామంలో గోపి అనే పిల్లవాడుండేవాడు. అతడు వాళ్ళ నాయనమ్మతో పాటు ఉండేవాడు. గోపి వాళ్ళ నాయనమ్మ ఎంతో కష్టపడి బతుకు వెళ్ళదీసేది.

ఒకరోజు నాయనమ్మ గోపితో “ఒరే పిల్లగా! నేను కట్టెలు అమ్మడానికి అంగడికి పోతున్నా. వచ్చేటప్పుడు నీకేమైనా తేవాల్నా” అన్నది.

గోపి నాయనమ్మతో... “నాకేమి వద్దుగానీ బజారులో దప్పు దొరికితే తీసుకురావా? దప్పు వాయించడమంటే నాకు చాలా ఇష్టం. దానితో ఆడుకుంట” అన్నాడు. నాయనమ్మ ‘సరే’ అన్నది.

అంగడిలో కట్టెలు అమ్మినంక నాయనమ్మ ఒక బొమ్మల దుకాణంలోనికి పోయి “సేటూ! ఈ దప్పు ధర ఎంత?” అని అడిగింది. “ఇరవై రెండు రూపాయలు” అన్నాడు దుకాణదారు. కాని నాయనమ్మ దగ్గర పదిహేను రూపాయలే ఉన్నాయి. “అయ్యో! మనుమని కోసం దప్పు కూడా కొనలేకపోతినే” అనుకుంట నిరాశగా ఇంటికి బయలుదేరింది.



తోవలో ఆమెకు ఒక గుండ్రని కర్ర చక్రం కనిపించింది. “పోనీ దీన్నైనా తీసుకపోతా. నా మనుమడు ఆడుకుంటడు” అని ఆ చక్రాన్ని సంచిలో వేసుకుని ఇంటికి తీసుకపోయింది.

గోపి ఉరుక్కుంట వచ్చి నాయనమ్మను చుట్టేశాడు. “నాయినమ్మా దప్పు తెచ్చినవా?” అని అడిగాడు. “దప్పు మరెప్పుడైనా తెస్త... ఈ చక్రంతో ఆడుకో” అని కర్ర చక్రాన్ని తీసి గోపీకి ఇచ్చింది.




గోపి ఏమీ మాట్లాడకుండా కఱ్ఱ చక్రాన్ని తీసుకొని దాన్ని దొర్లించుకుంటా ఊరిలో తిరుగసాగాడు.

చక్రంతో ఆడుకుంటా పోతుంటే గోపీకి ఒకచోట ఒక ముసలమ్మ పొయ్యి ముందర కూర్చొని ఏడవడం కనిపించింది. ఆమె దగ్గరగా వెళ్ళి "అవ్వా ఎందుకేడుస్తున్నవ్?" అని అడిగాడు. "బాగా ఆకలిగా ఉన్నది. ఇంట్లో పిండి ఉన్నది గానీ పొయ్యి వెలిగించడానికి కట్టెలు లేవు. రొట్టెలు ఎట్లా చేసుకోవాలెనో తెలుస్తలేదు" అన్నది.

"అవ్వా! ఏడువకు. నా దగ్గర కఱ్ఱచక్రం ఉన్నది. దీంతో పొయ్యి వెలిగించుకొని నీ ఆకలి తీర్చుకో" అని చక్రాన్ని ఆమెకు ఇచ్చిండు.

ముసలమ్మ గోపి జాలి గుణానికి సంతోషించింది. ఆ కట్టెతో పొయ్యి వెలిగించి, రొట్టెలు చేసుకున్నది. "ఒరే పిల్లగా! నువ్వెంతో మంచోడివి. నా ఆకలి తీర్చినవు. నీకివ్వడానికి నా దగ్గర ఏమీ లేదు. ఇదిగో ఈ రొట్టె తీసుకో. ఆకలైనప్పుడు తిను" అని ఒక రొట్టె ఇచ్చింది.



గోపి రొట్టెను కాగితంలో చుట్టుకుని ముందుకు పోయాడు. కొంతదూరం పోగానే కుండలు చేసే కనకయ్య కూతురు సరిత వాళ్ళమ్మ ఒడిలో కూచుని ఏడుస్తూ కనిపించింది. "చిన్నమ్మా! మీ అమ్మాయి ఎందుకేడుస్తున్నది"? అని అడిగాడు గోపి.

"ఆకలికి ఏడుస్తున్నది" అన్నది బాధగా. "చిన్నమ్మా! ఈ రొట్టెను తీసుకో" అని తన చేతిలోని రొట్టెను ఆమెకిచ్చాడు. పాప ఆకలి తీరి నవ్వసాగింది.

SCERT TELANGANA

“బిడ్డా! ... నువ్వు ఎంతో మంచోడివి. నా బిడ్డ ఆకలి తీర్చినవు. నీకివ్వడానికి నా దగ్గర ఈ మట్టిపాత్ర తప్ప ఏమీ లేదు” అని గోపీకి మట్టిపాత్ర ఇచ్చింది.

గోపి మట్టిపాత్రను తీసుకొని కొంతదూరం పోయాక బట్టలు ఉతికే రాజయ్య కనిపించాడు. రాజయ్య కొడుకు కుండను పగుల గొట్టాడు. దాంతో రాజయ్య కొడుకును మందలిస్తున్నాడు. రాజయ్య కొడుకు ఏడుస్తున్నాడు.





“చిన్నాన్నా!... అతన్ని ఏమీ అనకు. ఇదిగో ఈ మట్టిపాత్ర తీసుకో” అని మట్టిపాత్ర ఇచ్చాడు. దాంతో రాజయ్య “బాబూ!... నువ్వెంతో మంచోడివి” అని చెప్పి మట్టిపాత్రకు బదులుగా లోపలి నుండి పాత గొంగడి తెచ్చి గోపీకి ఇచ్చాడు.

గోపి గొంగడి భుజాన వేసుకుని నది దగ్గరకు పోయాడు. అక్కడ ఒక వ్యక్తి ఒంటిమీద సరైన బట్టలు లేకుండా చలికి గజగజ వణుకుతూ నిలబడి ఉన్నాడు. అతని పక్కనే ఒక గుర్రం ఉన్నది.

గోపి ఉరుక్కుంటూ పోయి గొంగడి అతనికిచ్చి కప్పుకోమన్నాడు. ఆ వ్యక్తి గొంగడి కప్పుకొని అందులో ముడుచుకు పోయాడు. అతని చలి తగ్గింది. అప్పుడతను “నేనొక వ్యాపారిని. పట్నంలో వ్యాపారం చూసుకుని వస్తుంటే దొంగలు దాడిచేసి నా డబ్బు, నగలతో పాటు ఒంటిమీద బట్టలు కూడా

దోచుకుపోయారు. నాకు గొంగడి ఇచ్చి ప్రాణం కాపాడావు. నీకివ్వడానికి నా దగ్గర ఈ గుర్రం తప్ప మరేమీ లేదు" అని గుర్రాన్ని గోపీకి ఇచ్చాడు. గోపి గుర్రం కళ్ళేన్ని చేత్తో పట్టుకుని అలా నడుచుకుంటూ పట్నంలోకి ప్రవేశించాడు.

పట్నంలో అతనికో ఊరేగింపు కనిపించింది. కానీ ఆ ఊరేగింపు ముందుకు కదలడం లేదు. అందరూ నిశ్శబ్దంగా నిలబడి ఉన్నారు. అది చాలా పెద్ద ఊరేగింపు. అక్కడి బ్యాండుమేళం వాళ్ళ దగ్గర సన్నాయి, డోలు, డప్పు ఇట్లా రకరకాల వాద్యాలున్నాయి. ఊరేగింపు ఎందుకు ఆగిపోయిందని అడిగాడు గోపి.

"ఈ రోజు నా కొడుకు లగ్గం. ముహూర్తం సమయం దాటిపోతున్నది. కానీ మేము మాట్లాడుకున్న గుర్రం ఇంకా రాలేదు" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అయ్యో తాతా! ... దీనికి మీరింత బాధపడాలా? నా దగ్గర గుర్రం ఉన్నది. దాన్ని తీసుకుని ఊరేగింపు ప్రారంభించండి" అని గుర్రాన్ని తీసుకువచ్చి ఇచ్చాడు. ఊరేగింపు మొదలైంది. పెండ్లి ఘనంగా జరిగింది.



"నాయనా! నువ్వు చాలా మంచోడివి. నేనీ ఊరిలో ధనవంతుడైన షావుకారును. నీ గుర్రానికి ఎన్ని రూపాయలు కావాలో అడుగు" అన్నాడు షావుకారు.

గోపి "తాతా! నాకు డబ్బులు వద్దు. ఆ బ్యాండుమేళంలోని డప్పు కావాలి. డప్పంటే నాకు చాలా ఇష్టం" అన్నాడు గోపి.

షావుకారు ఎంతో సంతోషించి ఆ డప్పుతోపాటు పైసలు కూడా ఇచ్చాడు. పైసల సంచీని భుజాన వేలాడేసుకుని, డప్పు కొట్టుకుంటూ ఇంటికి పోయాడు గోపి.

"ఇంటినుండి బయలుదేరేటప్పుడు నా దగ్గర ఒక చక్రం ఉండె కానీ ఇతరులకు సాయం చేయడం వల్లనే కర్రచక్రం నాకు ఇష్టమైన డప్పుగా మారింది" అని అనుకున్నాడు.

SCERT TELANGANA

# ఇవి చేయండి

## I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) గోపి దప్పు కథను మీ సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) మీరు చూసిన ఏదైనా పెళ్ళి ఊరేగింపు గురించి వర్ణించి చెప్పండి.

## II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం




(అ) పాఠం చదువండి. పాఠం ఆధారంగా గోపి ఎవరెవరికి, ఏమేమి ఇచ్చాడు? ఏమేమి తీసుకున్నాడో రాయండి.

| ఎవరికి ఇచ్చాడు? | ఏమిచ్చాడు? | ఏం తీసుకున్నాడు? |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

(ఆ) పాఠం చదువండి. గోపి అడిగిన ప్రశ్నలు రాయండి.

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) గోపీని అందరూ మంచివాడని పొగిడారు కదా! మరి మిమ్మల్ని మంచివాళ్ళని ఇతరులు అనాలంటే మీలో ఏ ఏ మంచిగుణాలు ఉండాలి?

(ఆ) గోపి గురించి ఐదు వాక్యాలు రాయండి.

SCERT TELANGANA

## IV. పదజాలం



(అ) పాఠంలో 'మట్టిపాత్ర', 'కర్రచక్రం' అనే పదాలున్నాయి కదా! వాటిలో రెండేసి పదాలున్నాయి. రెండో పదం వస్తువు అయితే, మొదటిపదం ఆ వస్తువు దేనితో తయారైందో చెబుతుంది. అలాంటి పదాలు రాయండి.

**ఉదా:** బట్టసంచి, ________________, ________________, ________________

(ఆ) కింది వాక్యాలలో గీతగీసిన పదాల స్థానంలో అదే అర్థాన్నిచ్చే మరో పదాన్ని చేర్చి వాక్యాన్ని తిరిగి రాయండి.

**ఉదా:** పొయ్యి వెలిగించడానికి కట్టెలు లేవు : పొయ్యి మండించడానికి కట్టెలు లేవు.

(1) నా బిడ్డ ఆకలి తీర్చావు.

________________________________________

(2) గోపి పరుగెత్తుకొని వచ్చి నాయనమ్మను చుట్టేశాడు.

________________________________________

(3) ఒంటి మీది బట్టలు కూడా దోచుకపోయారు.

________________________________________

(4) ముహూర్తం సమయం దాటిపోతున్నది.

________________________________________

(5) దప్పు కొట్టుకుంటూ ఇంటికి బయలుదేరాడు.

________________________________________

(ఇ) కింది పదంలోని గీతగీసిన పదం (అంత్యపదం) వచ్చేలా ఇంకొన్ని పదాలు రాయండి.

ఉదా: రామాపురం

కాపురం ____________ ____________ ____________

____________ ____________ ____________ ____________

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) గోపి ఒక వస్తువును ఇచ్చి, దాని బదులు మరో వస్తువును పొందాడు కదా! దానిని గేయం రూపంలో రాసి, పాడండి.

ఉదా: చక్రం పోయి రొట్టె వచ్చె టాం టాం టాం

SCERT TELANGANA

## VI. భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలను చదువండి. గీత గీసిన అక్షరాలను, పదాలను గుర్తించండి.**

(1) పాలు, సేమ్యాతో పాయసం చేస్తారు.

(2) జయ కోసం రామన్న బొమ్మలు తెచ్చాడు.

(3) శివ గురించి వాళ్ళ అమ్మ బడికి వెళ్ళింది.

(4) సుస్మితకు ప్రజ్ఞ చాకెట్లు ఇచ్చింది.

(5) హనుమంతుడు రాముని యొక్క దూతగా లంకకు వెళ్ళాడు.

పై వాక్యాలలో గీత గీసిన అక్షరాలను, పదాలను గమనించారు కదా! ఇవి లేకుంటే వాక్యాలు పూర్తి అర్థాన్ని ఇవ్వడం లేదు కదా! అంటే ఇవి వాక్యంలో పదాల మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తున్నాయి. ఇలాంటి అక్షరాలను, పదాలను **'విభక్తి ప్రత్యయాలు'** అంటారు.

**(ఆ) కింది వాక్యాలు చదువండి. విభక్తి ప్రత్యయాల కింద గీత గీయండి.**

(1) నిఖిల్ వాళ్ళ పెద్దమ్మతో ఊరికి పోయాడు.

(2) తొలికోడి కూతతో మేల్కొంటారు.

(3) మహిళలను పేరంటానికి పిలిచి తాంబూలాలు ఇస్తారు.

(4) ముగ్గులలో గొబ్బిళ్ళు పెడుతారు.

**ప్రాజెక్టు పని**



రకరకాల సంగీత వాద్యాల బొమ్మలను సేకరించండి. మీకు నచ్చిన ఒక వాద్యపరికరం గురించి వివరాలు రాయండి. తరగతి గదిలో ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా?



| | |
|---|---|
| 1. గోపి డప్పు కథను సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| 2. పాఠం ఆధారంగా గోపి ఎవరికి ఏం ఇచ్చాడు, ఏం తీసుకున్నాడో గుర్తించి పట్టికలో రాయగలను. | అవును / కాదు |
| 3. గోపి గురించి సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 4. గోపి ఇచ్చిపుచ్చుకున్న వస్తువులను సూచించేలా చిన్న గేయం రాయగలను. | అవును / కాదు |







పరోపకారాన్ని మించిన గుణం లేదు.

SCERT TELANGANA

# 10. చింతచెట్టు

**కింది బొమ్మ చూడండి. ఆలోచించి మాట్లాడండి.**



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- బొమ్మలో ఏమేం కనబడుతున్నాయి?
- బొమ్మలో ఎవరెవరు ఏమేం చేస్తున్నారు?
- బొమ్మ ఆధారంగా చెట్టు ఎవరెవరికి ఏ విధంగా ఉపయోగపడుతున్నదో చెప్పండి.

**ఉద్దేశం**

చెట్లతో మనకు అవినాభావ సంబంధం ఉన్నది. చెట్లు, ఆకులు, పూలు, కాయలు మొదలుకొని కాండం వరకు అనేక రకాలుగా ఉపయోగపడుతున్నాయి. అటువంటి వాటిలో ఒకటైన చింతచెట్టు గురించి తెలియజేస్తూ చెట్లను పెంచితే అవి మనలను కాపాడుతాయని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.




**పిల్లలూ! ఇట్లా చేయండి.**

- పాఠంలోని బొమ్మలు చూడండి. బొమ్మల గురించి మాట్లాడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను లేదా ఉపాధ్యాయులను అడిగి లేదా 'పదాలు - అర్థాలు' అనే పట్టికలో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22




తెలంగాణ ప్రాంతంలో మర్రి, రావి, వేప, చింత, మామిడి, మేడి, జువ్వి మొదలైన పెద్ద పెద్ద చెట్లు అనేకం కనిపిస్తాయి. వాటిలో చింతచెట్టుతో మనకున్న సంబంధం, దాని ఉపయోగాలు, గొప్పదనం గురించి పాఠం చదివి తెలుసుకొండి.

అరెరే... పిల్లలూ...! ఈడికి రండి...! నా కాడికి రండి. బాగా ఆటలాడి అలసిపోయినట్లున్నరు. నా నీడకు రండి. క్షణంల అలసట మాయమైపోతది. నేను గుబురుగ ఛత్రి లెక్క ఉన్న, నా నీడ సల్లగ చిక్కగ ఉంటది. నాలుగు చింతకాయలు తెంపుకుని తినుకుంట నా మాటలు ఇనుకొంట కూసోండి. నా గురించి మీ పెద్దోళ్ళకు బాగ తెలుసు. మీకు కూడ ఎరుక గావాలని చెప్తున్న.

SCERT TELANGANA

ఆట పాటలంటె మీకెంతో ఇష్టం కదా! నా కొమ్మలకు తాళ్ళను కట్టి ఉయ్యాలలూగుతుంటె ఎంత సంబురం! చెప్పనీకె మాటలు చాలవు. ఊగి చూడండి. మీకు తెలుస్తది. తాళ్ళు తేలేదని బాధపడకండి. నా కొమ్మలను పట్టుకొని ఊగొచ్చు, కొమ్మలిరిగి కింద పడ్తమని భయపడొద్దు. నేను గట్టిదాన్ని. కొమ్మలమీద 'కోతికొమ్మచ్చి' గూడ ఆడుతరు. ఈ ఆటలో ఎంతమజా! నా మానుకున్న తొర్రలోకి తొంగి చూడండొకసారి. దాగుడు మూతలు ఆడేటప్పుడు దీంట్లో దాక్కునేటోళ్ళు.


నా గింజలను పగులగొట్టి చిత్తుబొత్తు ఆట ఆడుతరు. పందెంవేసుటకు గవ్వలకు బదులు నా గింజలను వాడుతరు. అష్టచెమ్మ, పులిజూదం, వామనగుంటలు, పచ్చీసు... ఇట్లాంటి ఆటలు ఆడాలంటే నేనుండాల్సిందే. ఇవన్నీ తెలివిని పెంచే ఆటలు, కొత్తాటలొచ్చినంక ఇవన్నీ ఎనుకకు బోయినయి. ఎనుకటికి లెక్కలు నేర్పేటందుకు నా గింజలనే వాడేవాళ్ళు. ఇంతకు నా గింజ ముట్టి చూశారా? ఎంత గట్టిగుంటదో! అందుకే ఎవరైనా దిట్టంగా ఉండేవాడిని "చింతగింజ" లెక్క వున్నడంటరు. నేను ఎక్కడైనా దొరుకుత. అందుకే ఎవరైనా పైసలను విచ్చలవిడిగా ఖర్చుచేస్తుంటే పైసలను "చింతగింజలోలె ఖర్చుపెడుతున్నడంటరు." కాని నా గింజలంత లెక్కలేనివేం గాదు. నా గింజలపైన బొమ్మలు గీస్తరు. పై పొట్టుతీసి లోపలి తెల్లభాగాన్ని అందమైన శిల్పంగా చెక్కే కళాకారులు ఉన్నరు. నా విలువ వారికి తెలుసు.



ఇక తిండి విషయం చెప్పుకొందాం. నా చిగురు, పూత, కాయ, పండుతో ఎన్నో వంటకాలు తయారు చేస్తరు. నేను లేకుంటే ముద్ద లోపలికి దిగుతదా? నేనెప్పుడూ రికామిగ ఉండను. మొదట చిగురిస్త. తరువాత పూత. ఆ తరువాత కాయ. ఆపై పండు. మళ్లీ చిగురు... ఇట్ల నాకు తీరికే ఉండదు. సోమరితనమంటే నాకస్సలు పడదు. అది మంచిది కాదు. ఎప్పుడూ ఏదో పనిలో మునిగిపోయే వాడిని గురించి వీనికి "చింతచెట్టంత తీరిక" అంటరు.

SCERT TELANGANA

నా చిగురు, పూతతోని పప్పు, తొక్కు చేసుకుంటరు. ఇగ చింతకాయ... అంటుంటెనే నోట్ల నీళ్ళూరుతున్నయి కదా! చింతకాయంటె మీకు బాగా ఇష్టమని నాకు తెలుసు. బడికి పోయేటప్పుడు చింతకాయలను, ఉప్పును బ్యాగుల దాచిపెట్టుకోవడం నాకు తెలువదనుకున్నరా! ఒకప్పుడు ఎవరన్న తప్పుజేస్తె కొట్టనీకి నా బరిగెనే వాడేటోల్లు. మీ పెద్దలు చింతకాయ అంబలి జేసేటోల్లు. గొంగళ్లు తయారుచేసేటప్పుడు ఈ అంబలిని వాడుతరు. మిరపకాయ నాకు మంచి దోస్తు. నన్ను, పండు మిరపకాయను కలిపి తొక్కులు చేస్తరు. చింతకాయ తొక్కును ఏడాది పొడుగునా నిల్వజేసుకొని తింటరు. పాత చింతకాయ తొక్కు పథ్యానికి మంచిది. బలమైనది కూడ. అందుకే "చింతకాయ తొక్కు – దేవునికి మొక్కు" అన్నరు పెద్దోల్లు. ఈ రెండూ మనల్ని కాపాడుతయని వాళ్ల ఆలోచన. జరమొచ్చి తగ్గినంక నాలికె రుచి తప్పుతది. అప్పుడు పాత చింతకాయ తొక్కు నాలికెకు తగిలితె స్వర్గం కనిపిస్తది.



ఇగ నా పండు. "చింతపండు". పప్పు, తొక్కు, పచ్చిపులుసు, పప్పుచారు, పులిహోర జేయుడానికి నేను కావలసిందే. పచ్చిపులుసు పేదోళ్ళ అమృతం. ఎంత రుచిగుంటది, చింతపండు పులిహోర అంటెనే నోరూరుతది. గుడిల ప్రసాదం గుర్తొస్తుంది కదా! ఉగాది పచ్చడి నేను లేకుండ తయారైతదా! ఇత్తడి, రాగి పాత్రలను, పంచలోహ విగ్రహాలను పాతచింతపండుతో తోమితే తళతళ మెరుస్తయి. నాతోని ఇన్ని ఉపయోగాలున్నయి. కాబట్టి నన్ను బాయిల పొంటి, బాటల పొంటి, పొలాలల్ల, ఇండ్లకాడ ముచ్చటగ పెంచుకుంటరు. దేవాలయాల పక్కన, జాతర్లు జరిగేచోట గుంపులు గుంపులుగ పెంచుతరు. దీనివల్ల నీడకు నీడ, చల్లదనానికి చల్లదనం. ఇసొంటి చింతచెట్ల గుంపును 'చింతతోపు' అంటరు. హైదరాబాద్‌లోని పెద్ద బస్టాండ్ కట్టింది ఈ చింతతోపులోనే. అందుకే దీనికి "ఇమ్లీబన్ బస్టాండ్" అని పేరు. "ఇమ్లీ" అంటే చింతకాయ "బన్" అంటే వనం.

SCERT TELANGANA

ఇంకో ముచ్చట

హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖాన ఆవరణలో 1908 సం॥లో మూసీనదికి వరదలొచ్చినప్పుడు దాదాపు 150 మంది దాకా నా మీద ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నరు. రోడ్డు విస్తరణ సమయంలో దారికడ్డంగా ఉన్నానని సర్కారోళ్ళు నన్ను నరికేస్తానంటే అక్కడి ప్రజలు నన్ను నరకనియ్యలే. ఇప్పటికీ నన్ను భాగ్యనగరపోళ్లు గౌరవంగా చూసుకుంటున్నరు.

నేను రుచినే కాదు. ఆరోగ్యాన్ని గూడ ఇస్త. నాలో 'సి' విటమిన్ ఎక్కువగా ఉన్నది. ఇది పెయికెంతో మంచిది. చింతపుల్లలతోటి పండ్లు తోమితే పండ్లకు, చిగుళ్ళకు మంచిది. నా ఆకులతోటి కాపితే పెయి నొప్పులు తగ్గుతయి. నా బెరడు మందులకు పనికొస్తది. చింతపండు పులుసు, చారు మలబద్ధకం దూరం చేస్తది. నీళ్ళలోని ఫ్లోరైడ్‌తో వచ్చే రోగాలను కూడా తగ్గిస్తది.


నేను వంటలోకే కాదు. వంటచేయడానికి కూడ కట్టెలిస్త. నా బొగ్గులకు ఒక ప్రత్యేకత ఉన్నది. అవి కణకణ మండుతై. ఎక్కువ కాకను ఇస్తయి. ఎక్కువసేపు కాలుతయి. అందుకే "చింతనిప్పు" అన్నమాట పుట్టింది. కోపంతో కండ్లు ఎర్రగైనప్పుడు ఈ మాట వాడుతరు. అట్లనే ఎటువంటి స్థితిలో అయినా పౌరుషంగా ఉండేటోడిని "చింత చచ్చినా పులుపు చావలేదని" అంటరు. నేను అంత సులభంగ రాలను. అందుకే "మంత్రాలకు చింతకాయలు రాలవు" అన్న మాట పుట్టింది. కమ్మల కత్తితో కోస్తే గుత్తులు గుత్తులు రాలుతయి. ఇది చూసి, ఎవరైనా గుంపులు గుంపులుగా పడితే "చింతకాయలల్లె రాలిపోతున్నరు" అంటరు. కొద్దిగ గూడ చింత లేకుండ బతికేటోడిని చూసి వీనికి "చింతాకంత చింత కూడ లేదురా!" అంటరు.

విన్నరా! నా పేరును గూడ ఎంత సక్కగ వాడుకున్నరో! తెలిసింది కదా! నేను మీకు ఎన్ని రకాలుగా మేలుజేస్తనో! నాకు ఆయుష్షు గూడ ఎక్కువే! ఎక్కువ కాలం బతుకుత. మీ బతుకుకు ఆసరవుత. చింతచెట్టు ఉంటేచాలు. మీకు ఏ చీకూ చింతలూ ఉండవు. సరే! మీ అలసట దీరింది కదా! ఇగ ఇంటికిపొండి. ఇంకోమాట. నాకాడికి వచ్చినోళ్ళను వొట్టిచేతుల పంపను. ఇగొ – నా చిగురు తినుకుంట పొండి. ఇన్ని చింతకాయలు తీస్కపొయ్యి అమ్మ కియ్యండి.

SCERT TELANGANA

## ఇవి చేయండి

### I. వినడం, ఆలోచించి చెప్పడం



(అ) చింతచెట్టును తెలంగాణ కల్పవృక్షమని అనవచ్చా? ఎందుకు?

(ఆ) చింతచెట్టులాగ మనకు ఉపయోగపడే చెట్లు ఏవేవి ఉన్నాయి? వాటివల్ల ఏమేం మేలు జరుగుతుంది?

## II. ధారాళంగా చదువడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



(అ) "చింత నిప్పులు" అన్న పదం పాఠంలో ఉన్నది కదా! వీటిని జాతీయాలు అంటారు. పాఠంలో అలాంటి పదాలను గుర్తించి వాటికింద గీత గీయండి. రాయండి.

______ ______ ______

______ ______ ______

______ ______ ______

(ఆ) పాఠంలో ఉన్న సామెతల కింద గీత గీయండి. వాటిని ఇక్కడ రాయండి.

______

______

______

______

______

(ఇ) పాఠం చదువండి. కింది పట్టిక పూరించండి.

| పేరా సంఖ్య | పేరాలో వచ్చిన ముఖ్యమైన పదాలు | పేరాకు శీర్షిక |
|---|---|---|
| 3 | | |
| 5 | | |
| 9 | | |

(ఈ) కింద ఇచ్చిన సూచనల ఆధారంగా పదం కనుక్కొని రాయండి.

(1) రెండక్షరాల పదాన్ని నేను
ఇంట్ల మొగ్గను బయటపువ్వును
ఎండకు వానకు అండగుంటను
ఎవరినీ నే నెవరినీ?
(పాఠంలో 1వ పేరాలో ఉన్నాను. వెతికి రాయండి.) ______

SCERT TELANGANA

(2) నేను నాలుగక్షరాల పదాన్ని
మొదటి రెండక్షరాలకు అర్థం బాధ, దిగులు
చివరి రెండక్షరాలు కలిపితే
కాయలల్లో పండ్లల్లో ఉంటా
(తెలువడం లేదా! పాఠంలో 3వ పేరాలో ఉన్నాను. వెతకండి.) ______________

(3) నేను నాలుగక్షరాల పదాన్ని
మొదటి రెండక్షరాలతో ఒక జంతువు పేరు
పాఠంలో 5వ పేరాలో ఉన్నాను.
అర్థం కాలేదా? గుడిలో ప్రసాదాన్ని. ______________

(4) నేను మూడక్షరాల పదాన్ని
8వ పేరాలో ఉన్నాను
ఎటునుండి చదివినా ఒకటే
చాలా మందికి నా రుచి ఇష్టం.
చదువండి... వెతకండి... ______________

## III. ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)



(అ) చింతచెట్టు ఉపయోగాలు రాయండి.

(ఆ) "చింత చచ్చినా పులుపు చావదు" అంటే ఏమిటి? దీనిని ఏ సందర్భంలో ఉపయోగిస్తారు?

(ఇ) చెట్లను ఎందుకు పెంచాలి?

## IV. పదజాలం



(అ) కింది వాక్యాలను చదువండి. గీత గీసిన పదాల స్థానంలో దానికి వ్యతిరేక అర్థాన్నిచ్చే పదాలు చేర్చి వాక్యాలను తిరిగి రాయండి.

ఉదా: అఖిల్ కొత్త బట్టలు వేసుకున్నాడు.

అఖిల్ పాత బట్టలు వేసుకున్నాడు.

(1) మా ఊరికి బడి చాలా దూరం.

(2) రవి ఇల్లు చాలా పెద్దది.

(3) మా ఇంటి ముందర చెట్టు ఉంది.

(4) సీతకు తెలుగులో ఎక్కువ మార్కులు వచ్చాయి.

SCERT TELANGANA

**(అ) పాఠంలో మీరు చింతకాయ గురించి చదివారు కదా? చెట్లకు కాసేవాటిని కాయలు అంటారు. మరి చెట్టుకు కాయని కాయ ఒకటుంది తెలుసా అది "తలకాయ" కింది ఆధారాలతో అలాంటి పదాలు రాయండి.**

| | |
|---|---|
| (1) నత్త కాని నత్త ________ | (2) జనం కాని జనం ________ |
| (3) రాయి కాని రాయి ________ | (4) దేశం కాని దేశం ________ |
| (5) రసం కాని రసం ________ | (6) కర్ర కాని కర్ర ________ |
| (7) తాళం కాని తాళం ________ | (8) రాణి కాని రాణి ________ |
| (9) కోడి కాని కోడి ________ | (10) రాజు కాని రాజు ________ |
| (11) పాలు కాని పాలు ________ | (12) మాట కాని మాట ________ |

**(ఇ) కింది కథను చదవండి. ఖాళీలలో సరైన జాతీయాలు ఉంచి కథను రాయండి.**

(మిర్రి మిర్రి చూసుకుంటు, బిత్తరపోయి, చింతనిప్పు, అరికాలి మంట నెత్తికెక్కింది, చీకూచింత, జారుకున్నడు, చిర్రు బుర్రు, చింతాకంత.)

గౌరయ్యకు ____________ చింత లేదు. ఎప్పుడూ ఏ ____________ లేకుండా హాయిగా ఉంటడు. ఆ రోజు గూడ పొద్దుగాలనే బువ్వదిని నిరందిగ కూర్చున్నడు. ఇంతట్ల యజమాని గుడిసెలకొచ్చి గౌరయ్యను ____________, ____________లోలె కండ్లేసుకొని, ____________ లాడుకుంట ఇంతెత్తు లేచిండు. పని ఎగ్గొట్టి ఈడ కూసొని ఏం మామ్లా జేస్తున్నవ్? అని తిట్టవట్టిండు. గౌరయ్యకు ____________. "ఇగో సేటూ! నేను రీతి దప్పలేదు. ఇయ్యాల ఏ వారమనుకున్నవు? ఐతారం కాదా! పనికెందుకొస్త?" అన్నడు. యజమాని ____________ చూసిండు. కుయ్యి కుటుక్కు మనకుండ ____________.

SCERT TELANGANA

## V. సృజనాత్మకత / ప్రశంస



(అ) చింత చెట్టు స్వగతం తెలుసుకున్నారు కదా! ఈ పాఠం ఆధారంగా మామిడి చెట్టు స్వగతం గురించి రాయండి.

## VI. భాషను గురించి తెలుసుకుందాం



(అ) 'గోపిదప్పు' పాఠం చదువండి. ఆ పాఠంలో విభక్తి ప్రత్యయాల కింద గీత గీయండి. వాటిని చెప్పండి.

(ఆ) కింది వాక్యాలను విడదీసి రెండు వాక్యాలుగా రాయండి.

ఉదా: వ్యాసుడు కాశీనగరానికి వచ్చి, తపస్సు చేశాడు,

వ్యాసుడు కాశీనగరానికి వచ్చాడు. వ్యాసుడు తపస్సు చేశాడు.

(1) మాధవ్ మైదానానికి పోయి, ఖోఖో ఆట ఆడాడు.

________________________________________

(2) ప్రకాశ్ బడికి వచ్చి, గోడమీద వార్తలు రాశాడు.

________________________________________

(3) మామయ్య రాగిజావ తాగి, పేపరు (దినపత్రిక) చదివాడు.

________________________________________

(4) నిఖిల్ కథల పుస్తకం చదివి, కథను చెల్లెలికి చెప్పాడు.

________________________________________

(5) పిల్లలు బొమ్మలు గీసి, రంగులు వేశారు.

________________________________________

(ఇ) కింది రెండు వాక్యాలను కలిపి ఒకే వాక్యంగా రాయండి.

ఉదా: యాదయ్య పూలు తెచ్చాడు. యాదయ్య పూల గుత్తులు తయారుచేశాడు.

యాదయ్య పూలు తెచ్చి, పూలగుత్తులు తయారుచేశాడు.

SCERT TELANGANA

(1) చాందిని పాటలు పాడింది. చాందిని బహుమతులు గెల్చుకున్నది.

______________________________

(2) భాస్కర్ సంచి తీసుకొన్నాడు. భాస్కర్ రైతుబజారు కెళ్ళాడు.

______________________________

(3) రజని బట్టల దుకాణానికి వెళ్ళింది. రజని పాప కోసం బట్టలు కొన్నది.

______________________________

(4) రహీం రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు. రహీం రైలు ఎక్కాడు.

______________________________

(5) కుందేలు క్యారెట్ తిన్నది. కుందేలు పొదలోకి వెళ్ళింది.

______________________________

## ప్రాజెక్టు పని



**చింతపండుతో తయారుచేసే ఏదైనా వంటకం ఎట్లా తయారుచేస్తారో అడిగి తెలుసుకొని రాయండి.**

## నేనివి చేయగలనా?



1. చింత చెట్టును తెలంగాణ కల్పవృక్షమని ఎందుకన్నారో చెప్పగలను. అవును / కాదు
2. పాఠంలోని జాతీయాలు, సామెతలు గుర్తించి రాయగలను. పట్టిక పూరించగలను. అవును / కాదు
3. చింత చెట్టు ఉపయోగాలు సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు
4. మామిడి చెట్టు స్వగతం గురించి రాయగలను. అవును / కాదు






"వృక్షో రక్షతి రక్షితః"

చెట్టును మనం రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది.

SCERT TELANGANA

# పదాలు - అర్థాలు

## అర్థాలు

**అ**

| | | |
|---|---|---|
| అంకుశం | = | ఏనుగు కుంభస్థలంమీద పొడిచే సాధనం |
| అంజలి | = | రెండు అరచేతులు తెరిచి ప్రార్థించడం |
| అంటువ్యాధి | = | ఒకరి నుండి మరొకరికి వ్యాపించే రోగం |
| అండగా | = | ఆధారంగా, ఆసర, దన్నుగ, తోడుగా |
| అంధకారం | = | చీకటి |
| అంబరం | = | ఆకాశం |
| అంశ | = | వంతు, భాగం |
| అఖండదీపం | = | నిరంతరం వెలిగే దీపం |
| అజ్ఞుడు | = | తెలివిలేనివాడు |
| అడకువ | = | అణకువ, వినయము |
| అధిపా | = | ఏలేవాడా! ప్రభువా! |
| అనువు | = | అనుకూలము, యోగ్యత |
| అన్యులు | = | ఇతరులు |
| అప్రియము | = | ఇష్టములేనిది |
| అభివాదం | = | నమస్కారం |
| అభిషేకం | = | స్నానము |
| అద్ర | = | గది |
| అరిష్టం | = | కీడు |
| అలంకరణ | = | ముస్తాబు, సింగారించుకోవడం |
| అలరు | = | వికసించు, ఒప్పు |
| అలుగు | = | మత్తడి, చెరువు నిండగ ఎక్కువైన నీరు పోయే ప్రదేశం |
| అలుగులు | = | బాణములు |
| అవని | = | భూమి |
| అశాంతి | = | శాంతిలేకపోవడం |
| అష్టోత్తరశతం | = | నూట ఎనిమిది |

**ఆ**

| | | |
|---|---|---|
| ఆకర్షణ | = | ఆకట్టుకోవడం |
| ఆత్మవిశ్వాసం | = | తనపై తనకున్న నమ్మకం |
| ఆదా | = | పొదుపు, మిగులు |
| ఆధునికత | = | కొత్తది, నవీనం |
| ఆయుధం | = | అస్త్రం |
| ఆర్యులు | = | శ్రేష్ఠులు |
| ఆళి | = | గుంపు, సమూహం, వరుస |

**ఇ**

| | | |
|---|---|---|
| ఇనాం | = | కానుక, బహుమానం |
| ఇరవు | = | స్థానము, తగిన |

**ఉ**

| | | |
|---|---|---|
| ఉత్పత్తి | = | పుట్టుక, తయారుచేయడం |
| ఉర్వి | = | భూమి |

**ఊ**

| | | |
|---|---|---|
| ఊకె | = | ఎప్పుడు, మాటిమాటికి |
| ఊట | = | నీళ్ళూరేస్థలం |
| ఊరడి | = | ఉపశమనం, ఊరట |

**ఎ**

| | | |
|---|---|---|
| ఎక్కుడు | = | ఎక్కువ |
| ఎగిసిన | = | ఎగిరిన |
| ఎగ్గులు | = | నిందలు, తిట్లు |
| ఎన్ను | = | ఎంచు, లెక్కపెట్టు |

**ఒ**

| | | |
|---|---|---|
| ఒడిసింది | = | పూర్తయ్యింది, అయిపోయింది |
| ఒనరు | = | ఒప్పు, కలుగు |
| ఒరులు | = | ఇతరులు |

**క**

| | | |
|---|---|---|
| కదనభీతుడు | = | యుద్ధమంటే భయపడేవాడు |
| కనికట్టు | = | ఇంద్రజాలం, మాయచేయడం |
| కయ్యం | = | కొట్లాట |
| కర్షకుడు | = | రైతు |
| కరుణాపరులు | = | దయగలవారు |


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

కల్పతరువు = కోరికలు తీర్చే చెట్టు, దేవలోక వృక్షం
కాలుడు = యముడు, మృత్యువు
కీర్తి = ఘనత, ఖ్యాతి
కేతనం = జెండా, పతాకం
కేరింతలు = ఉత్సాహంతో వేయు కేకలు
కొరగాని = పనికిమాలిన
కొల్లగొట్టు = దోచుకొను
కోట = ఖిల్లా, దుర్గం

**ఖ**

ఖగం = పక్షి, పిట్ట

**గ**

గండదీపం = గండాలు / కష్టాలు పోవడానికి పెట్టె దీపం, ఎప్పుడూ వెలుగుతూ ఉండేదీపం
గర్జించిన = ఉరిమిన
గిరాకి = వస్తువులెక్కువగా అమ్ముడవడం
గిర్ని = గింజలను పిండిగా చేసే యంత్రం
గుడ్లప్పగించి = బీరిపోయి
గుమ్మి = ధాన్యం నిలువ చేసేది

**ఘ**

ఘనమైన = గొప్పదైన

**చ**

చలువ = చల్లదనం
చతురత = నైపుణ్యము
చావడి = ఇంటిముందు స్థలం
చిత్తం = మనసు
చురకత్తి = చిన్నకత్తి
చూవె = చూడుమీ!
చెన్ను = అందం
చైతన్యం = తెలివి
చౌరస్త = నాలుగు రోడ్లు కలిసే చోటు

**జ**

జనసమ్మర్దం = ఎక్కువ జనం
జన్మహక్కు = పుట్టుకతో వచ్చే హక్కు
జయంతి = పుట్టినరోజు, జన్మదినం
జలకమాడు = స్నానం చేయు
జలాశయం = అధికంగా నీరు నిలవ ఉండేచోటు ఉదా: చెరువు
జాగీరు = రాజులు బహుమానంగా ఇచ్చిన భూమి
జిత్తులమారి = మోసకారి

**ట**

టక్కరి = మోసకాడు

**డ**

డైరీ = దినచర్య రాసే నోటు పుస్తకం

**త**

తంతు = పద్ధతిగా చేసే పని, ఉపాయం
తనువు = శరీరము
తరుణం = సమయం
తలపు = జ్ఞప్తికి తెచ్చుకొను
తివాచీ = కిందపరిచేది
తెఱంగు = విధము, చక్కనైన
త్రొవ్వ = దారి, బాట, మార్గం
త్రివర్ణం = మూడు రంగులు

**ద**

దండి = గొప్ప
దంతం = పన్ను
దర్శించు = చూచు
దరువు = చప్పుడు
దానహీనుడు = లోభి, పీసిడి, దానంచేయనివాడు
దీవెన = ఆశీర్వాదం
దుర్మతులు = చెడుబుద్ధి కలిగిన వారు
దూప = దప్పిక, దాహం
దేదీప్యమానం = బాగా వెలిగేటి కాంతి
దొడ్డ = గొప్ప, పెద్ద
దోస్తులు = స్నేహితులు, మిత్రులు

**ధ**

ధర్మజ్ఞుడు = విధి, ఆచారము, పుణ్యము, న్యాయము తెలిసినవాడు
ధర్మము = పుణ్యము, న్యాయము
ధార్మికుడు = పుణ్యాత్ముడు

SCERT TELANGANA

## న

| | | |
|---|---|---|
| నమ్రత | = | వినయం, అణుకువ |
| నమామి | = | నమస్కారం |
| నరవర | = | రాజు |
| నశించు | = | నాశనమగు |
| నాతి | = | స్త్రీ |
| నిగిడి | = | తొందరపడి |
| నిమగ్నం | = | లీనం కావడం |
| నిరాశ | = | ఆశలేకపోవడం |
| నిష్ఠురత | = | కఠినత |
| నుడువుట | = | చెప్పుట |
| నృత్యం | = | నాట్యం |
| నేస్తం | = | దోస్తు, మిత్రుడు, స్నేహితుడు |
| నైవేద్యం | = | దేవునికి నివేదించునది |
| నౌక | = | ఓడ |

## ప

| | | |
|---|---|---|
| పంతం | = | పట్టింపు |
| పటం | = | చిత్రం, బొమ్మ |
| పట్టుదల | = | వదలని పట్టు, |
| పతాకం | = | జెండా |
| పథము | = | తోవ, దారి |
| పన్నీరు | = | అత్తరు |
| పరదా | = | తెర |
| పర్జన్యం | = | మేఘం |
| పరవశం | = | ఆనందంలో మునిగి పోవడం |
| పరాయణము | = | ఆశ్రయము, ప్రాపు |
| పరాయిపాలన | = | ఇతరుల పాలన |
| పరులు | = | ఇతరులు |
| పరుషములు | = | కఠినమైనటువంటి |
| పలువన్నెలు | = | అనేక రంగులు |
| పశ్చాత్తాపం | = | చేసిన తప్పు తెలుసుకొని బాధపడడం |
| పాతకములు | = | పాపములు |
| పుణ్యక్షేత్రం | = | పవిత్రస్థలం |
| పుష్కరిణి | = | కోనేరు, తామరకొలను |
| పూనకం | = | ఆవహించు |
| పెనిమిటి | = | భర్త |
| పెయ్యి | = | దేహం, శరీరం |
| పొడ | = | రూపు |
| ప్రణామం | = | నమస్కారం, వందనం |
| ప్రత్యక్షం | = | కంటితో చూసింది |
| ప్రతాపం | = | పరాక్రమం, వీరత్వం, శౌర్యం |
| ప్రధానం | = | ముఖ్యం |
| ప్రమిద | = | మట్టితో చేయబడిన దీపపు పాత్ర |
| ప్రసన్నరూపం | = | ప్రశాంతమైన రూపం |
| ప్రియము | = | ఇష్టం, స్నేహం |
| ప్రీతి | = | ఇష్టము |

## ఫ

| | | |
|---|---|---|
| ఫిరంగి | = | తోపు |
| ఫిర్యాదు | = | ఆరోపించు |

## బ

| | | |
|---|---|---|
| బన్నము | = | అవమానము |
| బల్మి | = | బలం |
| బస | = | విడిది |
| బువ్వ | = | అన్నం, ఆహారం |
| బోళ్ళు | = | వంటపాత్రలు |

## భ

| | | |
|---|---|---|
| భంగపడుట | = | అవమానపడుట |
| భవిష్యవాణి | = | జరగబోయే దానిని చెప్పేది |
| భాషలు | = | మాటలు |
| భూతము | = | ప్రాణి |
| భోగం | = | సుఖం |

## మ

| | | |
|---|---|---|
| మంద | = | గుంపు |
| మత్త | = | మదం |
| మదము | = | గర్వము |
| మధురం | = | తీయనైనది |
| మనము | = | మనస్సు |
| మహిమ | = | గొప్పతనం |
| మాసం | = | నెల |

SCERT TELANGANA

మిథ్య = అబద్ధము, భ్రమ, భ్రాంతి
మురిపెం = ముద్దుగాచూడడం
ముస్తాబు = అలంకరణ
మ్యూజియం = వస్తు ప్రదర్శనశాల
మొక్కు = దండంపెట్టు
మోదం = సంతోషం, ఆనందం
మోసకార్యం = వంచనతో కూడిన పని

**య**

యథావిధిగా = ఎప్పట్లాగనే, విధిని అనుసరించి
యాది = జ్ఞాపకం, గుర్తు
యోచించు = ఆలోచించు

**ర**

రంగం = వేదిక
రావం = శబ్దం
రికామి = తీరిక
రుసరుస = కోపపడు
రౌద్రం = భయంకరం

**ల**

లగ్గం = లగ్నం, పెండ్లి, వివాహం
లోభము = పిసినారితనము, అత్యాశ
లాలస = కోరిక

**వ**

వచనములు = మాటలు
వధించిన = చంపిన, సంహరించిన
వనం = అడవి
వర్షాభావం = వర్షంలేకపోవడం
వలువలు = బట్టలు, వస్త్రములు
వాకిలి = ఇంటిముందు భాగం
విత్తము = ధనము
వినయము = అణకువ, నమ్రత
విముక్తం = విడవబడింది
వివేకం = తెలివి, జ్ఞానం
విహీనుడు = లేనివాడు

వృత్తము = నడవడి, నడత
వెండియు = మరిన్ని, మరల

**శ**

శపథము = ప్రతిజ్ఞ, ఒట్టు
శరణు = ఆశ్రయము, రక్షణము
శాంతి = సుఖం, ఆనందం
శౌర్యం = బలం
శ్రవణం = వినుట

**ష**

షేర్వాణి = ముస్లింలు వేసుకొనేకోటు

**స**

సంగ్రహాలయం = అపురూపమైన వస్తువులను సేకరించి భద్రపరిచే చోటు (మ్యూజియం)
సంప్రదాయం = పరంపర, ఆచరించునది
సంబురం = సంతోషం
సజ్జనులు = మంచివారు
సత్తువ = బలం, శక్తి
సమరం = యుద్ధం
సమ్మతం = అంగీకారం
సరోవరం = తామరకొలను
సహనం = ఓపిక
సాధించుట = నెరవేర్చుట, సమకూర్చుట
సామము = మంచితనము, శాంతము
సింగిడి = ఇంద్రధనుస్సు
సింతజేయక = ఆలోచించక
సిపాయి = సైనికుడు
సిరులు = సంపదలు
సువ్రత = పుణ్యకార్యము
సువ్వే = చూడుమీ!
సౌకర్యం = సుఖం
స్వాతంత్ర్యం = స్వేచ్ఛ

**హ**

హడలెత్తించు = భయపెట్టు, బెదరగొట్టు
హితము = మేలు



SCERT TELANGANA